నడుస్తున్న తెలంగాణ

ISSN 2349-2376

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

సంపుటి : 15 సంచిక : 11 177 నవంబర్ - డిసెంబర్ 2025 హైదరాబాద్

- 'పుస్తకం' అచ్చులొత్తుతున్న కుర్రకారు
- నడుస్తున్న తెలంగాణ - ప్రజావాణి ప్రతిబింబం
- కిందివర్గాల ప్రాతినిధ్యం ఎక్కడ?
- మాదిరెడ్డి సులోచన నవలలు - తెలంగాణ స్పృహ
- విద్యావ్యవస్థ లోపాలను చర్చిస్తున్న తెలంగాణ కథ
- ద్రావిడ జాతి లిటరరీ స్నైపర్
- జీవితమే పాటై వెలిగిన అందెశ్రీ

నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

ISSN 2349-2376

నవంబర్-డిసెంబర్ 2025

సంచిక : 11

సంపుటి : 15

గౌరవ సంపాదకులు

ప్రొ॥ అడపా సత్యనారాయణ

సలహా మండలి

అల్లం నారాయణ

చైర్మన్(పూర్వ)-ప్రెస్ అకాడమి

ప్రొఫెసర్ చింతా గణేష్

ప్రిన్సిపాల్ (పూర్వ), ఆర్ట్స్ కళాశాల, ఓయు.

ప్రధాన సంపాదకుడు

ప్రొఫెసర్ చింతకింది కాశీం

సంపాదకురాలు

స్నేహలత ఎం.

సంపాదకవర్గం

ప్రొఫెసర్ ఎ. సిల్మానాయక్,

ప్రిన్సిపాల్, టి.ఎస్.పి. కళాశాల

డా॥చంద్రయ్య ఎస్. అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

డా॥శివరాత్రి సుధాకర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

డా॥ఇమ్మిడి మహేందర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

డిటిపి, లే ఔట్ : స్నేహ

కవర్ డిజైన్ : క్రాంతి

రచనలు పంపాల్సిన చిరునామా

స్నేహలత ఎం.,

ఇంటి నెం.2-95, ఫ్లాట్ నెం. 301,

వైష్ణవి స్మార్ట్, రోడ్ నెం.2,

కాకతీయ నగర్, హబ్సిగూడ

హైదరాబాద్-500 007.

మెయిల్: nadusthunnatelangana@gmail.com

ఫోన్ నెం.: 9290745490

సంపాదకుని ఉత్తరం

అవును
నాకు
విద్య పవిత్రమయింది కాదు
దొంగచాటుగా గోడదూకి
రాత్రిపూట బడిలో
నన్ను ప్రేమించిన
మొదటి ప్రియురాలు
విద్య గడ్డివాముల్లో
ఎద్దుల కొట్టంలో
రాళ్ల సందుల్లో
నా పెదాల మీద రాసిన
తొలిప్రేమలేఖ

విద్య అగ్రహారాల లక్ష్మణరేఖను
తన కొనగోటితో చెరిపివేసి
మడిబట్టల ఉక్కపోతను దాటుకుంటు
వెలివాడల చిరుగాలికి
పరవశించిన లేతవెన్నెల
ఇపుడు విద్య

డిసెంబర్ 31, 2025

నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ అన్నట్లు ప్రజానుకూలమైన భిన్న ఆలోచనలకు మా పత్రికలో చోటుంటుంది. కనుక ఈ పత్రికలో ముద్రించిన అభిప్రాయాలు రచయితలవే. సంపాదకవర్గానికి ఏకీభావం ఉండనవసరం లేదు.

తెలంగాణ తొవ్వ

సంపాదకీయం

'పుస్తకం' అచ్చులొత్తుతున్న కుర్రకారు — **డా. చంద్రయ్య శివన్న** — 5

సామాజికం

నడుస్తున్న తెలంగాణ-ప్రజావాణి ప్రతిబింబం — **డా. ఇడికోజు శ్రీనివాసాచారి** — 6

దారి చెప్పే కథలు

కిందివర్గాల ప్రాతినిధ్యం ఎక్కడ? — **ఇస్రం సంతోష్** — 7

సాహిత్య పరిశోధన

తెలుగుభాష-సి.పి.బ్రౌన్ కృషి — **డా. కొల్లేటి రవిబాబు** — 8

విద్యావ్యవస్థ లోపాలను చర్చిస్తున్న తెలుగు కథ — **డా. ఎ.రవీంద్రబాబు** — 11

మాదిరెడ్డి సులోచన నవలలు-తెలంగాణ స్పృహ — **డా. స్వప్న భువకర్** — 15

సామాజిక సంకెళ్ల విముక్తి స్వరం-అయోతీదాస్ పండితర్ — **గడ్డకింద మాణిక్యం** — 20

సాహిత్య విమర్శ

పలుకుబళ్లు-జాతీయాలు-సామెతలు-ఊతపదాలు — **డా. ఇమ్మిడి మహేందర్** — 30

తెలంగాణ పరిశోధనకు విలువైన చేర్పు
శ్రీరంగరాజు కేశవరావు సాహిత్యం-పరిశీలన — **డా. చంద్రయ్య శివన్న** — 36

సాహిత్యం/ కథ

మబ్బులమాటున జాబిలమ్మ — **చింతాడ సుశీల** — 40

సాహిత్య సమీక్ష

ద్రావిడజాతి లిటరరీ స్నైపర్ — **విప్లవకుమార్ మందుల** — 45

యాది

జీవతమే పాటై పెనవేసుకొని వెలిగిన సాహితీదీపం — **శాఖమూరి రవి** — 49

సంపాదకీయం

'పుస్తకం' అచ్చులొత్తుతున్న కుర్రకారు

డా.చంద్రయ్య శివన్న

తెలుగు పుస్తక ప్రచురణారంగం మునుపెన్నడూ లేనంతగా నూతన పోకడలు పోతోంది. ముఖ్యంగా, ఈ పదేళ్ల కాలంలో ప్రచురణారంగం అత్యంత వేగంగా మారిపోయింది. ప్రచురణారంగాన్ని 'డిజిటల్ తెర'లు శాసించే స్థాయికి చేరడం, వాటిద్వారా కొత్త పాఠకవర్గం ఉనికిలోకి రావడం, వారి అభిరుచులకు అనుగుణంగా ప్రచురణకర్తలు నూతన వ్యూహాలను రచించుకోవడం మొదలైనవి ఈ కాలంలో అత్యంత వేగంగా జరిగిపోయాయి. సాంకేతికతను ఉపయోగించుకొని అత్యంత వేగంగా ప్రచురణ, అమ్మకాలకోసం డిజిటల్ ప్లాట్ ఫారమ్‌లు అందిపుచ్చుకొనే 'కుర్రకారు' ప్రచురణారంగంలోకి ఒక 'పాషన్'గా రావడం అత్యంత ముఖ్యమైన అంశం.

ఛాయా పబ్లికేషన్స్, అన్వీక్షకి ప్రచురణలు, ఎన్నెల పిట్ట, అజ్జు పబ్లికేషన్స్, ఒక పబ్లికేషన్స్, ఎలమి పబ్లికేషన్స్, రేగడి అచ్చులు, ఝాన్సీ పబ్లికేషన్స్, ప్రేమలు–పుస్తకాలు, కడలి రైట్స్, బాల పబ్లికేషన్స్ మొదలైనవి ప్రచురణారంగంపై ఆశాభావంతో పదుల సంఖ్యలో పుట్టుకొచ్చాయి. ఈ ప్రచురణకర్తల్లో అత్యధికంగా 'కుర్రకారు' ఉండటం ఆహ్వానించదగ్గ పరిణామం. తెలుగు ప్రచురణారంగం భవిష్యత్తుని ఇది నిర్దేశిస్తుంది. వీరిలో కొంతమంది సినిమారంగంనుంచి ఉన్నారు. మరికొంతమంది సాఫ్ట్‌వేర్ రంగంనుంచి ఉన్నారు. ఇంకొందరు 'మంచి' సమాజంకోసం కలగనే వారున్నారు. కొందరు 'ప్యాషన్'గా ముందుకొచ్చినవారున్నారు. కొందరు ఇందులో ఇష్టంతోపాటూ జీవనభృతిని చూసుకుంటున్నవారూ ఉన్నారు. వీరందరి ఆలోచనల్తో ప్రచురణారంగం కొత్తపుంతలు తొక్కుతుంది. ఈ ప్రచురణకర్తలు 'నాన్ ఫిక్షన్, 'ఫిక్షన్, 'సైన్స్ ఫిక్షన్, హిస్టారికల్ ఫిక్షన్ కథలుగా, నవలలుగా రాయించి ముద్రిస్తున్నారు.

డిజిటల్ పాఠకులవల్ల పఠన సంస్కృతిలో కూడా మార్పులు వచ్చాయి. సుదీర్ఘమైన నవలల కంటే క్లుప్తమైన రచనలకు ఆదరణ పెరిగింది. 'టెర్రిబ్లీ టైనీ టేల్స్' వంటి అంతర్జాతీయ ధోరణుల ప్రభావంతో తెలుగులో 'మైక్రో కథలు' ట్రెండ్ ప్రారంభమైంది. 'ప్రతిలిపి' వంటి ప్లాట్‌ఫారమ్‌లు కథలను కేవలం చదవడమే కాకుండా, ఆడియో, కామిక్స్ రూపాల్లోకి మార్చి సరికొత్త పాఠకులను ఆకర్షించాయి. 'చదువు' యాప్ ఈ–బుక్స్, ఆడియో బుక్స్‌ను అందించడం ప్రారంభించి, ప్రచురణరంగాన్ని సరికొత్తగా తీర్చిదిద్దింది. ఈ యువప్రచురణకర్తలు కొత్తగా వివిధ సామాజిక సమూహాలనుంచి ఎదిగొచ్చిన రచయితల, కవుల జీవిత అనుభవాలను ముద్రించి, ప్రోత్సహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధిచెందిన రచనల్ని ఎంపిక చేసుకొని అనువాదాలు చేయిస్తున్నారు. యువ అనువాదకులకు శిక్షణ ఇప్పించి వారిచేత అనువాదాలు చేయించడం ఈ కాలంలో జరిగిన మరో ముందడుగు. అనువాదాల పెరుగుదల, డిజిటల్ తెరమీద అధ్యయనం, పాఠకుల అభిరుచుల్లో వచ్చిన మార్పులు, పుస్తక ప్రచురణల డిజిటల్ మార్కెటింగ్ వ్యూహాలు, వీటన్నింటినీ ఎదుర్కొని నిలవడం సంప్రదాయ ప్రచురణసంస్థలకు ఇపుడు ఒక పెద్ద సవాల్. ఎమ్మెస్కో, హైదరాబాద్ బుక్ ట్రస్ట్, నవచేతన పబ్లిషింగ్ హౌస్, విశాలాంధ్ర, మంచి పుస్తకం, మలుపు, పర్‌స్పెక్టివ్స్ ప్రచురణలు లాంటివి కూడా నూతన సాంకేతికతను అడాప్ట్ చేసుకుంటే కానీ నిలబడలేని స్థితిని ఈ 'కుర్ర' ప్రచురణకర్తలు కల్పించారు.

'డిజిటల్ ప్లాట్‌ఫారమ్'లవల్ల గత పదేళ్లలో తెలుగు పుస్తక ప్రచురణరంగం ఒక కొత్తరూపును సంతరించుకుంది. ఇవేకాకుండా వాట్సాప్, ఇన్‌స్టా వంటి సోషల్ మీడియా మాధ్యమాలవల్ల అమ్మకాల ప్రచారం జరుగుతోంది. వారికున్న ప్యాషన్‌లోంచి పుట్టుకొచ్చిన ఈ 'కుర్ర' ప్రచురణకర్తలకు హృదయపూర్వకంగా స్వాగతం చెబుతోంది నడుస్తున్న తెలంగాణ మాసపత్రిక.

T

సామాజికం

నడుస్తున్న తెలంగాణ-ప్రజావాణి ప్రతిబింబం

● డా. ఇడికోజు శ్రీనివాసాచారి

తెలంగాణ ఆవిర్భావ పోరాట స్ఫూర్తిని, ప్రజల ఆశయాలను, సామాజిక సత్యాలను ప్రతిబింబించే ప్రత్యేక మాసపత్రికగా "నడుస్తున్న తెలంగాణ" 2011 ఫిబ్రవరి నుండి తన ప్రయాణాన్ని ప్రారంభించింది. ప్రారంభం నుండి ఈ పత్రిక సామాజిక శాస్త్రం, చరిత్ర, సాహిత్యం, రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ, సంస్కృతి వంటి విభిన్న రంగాలను లోతుగా పరిశీలిస్తూ ముందుకు సాగుతూ వచ్చింది. ఇది ఒక సాధారణ పత్రిక కాదని, ప్రజా కేంద్ర ఆలోచనలకు వేదికగా నిలుస్తూ, ప్రజల అనుభవాలకు అక్షరరూపం ఇస్తున్న ఒక ప్రత్యేక వేదిక అని చెప్పాలి.

ఈ పత్రికలో పండిత వర్గాల చర్చలే కాకుండా, సామాన్య ప్రజల జీవన వాస్తవాలు, ఆశలు, ఆందోళనలు, విజయాలు అన్నీ ప్రతిధ్వనిస్తాయి. సమాజంలోని ప్రతి వర్గానికి మాటనివ్వడం, వారి అనుభవాలను అక్షరబద్ధం చేయడం ఈ పత్రిక ప్రధాన లక్ష్యం. సమకాలీన సామాజిక, రాజకీయ, సాంస్కృతిక సమస్యలను ఉపరితలంలో కాకుండా లోతుగా విశ్లేషించడం, చరిత్రను కిందివర్గాల దృక్కోణం నుండి అర్థం చేసుకోవడం "నడుస్తున్న తెలంగాణ" ప్రత్యేకత.

సాహిత్య సృజనలోనూ ఈ పత్రికకు ప్రత్యేక స్థానముంది. ఆధునిక కవిత్వం, వ్యాసాలు, కథలు, జ్ఞాపకాలతో పాటు తెలంగాణ భాషా సౌందర్యం, జానపద గీతాలు, ప్రజా సంస్కృతి ఈ పత్రికలో చోటు చేసుకుంటాయి. ఒకవైపు సృజనాత్మకతను పాఠకుల ముందుంచుతూ, మరోవైపు సామాజిక బాధ్యతను నిర్వర్తించడం దీని విశిష్టత. కుల, వర్గ, లింగ అసమానతలు, ఆర్థిక వెనుకబాటు, సామాజిక అన్యాయాలపై ఈ పత్రిక నిర్భయంగా స్పందిస్తుంది. సమానత్వం, న్యాయం, ప్రజాస్వామ్యం అనే విలువలను ప్రోత్సహిస్తూ ముందుకు సాగుతుంది.



ఇప్పటివరకు 14 ఏళ్లకు పైగా విరామం లేకుండా వెలువడుతూ, పాఠకుల విశ్వాసాన్ని సంపాదించింది. పాఠక వర్గం విస్తృతమవుతూ, సాహిత్య, సమాజ, రాజకీయ వర్గాల దృష్టిని ఆకర్షిస్తోంది. ఇది కేవలం పత్రిక మాత్రమే కాదు, తెలంగాణ సమాజానికి అద్దం, ప్రజల వాణికి వేదిక, భవిష్యత్తు నిర్మాణానికి మార్గదర్శిగా నిలుస్తోంది.

ఈ పత్రిక విజయవంతమైన ప్రయాణానికి నిబద్ధతతో కూడిన సంపాదక వర్గం ప్రధాన కారణం. సమాజం పట్ల ప్రేమ, సాహిత్యంపై మమకారం, ప్రజల పట్ల నిబద్ధత పత్రికను ముందుకు నడిపిస్తున్నాయి. అంతిమంగా చెప్పుకోవలసి వస్తే, "నడుస్తున్న తెలంగాణ" పత్రిక ఒక ఆలోచన, ఒక ఉద్యమం, ఒక విలువల ప్రతీక. తెలంగాణ ఆత్మను అక్షరాల్లో బంధించి, సామాజిక న్యాయం, సాంస్కృతిక గౌరవం, సాహిత్య సౌందర్యాన్ని కలగలిపి పాఠకుల ముందుకు తెచ్చే అరుదైన పత్రిక. ఇది మనందరి పత్రిక, ప్రజల పత్రిక.

రచయిత: తెలుగు అధ్యాపకులు

నడుస్తున్న తెలంగాణ ఆన్‌లైన్ వర్షన్ కోసం కింది పేజీలను సంప్రదించవచ్చు.
వెబ్ పేజీ: https://nadustunnatelangana.com

కిందివర్గాల ప్రాతినిధ్యం ఎక్కడ?

ఇస్రం సంతోష్

"ఈ దేశంలోని ఎన్నో చట్టాలు, ప్రభుత్వ విధానాలు, 'పేదల కోసం, దళితుల కోసం, ఆదివాసుల కోసం, మహిళల కోసం, మత మైనార్టీల కోసం నిర్మించబడ్డాయి' కాని అవి అమలు కావు. ఎందుకంటే, వాటిని అమలు చేసే స్థానాలలో ఈ వర్గాల ప్రజలు లేరు. కనుక వీరి కోసం చేసిన ఏ చట్టాలు, విధానాలు అమలుకు నోచుకోవు" అని మానవ హక్కుల ఉద్యమకారుడు ప్రొఫెసర్ బాలగోపాల్ అన్న మాటలు ఇప్పటికీ అక్షరసత్యాలు.

భారత సమాజం కులాలుగా, వర్గాలుగా విభజించబడినదని మనం ఎప్పుడూ చెబుతుంటాం. కానీ, ఆ విభజన చట్టాల్లో మాత్రమే కాదు, అది నిర్ణయాధికారంలో, నాయకత్వంలో, న్యాయ వ్యవస్థలో, విద్యాసంస్థల్లో, మీడియా నిర్మాణంలో బలంగా ఇమిడిపోయి ఉంది. ప్రభుత్వ రిజర్వేషన్లు కొంతమందికి ప్రాతినిధ్యం కల్పించినా, అదే వర్గంలో అట్టడుగుస్థాయిలో ఉన్న సమూహాలు అవకాశాలకు దూరంగానే ఉంటున్నాయి.

ఇకపోతే, అత్యంత ప్రజాస్వామికంగా కనిపించే ఎన్జీఓలు, మీడియా సంస్థలలో కూడా అణగారిన వర్గాల వారి ప్రాతినిధ్యం అంతంత మాత్రమే. అణగారినవర్గాల కష్టాలు బాధలు చూపెట్టి, పనిచేసే ఎన్జీఓలు ఆ వర్గాలవారి సూచనలు, అభిప్రాయాలు తీసుకోకపోవడంలేదు. కొన్ని ఎన్జీఓలయితే కేవలం అణగారినవర్గాల ప్రజలను ఎన్జీఓల దయాదాక్షిణ్యాల మీద మాత్రమే బతికేవారిలాగా మాత్రమే చూస్తున్నాయి. మీడియా కూడా పేదరికం, గొడవలు, వెనుకబాటుతనం వంటి ప్రతికూల నెరేటివ్స్ ను చూపించడంలో పెట్టిన శ్రద్ధ, వారి విజయాలను, సామూహిక చరిత్రను, విద్యావంతులైనవారి ప్రయత్నాలను, సామాజిక నాయకత్వాన్ని చూపడంలో వెనుకబడింది. ఈ విధంగా, మీడియా కూడా కిందివర్గాల వాయిస్ వినిపించకుండా, లేదా పరిమితంగా వినిపించేలా చేస్తుంది.

ప్రాతినిధ్యానికి దూరంచేయడమంటే జీవితాన్ని లిమిట్ చేయడమే. సమసమాజాన్ని స్థాపించాలంటే దేశంలోని అన్ని వ్యవస్థల్లో అన్నివర్గాల ప్రజలకు సమాన ప్రాతినిధ్యం ఉండాలి. దీనికి అన్నివర్గాల ప్రజలు సహకరించాలి. విద్యార్థులు డిబేట్ క్లబ్‌లు, విద్యార్థి సంఘాలలో సమాన ప్రాతినిధ్యం గురించి చర్చించాలి. మెరిట్ అనే పేరు మీద కొందర్ని వెనక్కి నెట్టివేయడాన్ని ప్రశ్నించాలి. ఉద్యోగ (ప్రైవేట్/పబ్లిక్ రంగం) నియామకాలు చేసేటప్పుడు, ఇంటెర్న్‌షిప్‌లలో, ఫెలోషిప్‌లలో అన్నిరకాల నేపథ్యాలు ఉన్నవారిని చేర్చే విధానాలు సృష్టించాలి. మెంటరింగ్ ప్రోగ్రామ్‌లు అమలు చేయాలి. కేవలం "సహానుభూతి" కాదు సాధికారత ఇవ్వడానికి ప్రయత్నించాలి.

ఫిలాంత్రపిస్టులు/ఎన్జీఓలు కిందివర్గాల కోసం పనిచేసే ప్రాజెక్టుల ప్లానింగ్ లో ఆయావర్గాల ప్రజల సూచనలు తీసుకోవాలి. ఆ ప్రాజెక్టుల ఎగ్జిక్యూషన్ కూడా అదేవర్గాల వ్యక్తుల చేతుల్లో ఉండాలి. అణగారినవర్గాల అభివృద్ధి కోసం పనిచేసే ఎన్జీఓల బోర్డుల్లో, నిర్ణయాల కమిటీలలో కిందివర్గ నాయకత్వానికి స్థానం ఇవ్వాలి. రాజకీయవేత్తలు, అణగారినవర్గాల నుండి వచ్చిన నేతలు, కేవలం కీలుబొమ్మలలాగా కాకుండా నిర్ణయాలు కూడా తీసుకునేస్థాయికి విస్తరించాలి. పార్టీ కమిటీలలో, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో సామాజిక న్యాయం ప్రమాణాలను అమలు చేయాలి. మీడియా, ఆకడమిషియన్లు కిందివర్గాల వాయిస్‌ను "కేస్ స్టడీ"గా మాత్రమే చూడకుండా వారిని సహరచయితగా, స్పీకర్‌గా, పాలిసీ పార్టిసిపెంట్‌గా, ఇన్సైడర్ గా ఉంచాలి. కష్టాలు మాత్రమే కాదు, చరిత్ర, విజయాలు, సామర్థ్యాలు కూడా చూపించాలి. "కొన్నివర్గాల ప్రాతినిధ్యాన్ని అడ్డుకొని, వారిని దూరం పెట్టడం ప్రజాస్వామ్యానికి ఒక గొడ్డలి పెట్టు" అని అంబేద్కర్ అన్న మాటలు ఇక్కడ మళ్ళీ గుర్తు రావాల్సిందే. సమాన ప్రాతినిధ్యం ప్రజాస్వామ్యానికి హృదయం లాంటిది.

రచయిత: ఫౌండర్, భీమ్ చిల్డ్రన్ హ్యాపీనెస్ సెంటర్.

సాహిత్య
పరిశోధన

తెలుగుభాష-సి.పి.బ్రౌన్ కృషి

డా. కొల్లేటి రవిబాబు

పరిచయం:

పందొమ్మిదో శతాబ్దంలో ఈస్టిండియా కంపిని పాలనలో చాలా మంది అధికారులు స్థానిక భాషలు నేర్చుకున్నారు. కంపిని వారు తెలుగు భాషను నేర్చుకోవడానికి రెండు కారణాలున్నాయి. ఒకటి తెలుగుభాషను నేర్చుకొని, వారి క్రైస్తవ మతాన్ని తెలుగు ప్రజల్లో వ్యాప్తిచెందించటం. రెండు పరిపాలనా దృష్ట్యా ప్రజలతో వ్యవహార కార్యకలాపాలు జరపడానికి. అలా తెలుగు నేర్చుకున్నవారిలో సర్ విలియం జోన్స్ (1746-94), చార్లెస్ విల్కిన్స్ (1750-1836), కన్నల్ కాలిన్ మెకంజీ (1753-1821), విలీమ్ కెరీ(1761-1834) లాంటి వారున్నారు. వీరులో కొందరు సేవా దృక్పథంతో, భాష, సాహిత్య పరిశోధనా దృక్పథంతో కృషిచేసి తెలుగువారి హృదయాలలో శాశ్వత స్థానం సంపాదించుకున్నారు. అలాంటి కొద్దిమందిలో చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (1798-1884) ఉద్యోగ విధులు నిర్వహిస్తూనే విలువైన సాహిత్య సంపదను భవిష్యత్ తరాలవారికోసం భద్రపరిచాడు.

చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ తన జీవిత సర్వస్వాన్ని తెలుగు సాహిత్య సేకరణకు అర్పించి సార్థకత చేకూర్చుకున్నాడు. ఈస్టిండియా కంపెనీ తరఫున ఎందరో యూరోపియన్లు వర్తకం పేరుతో మన దేశానికి వలస వచ్చారు. పరిపాలనలో భాగమై బ్రిటిష్ ప్రభుత్వానికి లాభాన్ని చేకూర్చారు. అయినా ఇదంతా జరిగి రెండు వందల సంవత్సరాలు దాటినా ఎందుకు గుర్తు తెచ్చుకుంటున్నామంటే, వాళ్లు తమవని తాము చక్కబెట్టుకుంటూనే మనకు ఎంతో కొంత సేవచేశారు. సి.పి. బ్రౌన్ తెలుగు నేనర్చుకునేటప్పుడే మన భాషలోని మాధుర్యానికి, సాహిత్యంలోని గొప్పదనానికి ఆకర్షితుడయ్యాడు. బ్రౌన్ ఏం చేశాడనే వారికీ, వలస ప్రభుత్వ ప్రతినిధి అని చిన్నచూపు చూసేవారికి "ఒంటిచేతి మీదుగా ఏ సాహిత్యానికైనా మళ్ళీ ప్రాణం పోయటం, అందులోనూ ఒక విదేశీయుడు ఆ పని చేయడం నిండా దుష్కరమైన కార్యం. 1825లో తెలుగు సాహిత్యం చచ్చుబడి ఉన్నది. ముప్పది సంవత్సరాలలో నేను దానిని బతికించి నిలబెట్టాను." అని చెప్పుకున్న సి.పి. బ్రౌన్ మాటలు గుర్తు చేస్తూ, తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన సేవ వివరించడం ఈ వ్యాసం ఉద్దేశం.

కుటుంబ నేపథ్యం

బ్రౌన్ పంద్దొమ్మిదో శతాబ్ది పూర్వార్ధంలో 1798, కలకత్తాలో జన్మించాడు. తల్లిదండ్రులు ఫ్రాన్సిస్ కౌలే, డేవిడ్ బ్రౌన్. వారి అయిదుగురు సంతానంలో బ్రౌన్ రెండోవాడు. సువార్త ప్రచారం చేయాలనే సంకల్పంతో భారతదేశం చేరిన క్రైస్తవ బోధకుడు రివరెండ్ డేవిడ్ బ్రౌన్ తన కొడుకు భవిష్యత్తుకు చిన్ననాడే బాటలు వేశాడు. తండ్రి ప్రోత్సాహంతో బ్రౌన్ బాల్యంలోనే హిబ్రూ, అరబ్బీ, గ్రీకు, లాటిన్, హిందూస్తానీ భాషలు నేర్చుకున్నాడు. ఆ జ్ఞానంతో అప్పుడప్పుడు తండ్రికి "ప్రూఫులు చదవడంలో సహాయపడేవారు. ఒకానొక సందర్భంలో తన మిగతా పిల్లలకంటే సి.పి. బ్రౌన్ తెలివైనవాడని డేవిడ్ బ్రౌన్ అన్నాడట. డేవిడ్ బ్రౌన్ తన పిల్లలకు గ్రంథ ఆవిష్కరణ విధానాలు, వివిధ పాఠాంతరాలను సేకరించి తులనాత్మకంగా పరిశీలించే పద్ధతి నేర్పాడు. ఈ విధానాలే తర్వాత పండితులకు అనేక తెలుగు కావ్యాల పాఠ నిర్ణయానికి మార్గదర్శకాలౌతాయని ఎవరూ ఊహించి ఉండరు. ఈ విధంగా చిన్నతనంలోనే బ్రౌన్ భవిష్యత్కార్యానికి పనికివచ్చే విషయాల్లో పునాదులు పడ్డాయి.

విద్య, ఉద్యోగ జీవితం

కుంఫినివారు భారత దేశంలో ఉద్యోగం చేస్తూ ఎవరైనా మరణిస్తే వారి కుటుంబంలోని వారికి ఉద్యోగ అవకాశంతో పాటు అందుకు అవసరమైన చదువు, శిక్షణ ఇచ్చేవారు. డేవిడ్ బ్రౌన్ మరణించడంతో బ్రౌన్ కుటుంబీకులకు ఆ అవకాశం వచ్చింది. 1816లో సివిల్ సర్వీస్ శిక్షణ పూర్తి చేసిన ఛార్లస్ ఫిలిప్ బ్రౌన్ తన పందొమ్మిదో ఏట మద్రాసు సివిల్ సర్వీసులో రైటరు గా చేరాడు. "తెలుగు" అనేది ఒక భాష ఉందని అప్పటికి తెలియదట. కానీ మద్రాను కాలేజీలో 1817లో వెలగపూడి కోదండరామ పంతులు గారు చెప్పిన పాఠాలు విని అనతి కాలంలోనే తెలుగులో మంచి పట్టు సాధించాడు. 1820లో కడప జిల్లా కలెక్టర్గారికి అసిస్టెంట్ గా, 1822లో మచిలీపట్నం జిల్లాకు రిజిస్టర్ గా ఉన్నారు. 1823 తర్వాత ఉద్యోగంలో భాగంగా మచిలీపట్నం, రాజమండ్రి, కడపలలో విధులు నిర్వహిస్తూనే ప్రాచీన కావ్యాలకి, చరిత్రకి, సంస్కృతికి సంబంధించిన అనేక గ్రంథాలను సేకరించి ప్రచురించాడు.

1824 నుండి తెలుగులోగల కావ్యాలను చదవటం ఆరంభించాడు. తెలుగు సాహిత్యాన్ని చదవడ కోసం స్థానిక పండితులతో స్నేహం చేశాడు. 1826లో బ్రౌన్ కు రాజమండ్రి నుండి కడపకు బదిలీ కావడంతో అతడు సేకరించిన ఛందో గ్రంథాన్ని స్థానిక పండితుల సహాయంతో పూర్తి చేసే అవకాశం కలిగింది అని సంతోషించాడు. కడపలో తెలుగు రాయడం చదవడం వచ్చిన వారితో, అప్పటికే తాను సేకరించిన తెలుగు కావ్యాలను, పాఠాంతరాలతో ఉన్న వాటిని పండితులకు ఇచ్చి, వారిచేత పరిష్కరణ చేయించాడు.

ఆ రోజుల్లో ఎందరో పాశ్చాత్యులు తెలుగు చదివారు. కానీ ఎవరూ బ్రౌన్ వలె భాషాసేవకు పూనుకోలేదు. తెలుగు భాషా సాహిత్యాలకు ఆకర్షితుడైన బ్రౌన్ తాళపత్ర గ్రంథాలలో, శాసనాలలో, జనవ్యవహారంలో నిక్షిప్తమైన తెలుగు సాహిత్యాన్ని వెలుగులోకి తెచ్చాడు. నూతన పద్ధతిలో వ్యాకరణాలు రాశాడు. అకారాది క్రమంలో నిఘంటువులు నిర్మించాడు. భాషోత్పత్తి క్రమాన్ని పరిశోధించాడు. అప్పటికే మూలనపడిన చాలా తాళపత్ర గ్రంథాలను సేకరించి శుద్ధ ప్రతులను రూపొందించాడు. బ్రౌను కృషి ఫలితంగా వెలుగులోకి వచ్చిన ప్రాచీన కావ్యాలు పాఠకుల్లో సాహిత్య పఠనాభిలాషను పెంచాయనడంలో ఏమాత్రం సందేహంలేదు.

సాహిత్య సంపద సేకరణ

ఆధునిక పద్ధతులలో తెలుగు కావ్యాలని పరిష్కరించి ప్రచురించిన వారిలో బ్రౌన్ మొదటివాడు. వివిధ పద్ధతులలో సేకరించిన లిఖిత ప్రతులను పండితుల సహాయంతో పరిష్కరించి భద్రపరిచాడు. అలా భద్రపరిచిన వాటిని విషయం దృష్ట్యా అయిదు భాగాలుగా విభజించవచ్చు.

1. వేమన పద్యాల పరిష్కరణ

1829లో వేమన పద్యాల ఆంగ్లీకరించడం. వేమన గురించి బ్రౌన్ మొట్టమొదటిసారిగా 1824లో జె. ఏ. దుబాయ్ రాసిన "హిందూ మనర్స్ కస్టమ్స్ అండ్ శర్మనీస్" పుస్తకం చదువుతూ తెలుసుకున్నాడు. ఆ తరవాత వేమన గురించి ఆరాతీయడం మొదలుపెట్టాడు. 1824లో బ్రౌన్ మచిలీపట్నంలో ఉన్న సమయంలోనే వేమన పద్యాల సేకరణ, పరిష్కరణకి నాంది పడింది. బ్రౌన్ వివిధ ప్రాంతాల నుండి వేమన పద్యాలకి సంబంధించిన తాళపత్ర ప్రతులు సంపాదించాడు. వాటిని పరిష్కరింపజేసి 1829లో కాలేజీ బోర్డువారి చేత మొదటిసారిగా వేమన పద్యాలను ప్రకటింపజేశాడు. రెండోసారి పరిష్కరించి 1839లో ద్వితీయ ముద్రణ కూడా వేయించాడు. వేమన పద్యాల గురించి బ్రౌను దాదాపు 18 ఏండ్లు శ్రమించాడు. ఇంతటి సుదీర్ఘమైన కృషిలో కూడా బ్రౌను రెండు ముద్రణలు మాత్రమే వెలువరించారంటే ఆయన ఎంతటి పరిశోధనా పటిమగలవాడో మనకు అవగతమౌతుంది.

బ్రౌన్ పరిష్కరించిన అనేకానేక తాళపత్ర ప్రతుల్లో వేమన పద్యాలు ఒక చిన్న భాగం మాత్రమే. వేమన పద్య సంచయంలో సుమతి, భాస్కర, తిరుమలేశ పద్యాలున్నాయని మొదట గుర్తించింది బ్రౌనే. ఈనాడు మనం వేమన పద్యాలు చదువుతున్నామంటే దానికి కారణం బ్రౌన్ ఒక్కడే. ఏదేమైనా బ్రౌన్ సేకరించిన వేమన పద్యాలు చాలు ఆయనకు మనం ఎల్లప్పుడూ ఋణపడి ఉండటానికి!

2. తాళపత్ర ప్రతులు

తాళపత్ర గ్రంథాల్లో అప్పటికే మరుగున పడిఉన్న తెలుగు కావ్యాలను సంస్కరించడానికి బ్రౌన్ చేసిన కృషి వెలకట్టలేనిది. ఈ కృషిలో ఆయనకు జూలూరి అప్పయ్య, రావిపాటి గురుమూర్తి శాస్త్రి, చర్మం అద్వైత బ్రహ్మశాస్త్రి మొదలైన పండితులు సహాయం చేశారు. తెలుగులోగల పంచ మహాకావ్యాల్లో భాగమైన మనుచరిత్ర, వసుచరిత్ర మొదలైన కావ్యాలు వ్యాఖ్యానాలతో సహా అచ్చయ్యాయంటే అది బ్రౌను కృషి ఫలితమే. తాను తలపెట్టిన భాషా సాహిత్యాల సేవకు అప్పట్లోనే వేలకొద్ది డబ్బు ఖర్చుచేశాడు. అంతేకాకుండా కొంతమంది దగ్గర అప్పు కూడా చేశాడనీ తెలుస్తుంది. పాలకునిగా వచ్చిన బ్రౌన్, స్వదేశస్థులకంటే తెలుగును అధికంగా ప్రేమించి, తెలుగు భాషా సాహిత్యం పురోభివృద్ధికి తోడ్పడ్డాడు.

బ్రౌన్ కు ఆంధ్రదేశంలో గల పండితులతో, సాహిత్య పోషకులతో సత్సంబంధాలు ఉండేవి. అందుల్లే తెలుగు కావ్యాలను సంపాదించడానికి మార్గం సుగమమైంది. వసుచరిత్ర, మనుచరిత్రలే కాకుండా బమ్మెర పోతనామాత్యుని "ఆంధ్ర భాగవతం" శుద్ధప్రతిని తయారు చేయించినది బ్రౌనే. గౌరన మంత్రి రాసిన "హరిశ్చంద్ర" అనే ద్విపద కావ్యాన్ని కూడా పరిష్కరణ చేయించాడు. అంతేకాకుండా "పల్నాటి వీరచరిత్ర', 'విజయ విలాసం', 'సారంగధర చరిత్ర', 'దశావతార చరిత్ర', "కవికర్ణ రసాయనం" వంటి తెలుగు కావ్య సాహిత్యాన్ని భద్రపరిచాడు. అంతే కాకుండా తెలుగు సాహిత్యంతో ఆంగ్లసాహిత్యాన్ని పోల్చిచూశాడు.

ఈ విధంగా మొట్టమొదటగా తెలుగులో తులనాత్మక పద్ధతిని ప్రవేశపెట్టినవాడు కూడా బ్రౌనే. అంతేకాకుండా బ్రౌన్ చాలా సంస్కృత గ్రంథాలను కూడా సేకరించి, పండితులచేత వ్యాఖ్యానాలు రాయించి, ముద్రణకు సిద్ధంచేయించాడు. గ్రంథ సేకరణ విషయంలో హిందువుల మంత్ర తంత్రాలపై అంత

విశ్వాసం లేకున్నా వాటికి సంబంధించిన గ్రంథాల్ని కూడా సేకరించాడు. అచ్చువేయగలిగినన్ని కావ్యాలను స్వయంగా అచ్చు వేయించాడు. ఇంకొన్ని ఇతరులకిచ్చాడు. మిగిలిన వాటిని ఎక్కువ కాలం ఉండేవిధంగా మంచి కాగితాలపై దేశి సిరాలతో రాయించి భద్రపరిచాడు.

బ్రౌను తెలుగు భారతాన్ని 1825లో చదవడం ప్రారంభించాడు. ఆ భారతానికి ప్రజల్లో ఉన్న ఇష్టాన్ని గుర్తించి శుద్ధప్రతిని తయారు చేయించాడు. తెలుగు కావ్యాలను వెలుగులోకి తేవడంతో తృప్తిపొందక తెలుగు లక్షణ గ్రంథాల్ని కూడా వెలుగులోకి తెచ్చాడు. ఇలా లెక్కలేనన్ని కావ్యాలను సేకరించి, ముద్రించి తెలుగు ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నాడు.

3. నిఘంటు నిర్మాణం

బ్రౌన్ కాలానికి తెలుగులో "ఆంధ్రనామ సంగ్రహం", ఆంధ్ర నామ శేషం", "సాంబ నిఘంటువు" వంటి కొన్ని నిఘంటువులు ఉన్నాయి. అయితే సంస్కృత "అమరకోశం"లాగా ఈ నిఘంటువులనీ ధారణ చేయవలసి వచ్చేది. అది గమనించిన బ్రౌన్ తెలుగు నేర్చుకోవాలనుకునే పాశ్చాత్యులకు, ఆంగ్లం నేర్చుకోవాలనుకునే భారతీయులకు ముఖ్యంగా తెలుగువారికి ఉపయోగపడే విధంగా నిఘంటువుల్ని నిర్మించాలని, తెలుగు నిఘంటు నిర్మాణంలో పాశ పద్ధతిని ప్రవేశపెట్టాడు. 1852, 1853 సంవత్సరాల్లో "తెలుగు టు ఇంగ్లీష్", "ఇంగ్లీష్ టు తెలుగు" నిఘంటువులను, 1855లో మిశ్రభాషా నిఘంటువును కూర్చాడు. వీటినే "బ్రౌణ్యం" అని అంటారు. వీటిలో పాలనా సంబంధమైన పర్షియన్, ఇంగ్లీషు, ఉర్దూ మొదలైన పదాలు, వాటి వివరణలు ఇచ్చాడు. అంతేకాకుండా The Prosody of Telugu and Sanskrit. The Refuge of poets అనే ఛందో ప్రాశస్త్యంగల పుస్తకాలనూ రాశాడు. బ్రౌను రచనల్లో తెలుగు పండిత లోకాన్ని విశేషంగా ఆకర్షించినవి ఆయన కూర్చిన నిఘంటువులే.

4. వ్యాకరణాలు

ఆంగ్లంలో తెలుగుకు సాధ్యమైనంతవరకు సమగ్రమైన వ్యాకరణం రాయాలని అతడు చేసిన కృషిచేశాడు. 1840లో తెలుగు వ్యాకరణాన్ని ముద్రించాడు. దీని ముందుమాటలో తెలుగులో వచ్చిన వ్యాకరణాలను గురించి రాస్తూ, చాలా చిన్నవని చెప్పాడు.

5. చరిత్ర పట్టికలు, వ్యాసావళి

తెలుగు వాచకాలు, ఛందస్సుపై వ్యాసాలు, హిందూ ముస్లింల చరిత్రకు సంబంధించిన కాలనిర్ణయ పట్టికలు, క్రైస్తవమత సంబంధమైన రచనలను కూడా బ్రౌన్ వెలువరించాడు.

వీటితోపాటు బ్రౌన్ 'తాళపత్ర గ్రంథ సేకరణ' పాఠశాలలను నెలకొల్పడం వంటివి ఎన్నో చేశాడు. ఇలా గ్రంథసేకరణ-పరిష్కరణ, లేఖలు, నిఘంటువులు, చిన్న చిన్న రచనలు, చాటువులు మొదలైన ప్రక్రియా సాహిత్యాన్నీ సేకరించాడు.

1855లో ఇంగ్లాండు తిరిగి వెళ్లినా, 1884లో కాలధర్మం చెందేవరకు తెలుగుభాషకు, సాహిత్యానికి సేవ చేస్తూనే ఉన్నాడు. ఈ కాలంలోనే లండను విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యులుగా పనిచేశాడు.

బ్రౌను జీవించిన ఎనభై ఆరు సంవత్సరాలలో అరవైఏడు సంవత్సరాలు (1817-1884) తెలుగుభాషా సేవలోనే గడిపాడు. తన ఇంటినే ఒక విద్యాకేంద్రంగా, తానే ఒక మహారాజ పోషకుడిగా వ్యవహరించాడు. భాషా సాహిత్యాలకు అమూల్యమైన సేవ చేశాడు. పండితుల్ని పోషించాడు. అందుకే సమకాలికులు ఆయనను "నూరార్లు లెక్క సేయక పేర్లందిన విబుధ జనులం", "ఆంధ్ర భాషోద్ధారకులలో కలకాలం స్మరించదగిన మహనీయుడు, మహావిద్వాంసుడు", "సి.పి. బ్రౌన్ అనునాతడు ఆంధ్రభాషామతల్లి సేవకే జన్మమెత్తినట్లు కానవచ్చుచున్నది. ఈతడాంధ్ర వ్మాయోభివృద్ధికై చేసినంతటి పని ఇటీవలి. వారెవ్వరూ చేయలేదు" అని పొగిడారు.

తెలుగుకు ఇంత సేవ చేసిన ఆయనకు తెలుగు వాళ్లు చేసింది ఏమీ లేదనే చెప్పాలి. ఒక విశ్వవిద్యాలయానికి కూడా వారి పేరు పెట్టలేదు. కడపలో జానమద్ది హనుమచ్ఛాస్త్రిగారి అధ్యక్షతను సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయాన్ని మాత్రం కట్టించారు. బ్రౌను 1820-22 సంవత్సరాల్లో, 1826-29 సంవత్సరాల్లోనూ నివసించిన ఇంటి స్థానంలోనే ఈగ్రంథాలయాన్ని నిర్మించారు. ఈ గ్రంథాలయంలో బ్రౌన్ సేకరించిన గ్రంథాలతో పాటు 27,400 పైచిలుకు గ్రంథాలున్నాయి.

బ్రౌన్ ఆనాడు తెలుగు సాహిత్యాన్ని సేకరించి, భద్రపరచకపోతే ఈనాడు మాదీ అని చెప్పుకుంటున్న సాహితీ సర్వస్వం ఉండేదికాదు. "జని సంస్కృతంబై సర్వభాషలకును" అన్న భావాన్ని తొలగింపజేశాడు బ్రౌన్. తెలుగును స్వతంత్ర భాషగా గుర్తించేలా చేశాడు బ్రౌన్. "ఆంధ్రత్వమాంధ్ర భాషాచ నాల్పస్య తపః ఫలమ్" అని అప్పయ్య దీక్షితులు చెప్పిన సత్యాన్ని తెలుగువారు గుర్తుంచుకునేలా చేశాడు బ్రౌన్.

రచయిత: సీనియర్ ఫెలో,
ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు

సాహిత్య
పరిశోధన

విద్యావ్యవస్థ లోపాలను చర్చిస్తున్న తెలుగుకథ

డా. ఎ.రవీంద్రబాబు

పరిచయం:

విద్య సమాజాన్ని చైతన్యం చేసి, అభివృద్ధికి బాటలు వేస్తుంది. జ్ఞానాన్ని పంచుతూ, మంచి చెడులను బేరీజు వేస్తూ, బౌద్ధిక, మానసిక ప్రగతికి మూలకారణమవుతుంది. మనిషి ఎదుగుదలకు విద్యే ప్రధాన వాహిక. అలాంటి విద్యను నిర్వచించడం ఎంత కష్టమో, సాహిత్యాన్ని నిర్వచించడమూ అంతే కష్టం. సాహిత్యం సమాజాన్ని ప్రతిబింబిస్తూ, సమాజ ఉన్నతికి తోడ్పడుతుంది. ఇవి రెండూ సమాజానికి రెండు కళ్లవంటివని చెప్పొచ్చు. ఒకదానిమీద మరొకటి ఆధారపడి ఉంటాయి కూడా.

సాహిత్యం విద్య గురించి భిన్న కోణాలలో చర్చిస్తుంది. విద్య ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో, సమాజానికి ఏది మేలైన విద్యో కూడా తెలియజేస్తుంది. విద్యలో సాహిత్యమూ ఒక భాగమే. "చలం" పుస్తకంలో "విద్య అంటే ఆనందించే శక్తిని వృద్ధి చెయ్యటం, సౌందర్యాలకు కళ్లు తెరవటం, బాధలనుంచి కష్టాల నుంచి తప్పించుకునే నేర్పు నివ్వటం, ఇతరుల స్వేచ్ఛలను అడ్డగించే స్వార్థపరత్వం నుంచి, అంతా తనకే కావాలనే కౌపీనం నుంచి, భయాల నుంచి తప్పించగలగటం" అంటాడు చలం. మనిషి మరింత సుఖవంతంగా, సంతోషంగా జీవించడానికి అవసరమైన అన్నిరకాల వనరులను వృద్ధి చేయడమే చదువు లక్ష్యం. సాహిత్యం ఆ వనరులను ఎలా వినియోగించుకోవాలో, ఎలా వినియోగించుకోకూడదో, వినియోగం వల్ల కలిగే లాభనష్టాలేమిటో అనుభవాత్మకంగా లేదా ఊహించి కళాత్మకంగా విశ్లేషిస్తుంది. అందుకే సాహిత్యం సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతికాంశాల మేళవింపు. గతం, వర్తమానం, భవిష్యత్తుల వారధి. ప్రజలకు దిశానిర్దేశం చేసే మార్గదర్శి.

"సాహిత్యం ప్రజలను జ్ఞానవంతులుగా చేస్తుంది. వారు ఇతఃపూర్వంకన్నా బాగా జీవించటానికి తోడ్పడుతుంది. వారి భావోద్రేకాలను ఉన్నతపథానికి గొనిపోతుంది. తమ బంధువుల, స్నేహితుల, ఇతర ప్రజలందరి గురించి ఆలోచించేటట్లు చేస్తుంది. నవలలు, కథలు, కవిత సమాజాన్ని బంధించే భావోద్రేక బంధనాలు." అంటాడు సౌందర్య సాహిత్య విమర్శకుడు "రచయిత-శిల్పము"లో ఇల్యా ఎహ్రెన్ బర్గ్. అందుకే మనిషి ఆలోచనలు, ఊహలు. ఉద్వేగాలు సాహిత్యంగా రూపుదిద్దుకుంటాయి.

పరిశీలనాత్మకంగా గమనిస్తే విద్య, సాహిత్య ప్రయోజనాలు రెండూ ఒకటే అని తెలుస్తుంది. అందువల్లే ఏ భాషలో అయినా సాహిత్యం విద్య గురించీ ఆలోచిస్తుంది. ఉన్నతమైన విద్యా ప్రమాణాలను ప్రతిపాదిస్తుంది. అందుకు తెలుగు సాహిత్యమూ మినహాయింపు కాదు.

విద్య మొదట ప్రకృతిని అర్థం చేసుకోవడంలో భాగంగా మొదలైంది. వేదకాలంలో లౌకిక విషయాలతో పాటు మత సంబంధమైన విషయాలకు విద్య ప్రాధాన్యత ఇచ్చిందని చెప్పవచ్చు. తపస్సు, యోగం, కర్మకాండలు వంటివి ఇలాంటివే. పురాణ కాలం వచ్చేసరికి ప్రధానంగా ధనుర్వేదం, నీతిశాస్త్రం, చిత్రకళ, యుద్ధవిద్యలు, సాంఖ్య, వ్యాకరణం, తర్కం వంటివి విద్యగా చలామణి అవుతూ ఉండేవి. వీటిని మనిషి మానసిక, నైతికాభివృద్ధికి తోడ్పడేవిగా భావించేవారు. ఆ తర్వాత వచ్చిన బౌద్ధ, జైన మతాల వల్ల విద్యా విధానంలో కొన్ని మార్పులు వచ్చాయి. నలందా, తక్షశిల వంటి విద్యాలయాలు ఏర్పడిన కాలంలో చర్చలకు, వైద్యం, శిల్పం, వేదాధ్యయనం, ప్రకృతి అన్వేషణ, వంటి వాటితో పాటు భౌతికపరమైన అంశాలకు ప్రాధాన్యత ఉన్నట్లు తెలుస్తుంది. ఆ కాలంలో ఎక్కువ మౌఖికపరమైన విద్యావిధానంతోపాటు, చెక్కబల్లలు, రాతిపలకలను లిపి సాధనాలుగా వాడేవాళ్లని తెలుస్తుంది. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే వర్ణవ్యవస్థ ఆధారంగా ఉన్నత వర్గాలకు మాత్రమే విద్య అందుబాటులో ఉండేది.

19వ శతాబ్ది ప్రథమార్థం వరకు దేశీయ విద్యావిధానమే అమల్లో ఉండేది. ఆంగ్లేయుల పాలనావసరాలు, ప్రపంచ పరిస్థితులు, దేశీయ అంతరాలు, యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, భారతీయ సంస్కృతిలోని అనేక లోపాలు వంటి వాటి వల్ల 19 శతాబ్దం ఉత్తరార్థంలో లార్డ్ మెకాలే వల్ల నూతన

విద్యావిధానం అమల్లోకి వచ్చింది. దీనిని తీసుకరావడంలో మిషనరీలు, యూరోపియన్ విద్యాధికారులు, భారతీయ విద్యావేత్తలు ప్రముఖ పాత్రవహించారు. అయితే ప్రాచ్య, పాశ్చాత్య సంస్కృతులను ఏకం చేయడంలో ఈ విద్యావిధానం సఫలం కాలేకపోయిందనే చెప్పాలి.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1948 జనవరిలో అప్పటి కేంద్రవిద్యామంత్రి మౌలానా ఆజాద్ నేతృత్వంలో విద్యాసదస్సు జరిగింది. దీని ప్రారంభ ఉపన్యాసంలో అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ "విద్యా సదస్సులలో ప్రతిసారి విద్యావిధానాన్ని స్వల్ప మార్పులతో కొనసాగిస్తున్నారు. ఇది సరైంది కాదు. ఈనాడు దేశంలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. విద్యారంగం కూడా ఆ మార్పులకు అనుగుణంగా రూపొందాలి. విద్యావిధానం పూర్తిగా విప్లవీకరించబడాలి." అన్నారు. ఆ తర్వాత విద్యావిధానాన్ని మెరుగుపరచడానికి, సమున్నత మార్పులు చేయడానికి అనేక కమిటీలు వేశారు. కానీ అవన్నీ అంతంత మాత్రమే. 1943లో వేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ కమిషన్ నుంచి ఉన్నత విద్యారంగానికి సంబంధించి 1964లో వేసిన కొఠారి కమీషన్ వరకు విద్యారంగంలో సమూల మార్పుల గురించి అనేక ప్రతిపాదనలు ప్రభుత్వాలకు అందాయి. 1986లో జాతీయ విద్యావిధానానికి కొద్దిపాటి సవరణలు జరిగాయి.

ప్రస్తుతం భారతదేశంలో ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్య అనే మూడు దశల్లోనూ, వృత్తివిద్య, పూర్వ పాఠశాల విద్య, సాంకేతిక విద్య, వ్యవసాయ విద్య, వైద్య విద్య, న్యాయ విద్య, పరిశోధన వంటి దశలలో, వివిధ భాగాలుగా విద్యావిధానం కొనసాగుతోంది. ఇక విద్యావ్యవస్థ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థల ఆధీనంలో ఉంది. అలాగే ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత స్థాయిల్లో విద్యా విధానం కొనసాగుతుంది. భారత రాజ్యాంగంలోని (86వ సవరణ) ఆర్టికల్ 21ఎ విద్యాహక్కు చట్టం ప్రకారం ఉచిత, నిర్బంధ విద్య ఏప్రిల్1, 2010 నుంచి అమల్లోకి వచ్చింది. అలాగే కేంద్రవిద్యాశాఖ జూలై 29, 2020న నూతన విద్యావిధానాన్ని ప్రకటించింది. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు అనేక మార్పులు చేర్పులు చేసింది. విజ్ఞాన సృష్టి, ప్రసారం, ఉపయోగం, అవిచ్ఛిన్న జ్ఞాన వ్యాప్తి దీని ప్రధాన లక్ష్యాలుగా ప్రతిపాదించింది. దీని అమలుకు వేగంగా అడుగులు వేస్తున్నాయి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.

నూతన విద్యవిధానం 2020కు సంబంధించిన సాహిత్యం తెలుగులో ఇంకా పూర్తిగా వెలువడలేదనే చెప్పాలి. కానీ స్వాతంత్ర్యానంతరం నుంచి అమలవుతున్న విద్యావిధానం గురించి కథలు, కవితలు, నవలలు వచ్చాయి. ఇవన్నీ విద్యావిధానంలోని అనేక లోపాలను ఎత్తిచూపాయి. విద్య లక్ష్యాన్ని, లక్షణాలను వివరించాయి. ప్రత్యామ్నాయ విద్యావిధానానికి సంబంధించిన సూచనలూ చేశాయి. పాఠశాల విద్య నుంచి పరిశోధనల వరకు, రిజర్వేషన్ల నుంచి స్త్రీ విద్య ప్రాధాన్యత వరకు, మేధోవలసల నుంచి వ్యాపారమయమైన విద్యావ్యవస్థ వరకు అనేక అంశాలను స్వాతంత్ర్యానంతర తెలుగు సాహిత్యం చర్చించింది. అయితే ఈ వ్యాసంలో కథలకే ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది.

విద్య వ్యవస్థ – కులం

భారతదేశ సామాజిక జీవనంలో కులం పాత్ర చాలా కీలకమైంది. వర్గం దీనిని మరింత సంక్లిష్టం చేసింది. ఈ ప్రభావం విద్యావ్యవస్థపై సంక్లిష్టంగా కనిపిస్తుంది. రిజర్వేషన్లు, ధనిక పేద తేడాల వల్ల విద్య కొందరికి దగ్గరైతే, మరికొందరికి దూరవుతోంది. నేటికీ ప్రభుత్వ పాఠశాలలు ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన వాళ్లవిగా, ప్రైవేటు బడులు అన్ని విధాలా ఉన్నతంగా ఉన్నవాళ్లవిగా గుర్తించ బడుతున్నా యనడంలో అవాస్తవం లేదనుకుంటాను. ఇలాంటి ఆర్థిక పరమైన, కులపరమైన వివక్షలను చిత్రించిన కథ సింహప్రసాద్ "బాలల దినోత్సవం". దీనిలో ప్రెసిడెంట్ ముందు పిల్లలు ఇంగ్లీషు రైమ్స్ పాడతారు. వాళ్లను గుర్తించిన ప్రెసిడెంట్ "మాలాడెందుకండి. వాణ్ణొద్దు. మిగిలిన వాళ్లను పాడమంటే పాడమనండి" అంటాడు. మాస్టారు "మీరు పాడతారా" అని మిగిలిన ఇద్దరు పిల్లలను అడగితే "మేం పాడం" అని సమాధానం చెప్తారు. పిల్లలు తమ చేతుల్లో ఉన్న దండలను అతిథులకు "వెయ్యమంటారా" అని అడిగితే, మాస్టారు వాళ్ల ముగ్గురిని దగ్గరకు తీసుకొని "ఈ పూలన్నీ మామూలు పూలు. సామాన్యమైన పూలు." అని విద్యార్థుల్లో ఐకమత్యాన్ని, సాధారణీకరణను బోధిస్తాడు.

సదానంద శారద రాసిన మరో కథ "ఉప్పు నీళ్లు". ఈ కథలో కమలకు రిజర్వేషన్ లో ఎం.బి.బి.ఎస్ సీటు వస్తుంది. కానీ ఆమెకు అనేక అనుభవాలు ఎదురవుతాయి. కొందరు ఆమెకు సీటు రావడాన్ని చూసి"ఎంత ట్రై చేసినా మా సిస్టర్ కు ఎం.బి.బి. ఎస్ లో సీటు రాలేదు బాస్. ఏ ఎస్సీనో, ఎస్టీనో

అయితే బాగుండేది. సీటు దొరికేది. అసలు ఎస్సీ అంటే ఏంటో తెలుసా బాస్. సుప్రీం కాస్ట్, కాలేజీల్లో రిజర్వేషన్లు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు. స్కాలర్ షిప్ లు, ఉచిత విద్య, ఉచిత హాస్టల్లు, ఓహ్ లైఫ్ అంటే వాళ్లది బాస్. పుడితే ఎస్సీగా పుట్టాలి" అని మాట్లాడుకుంటారు. ఆమెకు సీటు ఇవ్వడం వెనక కాలేజీ యాజమాన్యం ఎత్తుగడ మరోలా ఉంటుంది. "క్యాస్ట్ వైజ్ పార్టిసిపెంట్ లిస్టు పంపాలని ఆర్డర్లు వచ్చాయి. షెడ్యూల్ కాస్ట్ వాల్లు కూడా ఉన్నారని పంపిస్తే మనకు ఫండ్స్ తొందరగా వస్తాయి. కమల హరిజన స్టూడెంట్... కమల హరిజన స్టూడెంట్" అంటారు కాలేజీ యజమాని. ఇదొక భయంకరమైన వెలి. చివరకు కమల తట్టుకోలేక, తండ్రి దగ్గరకు వచ్చి ఏడుస్తూ "మనం ఎక్కడికన్నా దూరంగా పారిపోదాం నాన్నా. మనల్ని మనుషులుగా చూసేచోటికి పారిపోదాం నాన్న" అంటుంది.

మేధో వలసలు

చదివిన చదువుకు, చేసే ఉద్యోగానికి, అభిరుచికి పొంతన కుదరకపోవడం మేధోవలసకు ప్రధానం కారణం అని చెప్పొచ్చు. అంతేకాదు, పెట్టుబడికి, లాభానికి మధ్య చదువు వ్యాపారంగా మారిన నేటి విధానంలో మేధోవలస సంపాదనే ప్రధానంగా జరుగుతుంది. స్వదేశంలో చదువుకొని, ఉపాధికోసం విదేశాలకు వెళ్లేవాళ్లు కొందరైతే, మనదేశంలో కంటే మరో దేశంలో ఎక్కువ సంపాదించే అవకాశం ఉందని అత్యాశతో వెళ్లేవాళ్లు ఎక్కువ. దీని వెనుక సామాజిక పార్శ్వం కూడా ఉంటుంది. ఈ విషయాలను లోతుగా చర్చిస్తూ తెలుగు సాహిత్యం విస్తృతంగానే వచ్చింది.

సత్యకామ్ రాసిన "వైద్యోనారాయణో హరి" కథలో ఇదే విషయం చర్చకు వస్తుంది. "అసలు ఎవరైనా మెడిసన్ ఎందుకు చదవాలి. హోదా కోసం చదవాలి. దిట్టంగా కట్నం కొట్టేయ డానికి చదవాలి. నర్సింగ్ హోం పెట్టుకొని ముమ్మరంగా సంపాదించాలి. బామ్మరిదిచేత మెడికల్ షాపు, క్లినికల్ లేబూ పెట్టించి రోగుల్ని అవసరం ఉన్నా లేకపోయినా ఎడాపెడా వాయించాలి. కాదనుకుంటే అమెరికా ఎగిరి పోవాలి....." అంటుంది పాత్ర.

కానీ దాన్ని వ్యతిరేకిస్తూ "తయారవుతోన్న ప్రతీ డాక్టరు మీదా లక్షలరూపాయల ప్రజాధనం ఖర్చవుతోంది. ఏ అమెరికాకో పోయి నాదారి నేను చూసుకుంటే అనారోగ్యంతో మగ్గుతున్న మన గ్రామాల సంగతేంటి" అని డాక్టర్ చేస్తున్న వ్యక్తి ప్రశ్నిస్తాడు. ఒక్క డాక్టర్లే కాదు, ఇంజినీర్లు, వ్యాపారవేత్తలు ఎందరినో... విదేశాలకు ఎగమతి అయ్యేవాళ్లకు చెంపపెట్టులాంటిది ఈ కథ.

పల్లెల నుంచి గ్రామాలకు, గ్రమాల నుంచి చిన్న పట్టణాలకు. పట్టణాల నుంచి పెద్దపెద్ద నగరాలకు బదిలీలు చేయించుకునే టీచర్లను, డాక్టర్లను, చిన్నచిన్న ప్రభుత్వ ఉద్యోగాలు చేసే వాళ్లను కూడా ప్రశ్నిస్తూ అనేక కథలు వచ్చాయి.

అలాగే ప్రతిభను మన వాళ్లు గుర్తించడం లేదు అన్న విషయాన్ని నిరూపించే రచనలూ వచ్చాయి. "మేథోమథనం" కథలో జర్మన్ పోయి తన ప్రతిభను నిరూపించుకున్న ఓ యువశాస్త్రవేత్త మాట్లాడుతూ "మూడేళ్ల క్రితం నన్ను మీరు ముగ్గరూ ఇంటర్వ్యూ చేసి బిచ్చగాణ్ణి వెళ్లగొట్టినట్లు వెళ్లగొట్టారు. జ్ఞాపకం ఉందా? నేను గడ్డివిత్తనాల్లో ప్రొటీన్లు అధికంచేసే విధానాన్ని ఇండియాలోనే కనుగొన్నాను. నన్ను మీరు ఆ రోజు చెప్పనివ్వలేదు. నాకు జర్మన్ స్కాలర్ షిప్ వచ్చింది. ఇదే ప్రయోగాన్ని గోధుమ గింజల్లో చేయమన్నారు. రెండేళ్లలో పూర్తి చేశాను" అని చెప్తాడు. విద్యాశాఖా మంత్రి కలుగజేసుకొని వాళ్లతో "ఆ ఫార్మలాను లక్ష డాలర్లిచ్చి జర్మన్ నుంచి కొనాలని నిర్ణయించినట్లు" చెప్తాడు. ఇంటర్వ్యూ చేసిన అధికారులనూ తిడతాడు.

పరిశోధన

విశ్వవిద్యాలయాల అంతిమలక్ష్యం పరిపూర్ణ వ్యక్తిత్వం గల మానవ వనరులను తయారు చేయడం. కానీ నేడు విశ్వవిద్యాలయాలు ఆ లక్ష్యాన్ని వదిలేశాయి. బోధనలోనే కాకుండా పరిశోధనలోనూ అవాంఛనీయ ధోరణులు చోటుచేసుకుంటున్నాయి. పరిశోధన అంతిమ లక్ష్యం మానవ ప్రగతి. కానీ నేటి విద్యావిధానంలోని పరిశోధనల్లో సమాజాభివృద్ధి అన్న ఆలోచనే తగ్గిపోతోంది. పరిశోధనల్లోని అవకతవకలను, నీలినీడల్ని తెలుపుతూ అనేక రచనలు తెలుగులో వచ్చాయి.

కథ పేరు గుర్తుకు రావడం లేదు కానీ, ఓ హిస్టరీ పరిశోధకుడు రిజిస్ట్రేషన్ అయిన తర్వాత వాళ్ల ప్రొఫెసర్ ను కలుస్తూ ఉంటాడు. చివరకు ఏ అంశంపై పరిశోధన చేయాలో ఇద్దరూ నిర్ణయానికి రారు. ఒకసారి వాళ్ల సొంత ఊరు వెళ్లినప్పుడు చెరువులో ఈత కొడుతుంటే ఓ రాయి దొరుకుతుంది. అది వింతగా ఉంటే దాన్ని తీసుకొచ్చి ప్రొఫెసర్ కు చూపిస్తాడు. అది విష్ణుకుండినుల కాలం నాటిదని అంటాడు ప్రొఫెసర్. ఆర్కియాలజీ వాళ్ల సహకారంతో ఆ రాయిపై పరిశోధన చేయమంటాడు. అది దగ్గరున్న కొండనుంచి ఊడి పడిందని తేలుతుంది. చివరకు అదే నీ పరిశోధన రాసుకొచ్చెయ్ అని ప్రొఫెసర్ చెప్తాడు. దాంతో నివ్వెర పోతాడు ఆ పరిశోధకుడు.

అలాగే చందు సుబ్బారావు రాసిన "సూర్యకిరణం"లో ఒక విశ్వవిద్యాలయ ఆచార్యుడికి ప్రభుత్వం ఉత్తమ శాస్త్రవేత్త అవార్డ్ ను ప్రకటిస్తుంది. కానీ తెల్లవారి పత్రికల్లో నిజాలు వెల్లువలా బయటకొస్తాయి. "పరిశోధనల్తో ప్రపంచాన్ని మోసం చేసిన ఘనుడు. విదేశీ మ్యూజియంల నుంచి శిలాజాలను తస్కరించిన భారతీయశాస్త్రవేత్త. దొంగ ఫలితాలతో నిచ్చెనెక్కిన శాంతికిరణం" ఇలా పరిశోధనలు, పరిశోధనలకు ఇచ్చే అవార్డుల వెనక జరుగుతున్న మోసాన్ని ఎండగడుతూ కూడా సాహిత్యం వచ్చింది.

విద్య – వ్యాపారం

విద్య వ్యాపారంగా మారింది. అందుకు రాజకీయ అండదండలు తోడయ్యాయి. భారతీయ విద్యారంగంలో ఇది గుణాత్మక మార్పులకు కారణమైంది. పోటీతత్వం పెరిగింది. బాలబాలికలు ఈ వ్యాపారాత్మక విద్యావిధానంలో సమిధలవుతున్నారు. సృజనాత్మకత దెబ్బతిని, పిల్లల్లో మానసిక రుగ్మతలు ఎక్కువవుతున్నాయి. ఈ వ్యారపారీకరణ నర్సరీల నుంచి మొదలై విశ్వవిద్యాలయాల స్థాయికి చేరింది. ప్రపంచీకరణలో భాగంగా గ్లోబల్ మేధావులను తయారు చేయడానికి పునుకుంటున్నారు. అంటే అగ్రదేశాల వ్యాపారాలకు అవసరమైన ఉద్యోగులను తయారు చేసేందుకు ఈ వ్యాపార విద్య, ప్రధాన భూమికగా పనిచేస్తుంది.

మురళీ మోహన్ రాసిన "పెరటి చెట్టు" కథ ఇందుకు మంచి ఉదాహరణ. స్కూల్లో తమ పిల్లాడికి సీటుకోసం వెళ్లిన వ్యక్తితో ప్రిన్సిపాల్ "జంటనగరాల్లో విపరీతమైన డిమాండ్ ఉన్న స్కూల్ మాది. ఇక్కడ అడ్మిషన్ కావాలంటే కానీసం మూడు సంవత్సరాల ముందు, లేక మీ మిస్సెస్ ప్రెగ్నెంట్ అయిన వెంటనే మీ పేరు రిజిస్టర్ చేయించుకుని ఉండాలి. అప్పటికప్పుడు కావాలంటే మా దగ్గర అడ్మిషన్లు దొరకవు. అయామ్ రియల్లీ సారీ" అంటాడు తల కూడా ఎత్తకుండా. మీ స్కూలుకు అంత డిమాండ్ ఉందా అని అడిగితే.. "ఉండబట్టే కదా మేమిక్కడ చావడం. ఈ స్కూల్లో ఫస్ట్ క్లాస్ చదివినా ఒక్కటే, ఉస్మానియా యూనివర్శిటీలో ఎమ్మేఏ చదివినా ఒకటే" అంటాడు.

ఇక ఇంజినీరింగ్ కాలేజీల గురించి, మెడికల్ విద్యా విధానం గురించి, వాటి వ్యాపారధోరణి గురించి, విమర్శిస్తూ ఎన్నో రచనలు వచ్చాయి.

ప్రత్యామ్నాయ విద్య

హోంవర్క్ లు, పరీక్షల భయాలు, ర్యాంకుల గోల లేకుండా ప్రకృతి ఒడిలో పిల్లల్లోని సృజనాత్మకతను వెలికితీసేలా కొన్ని బడులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. చిత్తూరులోని రిషీవ్యాలి, నెల్లూరులో సృజన, హైదరాబాదులో వికాసభారతి, ఆనందభారతి, శ్లోక వంటివి. అనంతపురం జిల్లాలోని టింబక్టు కలెక్టివ్ సంస్థ నిర్వహిస్తున్న బడులు, తపోవనం. విజయవాడలో వికాసవిద్యావనం, జహీరాబాద్‌లో పచ్చశాల వంటివి ప్రత్యామ్నాయ విద్యావిధానాన్ని కొనసాగిస్తున్నాయని కొన్ని రచనల్లో కనిపిస్తుంది.

సోమంచి రామం రాసిన "పసిడి మొగ్గలు"లో ఇదే విషయం చెప్తారు. "ఆ గ్రామంలో పసిపిల్లల దగ్గర నుంచి పదిహేనేళ్ల పిల్లల వరకు అందరూ ఒకే విశాలమైన ఆవరణలో చెట్లు చేమల కింద ఆడుకుంటూ, పాడుకంటూ హుషారుగా ఉన్నారు. ఆ ఆవరణ ముందు శిశువిహార్ అనే బోర్డు కనపడింది. పసిపిల్లలను ముసలివారు లాలించి, జోలపాడుతున్నారు. పిల్లలందరూ ఎవరికి ఇష్టమైన పని వారు చేసుకుంటున్నారు. కొందరు ఇంగ్లీషు, మరికొందరు లెక్కలు... ఇంకోచోట చిత్రలేఖనం. మరోచోట సంగీత సాధన. ఇంకొక చోట వ్యాయామ సాధన. ఇలా ఆ ఆవరణలో ఎవరి అభిరుచికి తగ్గట్లు వారు తర్ఫీదు పొందుతున్నారు. ఆ ఆవరణలో తప్పితే ఆ గ్రామంలో పిల్లలెక్కడా లేరు."

స్త్రీ విద్య, పరిశోధన, లైంగిక పాఠ్యాంశాలు, రిజర్వేషన్లు వంటివి ఎన్నో ఆధునిక తెలుగు సాహిత్యంలో భిన్న కోణాల్లో కనిపిస్తున్నాయి ఈ విధంగా చూసినప్పుడు తెలుగు కథా సాహిత్యంలో స్వాతంత్ర్యానంతర విద్యావిధానాన్ని స్థూలదృష్టితోనే కాదు, సూక్ష్మాతి సూక్ష్మంగా పరిశీలించిందని చెప్పవచ్చు. మూలాల్లోకి వెళ్లి విద్య స్వభావాన్ని, స్వరూపాన్ని తెలుగు రచయితలు రచనల్లో చూపించారు. అందుకే సాహిత్యం ఎప్పుడూ సమాజాన్ని ప్రతిబింబిస్తుంది. మరింత ఉన్నతీకరణకు దోహదం చేస్తుంది. చివరిగా ఒక్కమాట "దేశభవిష్యత్తు తరగతి గదిలోనే రూపుదిద్దుకంటుంది" అన్నది వాస్తవం. అది మనచేతుల్లో కూడా ఉన్నదని మర్చిపోకూడదు. ఇది సూచాయిగా మాత్రమే. ఇలా పరిశోధిస్తూ పోతే ఆధునిక తెలుగు సాహిత్యంలో విద్యావిధానంసలోని లోపాలు, సమస్యలు, సిద్ధాంతాలు, దృక్కోణాలు, దృక్పథాలు, ప్రత్యామ్నాయ విద్యావిధానంకోసం సూచనలు, పరిష్కారాలు ఉన్నాయి.

రచయిత: సాహిత్య విమర్శకులు

సాహిత్య
పరిశోధన

మాదిరెడ్డి సులోచన నవలలు-తెలంగాణ స్పృహ

డా. స్వప్న భువకర్

పరిచయం:

తెలంగాణ ప్రాంతం ఎన్నో రకాలుగా విశిష్టమైనది. ఎందుకంటే ఇక్కడి నేలకు మనుషులకు ఉన్న చరిత్ర ఎంతో వైవిధ్యభరితమైంది. కొన్ని శతాబ్దాలపాటు నవాబుల పాలనలో జీవించిన ప్రాంతమైనప్పటికీ తన అస్తిత్వాన్ని నిలుపుకునేందుకు ఎన్నో పోరాటాలను సాగించిన గడ్డయిది. సుదీర్ఘ పోరాటాల చరిత్ర ఉన్న తెలంగాణ ప్రాంత ప్రజల జీవితంలో ఎన్నో వెతలు ఉన్నాయి. వాటిని చిత్రించిన సాహిత్యమూ ఉంది. అందులో భాగంగా ఇక్కడి ప్రజా జీవితాలను సంఘర్షణను చిత్రించే ప్రక్రియల్లో నవలకు అగ్రపీఠం లభించింది.

వట్టికోట ఆళ్వారుస్వామి, దాశరథి రంగాచార్య లాంటి వారు ఈ ప్రాంత భూస్వామ్య వ్యవస్థను, నిజాం దమనకాండను తమ నవలల్లో ప్రతిబింబిస్తూ ఆనాటి సామాజిక పరిస్థితుల్ని రికార్డ్ చేశారు. తర్వాత కాలంలో కూడా ఈ ప్రయత్నాన్ని ఇతర నవలా రచయితలు తీసుకున్నారు. ఆ వరుసలో చెప్పుకోవాల్సిన నవల రచయిత్రి మాదిరెడ్డి సులోచన. 1935వ సంవత్సరం శంషాబాద్ లో జన్మించిన మాదిరెడ్డి సులోచన 1965-83 మధ్యకాలంలో దాదాపుగా 70 కి పైగా నవలలు 150కి పైగా కథలు రాసింది. ఈమె రాసిన కొన్ని నవలల్లో నిజాం కాలపు పరిస్థితులు, రజాకార్ల ఆగడాలు,నిజాం పాలన పై ప్రజల తిరుగుబాటు, పోలీస్ యాక్షన్, ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటు,తెలంగాణ సంపద భాషా సంస్కృతులపై దాడి,ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వంటి అంశాలను ముఖ్య కథతో పాటుగా చిత్రించింది.

నిజాం నవాబుల కాలపు పరిస్థితులు

శాతవాహనులు కాకతీయుల వంటి రాజవంశాల కాలాల్లో ఎంతో సుభిక్షంగా వర్ధిల్లిన తెలంగాణ ప్రాంతం నిజాం నవాబుల కాలం నాటికి దుర్భిక్షంలో కూరుకుపోయింది. నవాబుల పాలనలో సాంస్కృతికంగా ఆర్థికంగా రాజకీయంగా అణిచివేయబడింది. ప్రజలు బతకటానికి అంతులేని కష్టాలు పడవలసి వచ్చింది. మాన మర్యాదలను వదిలేసి కేవలం ప్రాణం ఉంటే చాలు అని అనుకునే పరిస్థితి దాపురించింది. నిజాం నవాబులు పరిపాలించిన కాలంలో తెలంగాణ ప్రజలు మనుషుల్లా కాకుండా జంతువుల కన్నా హీనంగా బ్రతికారు. పాలకులు ప్రజలను బానిసలుగా భావించేవారు. ఏ హక్కులు లేకుండా వెట్టిచాకిరి చేస్తూ భవిష్యత్తు పట్ల ఏ ఆశ లేకుండా ప్రజలు బతికిన దుస్థితిని మాదిరెడ్డి సులోచన తన నవలల్లో స్పష్టంగా వివరించింది." నిజాం హయాంలో ప్రజలు బంజరు దొడ్లలోని పశువుల్లా పాట్లు పడ్డారు అయోమయ పరిస్థితిలో బతికారు ప్రజలు అంటే పాలకుల తొత్తులు నోరు ఉండకూడదన్నట్టుండేది ప్రభువుల పరిపాలన" (మాదిరెడ్డి సులోచన సంధ్యారాగం నవల, పుట 32) వారి కాలంలో స్త్రీల మానానికి రక్షణ లేకుండా పోయింది. అటువంటి పరిస్థితిని మాదిరెడ్డి సులోచన ఇలా వివరించింది "ఒరేయ్ నీ పెళ్ళాం అందంగా ఉంది నా కాడికి పంపు అంటే పంపవలసిందే...."

తెలంగాణ ప్రాంతంలో బాల్య వివాహాలు జరగడానికి ఉన్న కారణాన్ని తెలియజేస్తూ..."కొన్ని సార్లు దయ తలచినట్టుగా వివాహితులైన స్త్రీల జోలికి పోము అనేవారు దాన్ని నమ్మిన ఈ అమాయకులు మూడో ఏటో నాలుగో ఏటో ఆడపిల్లలకు వివాహం చేసేవారు ఆడపిల్లల శీలరక్షణ కోసమే బాల్య వివాహాలు అమల్లోకి వచ్చాయి " (మాదిరెడ్డి సులోచన, సంధ్యారాగం నవల పుట 32)

ఇక పండించిన పంటను కూడా పంటితో రుచి చూడలేని రైతుల దీన స్థితిని మాదిరెడ్డి సులోచన తెలియజేస్తూ

"చెమటోడ్చి కష్టపడ్డ రైతు సద్దసంకటి జొన్న రొట్టెలు తిని, తాము పండించే సన్నబియ్యం, కూరలు సర్కారుకు సమర్పించేవారు. వారు పాలు నెయ్యి తినడానికే పుట్టినట్టు చూసేవారు" (మాదిరెడ్డి సులోచన సంధ్యారాగం నవల. పుట 32)

నిజాం పాలకులు ఇక్కడి ప్రజల శ్రమను దోచుకోవడమే కాకుండా తెలుగు భాషను కూడా తీవ్రంగా అణచివేశారు. పాఠశాలల్లో ఎక్కడా తెలుగు అనేది లేకుండా చేశారు. ఆనాటి తెలంగాణ ప్రముఖులంతా కూడా ఉర్దూలో చదువుకున్న వారే. సాంస్కృతికంగా కూడా హిందువుల మీద అంచివేత అతిగా ఉండేది. కట్టుకునే బట్టల విషయంలో, పండగలు జరుపు కోవడంలో కూడా ఆంక్షలు ఉండేవి. ఈ విషయాలను కూడా మాదిరెడ్డి సులోచన తన నవలల్లో సందర్భానుసారంగా వివరించింది.

"తెలంగీ బేడంగి అందరూ ఉర్దూ నేర్చుకోవాలి"
"రూమిటోపి శర్వాణి ధరించనిదే కాలేజీకి రాకూడదు"
"మీ పూజలు పునస్కారాలు రహస్యంగా జరగాలి" (మాదిరెడ్డి సులోచన సంధ్యారాగం నవల పుట. 33) వంటి ఆంక్షలు ప్రజలపై ఉండేవి. తినడానికి తిండి లేదు. గౌరవంగా బతకడానికి అవకాశం లేదు. ఎదిరించే పరిస్థితి లేని రోజులవి.

1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించినా భారతదేశంలో అంతర్భాగమైన తెలంగాణ మాత్రం నిజాం నవాబుల దుష్ట పాలనలో అస్వతంత్రంగానే మిగిలి పోవాల్సి వచ్చింది.దీన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ ప్రముఖులు అనేకులు ఉద్యమించినప్పటికీ ఇందుకు వ్యతిరేకంగా హైదరాబాద్ రాష్ట్రాన్ని ఇస్లామిక్ దేశంగా మార్చాలని ఖాసిం రజ్వీ రజాకార్ సైన్యంతో రాక్షసకాండ సాగించారు.

రజాకార్ల రాక్షసకాండ ఖాసిం రజ్వీ "మజిలీస్ రజాకార్లకు నాయకత్వం వహించి హిందువులను చీల్చి చెండాడాడు. స్త్రీల మానప్రాణాలను దోచుకున్నాడు ఒక సంవత్సరంలోనే కొన్ని లక్షల ప్రాణాలను బలిగొన్నాడు. ఉత్సాహ వంతులైన యువకులను కత్తితో కోతకోశారు" (మాది రెడ్డి సులోచన సంధ్యారాగం నవల పుట 26) 'జననీ జన్మభూమి 'అనే నవలలో రజాకార్ల రాక్షస కృత్యాలను కళ్ళకు కట్టేలా వర్ణించింది మాదిరెడ్డి సులోచన. స్వాతంత్రానికి ముందు తర్వాత తెలంగాణలోని పరిస్థితులను వర్ణిస్తూ ఈ నవల రాసింది.''అప్పుడే రజాకార్ మూమెంట్ ప్రారంభమైంది చుట్టుపక్కల ఉన్న హిందువులను హింసించడం వాళ్ళ ధన మాన ప్రాణాలను కొల్లగొట్టడం వారికి వినోదంగా విలాసంగా ఉండేది" (మాదిరెడ్డి సులోచన జననీ జన్మభూమి నవల పుట 14)

ఈ నవలలో విరుద్ధ భావాలు గల తండ్రి కొడుకులను ప్రధాన పాత్రలుగా సృష్టించింది. తండ్రి పాత్ర గౌసుద్దీన్ రజాకార్ అయితే కొడుకు దేశ భక్తుడు. గౌసుద్దిన్ లాంటి రజాకార్లు హిందూ స్త్రీలను ఏ విధంగా అవమానించేవారో తెలియజేస్తూ "పదిమంది హిందూ స్త్రీ లను వివస్త్ర లు గా చేసి బతుకమ్మ ఆడిస్తున్నారు. ఇలా ఎన్నో విధాలుగా అవమానించారు." (మాదిరెడ్డి సులోచన జననీ జన్మభూమి నవల పుట 17 18)

నిజాం పాలనపై ప్రజలు తిరుగుబాటు

ఒకవైపు భారతదేశం స్వాతంత్రాన్ని పొంది ప్రజలు స్వేచ్ఛ వాయువులు పిలుస్తుంటే, ఇక్కడి తెలంగాణలో ప్రజలు తీవ్రమైన అణచివేతకు గురవుతున్నారు. నానాటికి దమనకాండ అధికమవుతుంటే తాళలేని ప్రజలు కొందరు తిరగబడటం మొదలుపెట్టారు. ఆయుధాలను సమకూర్చుకొని రైతులు కొందరు ధైర్యంగా రజాకారులను ఎదిరించారు. పోరాట వ్యూహాలను పన్నుతూ వారి దాడులను తిప్పికొట్టారు. ఈ పరిస్థితులనే మాదిరెడ్డి తన నవలలో తెలియజేస్తూ " భారతదేశం స్వాతంత్రం సంపాదించినా హైదరాబాద్ నిజాం పాలనలోనే ఉంది అధికారం అత్యాచారాలు భరించలేని ప్రజలు ఎది రించారు. దాంతో హిందూ ముస్లింలు అను మతకల్లోలాలు ఒక వంక చెలరేగాయి. నల్గొండ జిల్లాలో స్థావరం ఏర్పరచుకొని కమ్యూనిస్టులు కాల్పులు మొదలుపెట్టారు. ఇంకో వంక ఆకలికి మాడే అనాథలు అన్నార్తులై దొంగతనాలు మొదలుపెట్టారు ఎటు చూచిన అశాంతే. "స్త్రీలు సైతం ఆయుధాలను చేత బూని మతోన్మాద రజాకారులను మట్టు పెట్టారు" (మాదిరెడ్డి సులోచన జననీ జన్మభూమి నవల. పుట 41, 42)

ప్రజల నుండి వస్తున్న వ్యతిరేకతను చూసి రజాకారుల విజృంభణను ఆనాటి పరిస్థితుల్ని మాదిరెడ్డి తెలియ జేస్తూ"ఆరోజు జూలై 28వ తారీకు 1948 సంవత్సరం రజాకారులు విజృంభించారు. కాస్త డబ్బున్న వాళ్ళు వారి కుటుంబాలతో పట్టణం వదిలారు. ధైర్యం ఉన్నవారు ఆయుధాలతో ఇళ్ళలో ఉన్నారు . గ్రామాల్లో నివసించే ప్రజలు వీలున్నంతవరకు విలువైన వస్తువులు తీసుకొని గుట్టలు చెట్లు పట్టారు. (మాదిరెడ్డి సులోచన జననీ జన్మభూమి నవల పుట 53)

ఆనాడు ప్రజలకు నాయకత్వం వహిస్తూ వాళ్లని రక్షణ బాటలో నడిపిస్తూ రజాకారులను ఎదిరిస్తూ రామిరెడ్డి లాంటి నిస్వార్థ నాయకులు కొందరు తెలంగాణను కాపాడుకున్నారు అనే విషయాన్ని తెలియజేసింది. వారి దార్శనికతతో రాబోయే ప్రమాదాన్ని పసిగట్టి రజాకార్ల నుండి ప్రజలను కాపాడే ఒక సంఘటనను కూడా ఆమె ఇలా వర్ణించింది. "నిద్రపోయే వేళకు కనులు మిరమిట్లు కొలిపే కాంతి కనిపించింది. అందరూ తగలబడి పోయే తమ ఇళ్ల దిక్కు చూసి గొల్లుమన్నారు. యువకులు కసిరి కొట్టారు. మంటలు అంబరాన్ని చుంబించే ప్రయత్నంలో ఉన్నాయి. దిగాలు పడి కూర్చున్నారు. వండిన అన్నం తినాలన్న ధ్యాస లేదు. గుండెలు చెరువౌతున్న కిక్కురు మనకుండా చూస్తూ కూర్చున్నారు." (మాదిరెడ్డి సులోచన జననీ జన్మభూమి నవల పుట 53, 54) ఈ క్రమంలో హైదరాబాద్ రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితులను కూడా రచయిత్రి

రికార్డు చేస్తూ సర్దార్ పటేల్, జవహర్లాల్ నెహ్రూ వంటి నాయకులు నిజాం ప్రభుత్వంతో జరిపిన చర్చల్ని కూడా ప్రస్తావించడం జరిగింది.

పోలీస్ యాక్షన్

పోలీస్ యాక్షన్ నాటి పరిస్థితుల్ని తెలుపుతూ " సెప్టెంబర్ మధ్యలో పోలీస్ యాక్షన్ మొదలైంది. ఆ వార్త ఆనోటా ఈనోటా వినుడే. ఖాసీం రజ్వీ హైదరాబాద్ బూడిద మిగులుస్తాడని ప్రతిజ్ఞ చేశాడట అతని అండన చేసే దుష్ట కార్యాలు ఎక్కువయ్యాయి. గొర్రె తలకాయల్లా మనిషి తలకాయలు తెగుతున్నాయి. డబ్బున్న వారు తప్పించుకుంటున్నారు. తినుడు తాగుడు లూటీలు చేయడం ఎక్కువైంది." మాదిరెడ్డి సులోచన జననీ జన్మభూమి నవల పూట 62)చివరికి 1948 సెప్టెంబర్ 17న తెలంగాణకు స్వాతంత్రం లభించింది. ఈ విషయాన్ని "ఏమైతేనేం ఒక శుభోదయం పోలీస్ యాక్షన్ ప్రారంభమై మొత్తం దేశం స్వేచ్ఛ వాయువుల్ని పీల్చుకుంది."(మాదిరెడ్డి సులోచన సంధ్యారాగం నవల పుట 27)అని వివరించింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు

తెలంగాణకు స్వాతంత్రం వచ్చి అప్పుడప్పుడే స్వేచ్ఛ వాయువులు పీలుస్తున్న అయోమయ సమయంలో విశాలాంధ్ర ఏర్పడింది. ఆ సందర్భంలో అమాయకులైన ప్రజలు, అధికారం కోసం అర్రులు చాచే రాజకీయ నాయకుల మనస్తత్వాలను చక్కగా వర్ణించింది రచయిత్రి. ఆంధ్ర తెలంగాణ ప్రజలు విభేదాలతో మిగిలిపోవడానికి గల కారణాలను కూడా విశ్లేషించింది.

స్వాతంత్రానికి నిర్వచనం తెలియని స్థితిలో తెలంగాణ ప్రజలు బతికారు. తెలివితేటలున్నా కుళ్ళు కుచ్చితాలు తెలియవు. నవాబు 'త ' అంటే 'తందానా' అంటూ బ్రతికిన వారు దేశముఖులుగా దేశ్పాండేలుగా చలామణి అయ్యారు. అప్పుడే నిజాం పరిపాలన అంతరించింది. అది అంతరించి స్వేచ్ఛా వాయువులు పిలుస్తున్న అయోమయంలోనే విశాలాంధ్ర ఏర్పడింది. అయోమయ స్థితి అని ఎందుకన్నారంటే స్వేచ్ఛ జీవితాన్ని సరియైన రీతిలో అవగాహన చేసుకోలేదు."స్వాతంత్రం వస్తే మనము పరాధీనపు బతుకునుండి బయటపడినా బాధ్యతలు పెరుగుతాయి కష్టాలు ఎక్కువని చెప్పలేదు ఎవరు" (మాదిరెడ్డి సులోచన ఋతుచక్రం నవల పుట 139) వీళ్ళు స్వాతంత్రం అంటే సుఖ జీవనం కాదని ఇంకా కష్టాలు ఉంటాయని ఆలోచించలేదు ఇది సామాన్య ప్రజల మనస్తత్వానికి అద్దం పడుతుంది. అట్లాగే రాజకీయ నాయకులు తమకు అధికారం హస్తగతం కాదేమోనని తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా తమకే ఉండాలని కోరారు. ఆ కోరిక వెనుక సామాన్య మానవుడి కష్టనష్టాల ప్రసక్తి లేదు పదవీ వ్యామోహం తప్ప. ఆ పదవి సుస్థిరంగా ఉంటుందని తెలియగానే సమైక్యతకు సహకరించారు.

సామాన్య ప్రజల అజ్ఞానం రాజకీయ నాయకుల స్వార్థం కారణంగా ఆంధ్ర తెలంగాణ అనే అడ్డుగీతలు గీసుకున్నారు. పత్రికలు కూడా ఈ అడ్డుగోడలు స్థిరంగా ఉండడానికి కొంత దోహదం చేశాయి. అమృతం హాలాహలం ఒక చోటే పుట్టాయి మరి"(మాదిరెడ్డి సులోచన సంధ్యారాగం నవల పుట 33,34)

తెలంగాణ సంపద భాషా సంస్కృతులపై దాడి

ఈస్ట్ ఆఫ్రికా నుంచి వచ్చిన గుజరాతీయులు అక్కడ సంపాదించి తెచ్చిన ధనంతో పన్నులు ఎగ్గొట్టడానికి ఇక్కడ వ్యవసాయం మొదలుపెట్టారు. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతంలో అమాయకులైన రైతుల నుండి వ్యవసాయ భూములు కొన్నారు. ఈ విషయాన్ని పలు నవలల్లో ప్రస్తావించింది మాదిరెడ్డి సులోచన."అప్పటికే ఆంధ్రప్రదేశ్ అవతరించింది చుట్టుపక్కల పొలాలన్నీ గుజరాతీలు కొన్నారు వారు ఈస్ట్ ఆఫ్రికా నుండి వచ్చారు ప్రభుత్వం వేసే సుంకాలకు భయపడి వ్యవసాయాన్ని మొదలుపెట్టారు. అందుకే చుట్టుపక్కలు అభివృద్ధి చెంది తమ ఇల్లు పాడబడినట్టు మరింత వికారంగా కనిపించింది"(మాదిరెడ్డి సులోచన లాహిరి నవల పుట 82)

సూర్యాపురం చుట్టూ ఈస్ట్ ఆఫ్రికా నుంచి వచ్చిన గుజరాతీలు చేరారు. పొలాలు కొన్నారు. (మాదిరెడ్డి సులోచన ఋతుచక్రం నవల పుట 139) ఇప్పుడు రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్న శంషాబాద్ ని అప్పట్లో సూర్యాపురం అని పిలిచేవారు ఆ సూర్యాపురం చుట్టూ ఉన్న భూమిని గుజరాతీలు కొన్నారు. రచయిత్రి దృష్టిలో గుజరాతీయులు తెలంగాణ రైతుల భూములు కొని వారికి తీరని అన్యాయం చేశారు. గుజరాతీలతో పాటు ఆంధ్ర వాళ్లు కూడా అమాయకులైన తెలంగాణ రైతుల నుండి తక్కువ ధరకే వ్యవసాయ భూములను కొన్నారు. తర్వాత కాలంలో అంతరాలను సృష్టించి స్పర్థలను కలిగించిన కారణాల్లో ఇది కూడా ఒకటిగా చెబుతూ 'సంధ్యారాగం' నవలలో సర్కారు

జిల్లాలో రూపాయలు 10000 చేసే ఎకరం పొలం అమ్మితే ఇటు పది పదిహేను ఎకరాలు పొలం తెలంగాణలో దొరికింది. ఈ పొలాలు అమ్మడం కొనడం మరోరకంగా అంతరం సృష్టించింది.

స్వాతంత్రం వచ్చేనాటికి తెలంగాణలో నిరుద్యోగ సమస్య లేదు. ఏ కొద్దిపాటి చదువు ఉన్న అందుకు తగ్గ ఉద్యోగం లభించేది బ్రతకడానికి ఏమాత్రం ఇబ్బంది పడవలసిన అవసరం లేకుండా పోయింది. 1953లో మద్రాసు రాష్ట్రం నుండి విడిపోయి ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటైన కొత్తలో అక్కడ సరైన ఉపాధి అవకాశాలు లేక ఆంధ్ర వాళ్ళు ఉద్యోగాల కోసం అంతకుముందే ఏర్పాటైన హైదరాబాద్ రాష్ట్రానికి అంటే తెలంగాణకు వచ్చేవాళ్ళు తెలంగాణను నైజాం అని పిలిచేవారు అలా పొట్ట చేత పట్టుకుని వచ్చిన ఆంధ్రావాళ్లను తెలంగాణ ఆదరించింది. ఈ విషయాన్ని మాదిరెడ్డి సులోచన తన నవలల్లో చెబుతూ "అప్పటికి హైదరాబాద్ ప్రాంతం వారికి నిరుద్యోగం అంటే ఏమిటో తెలియదు థర్డ్ ఫారం పాస్ అయిన వారికి కూడా ఉద్యోగాలు దొరికేవి. అప్పటికి ఇంకా రాజకీయాలు ఇన్ని రంగులు పులుముకోలేదు. రికమండేషన్లు అంటే పెద్దగా తెలియని రోజులు. అప్పుడప్పుడే సర్కారు జిల్లాల నుండి ఉ ద్యోగాలకు వనస్తూ నైజాం నైజాం అనేవారు హైదరాబాదును."(మాదిరెడ్డి సులోచన ఋతుచక్రం నవల పుట 33)"రెండు ప్రాంతాలలో లెక్క చూస్తే సర్కారు జిల్లాలో విద్యావంతులు ఎక్కువగా ఉన్నారు. ఆఫీసుల్లో అక్కడివారిని తీసుకురాక తప్పలేదు. అయోమయంలో ఉన్న ప్రజలకు సరైన నాయకుడు లేక సరియైన అవగాహన లేక మా అవకాశాలు అవతల వారు కాజేస్తున్నారన్న అపోహ బయలుదేరింది" (మాదిరెడ్డి సులోచన సంధ్యారాగం నవల పుట 35)

నిజాం నవాబుల ఏలుబడిలో తెలంగాణ ప్రజలకు విద్య దూరం చేయబడింది. అదే సమయంలో బ్రిటీష్ పాలలో ఉన్న ఆంధ్ర ప్రజలు చదువుకున్నారు. తెలంగాణలో ఉన్న ఉపాధి అవకాశాల మీద వాళ్ళ కన్ను పడింది. 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడ్డా క అన్ని అవకాశాలు వాళ్ళకి దక్క సాగాయి. ఈ అంతరం సమైక్యాంధ్ర రాష్ట్రంలో పెద్ద అగాధాన్ని సృష్టించింది. ఏ ఉద్యోగం కావాలన్నా అందుకు తగ్గ అర్హతలు ఉన్నవాళ్లు ఎక్కువగా ఆంధ్రాలోనే ఉన్నారని అన్ని ఉద్యోగాలకు వాళ్లని తీసుకున్నారు.

ఈ విధంగా తెలంగాణలోని వ్యవసాయ భూములను ఉపాధి అవకాశాలను ఆంధ్ర వాళ్ళు ఆక్రమించాక చేసిన ఇంకొక పని తెలంగాణ సంస్కృతి పై దాడి చేయడం. ఇక్కడి భాషను ఆహారపు అలవాట్లను సంస్కృతిని తీవ్రంగా ఎగతాళి చేశారు. ఎవరి భాష వారికి ఉంటుంది.ఎవరి ఆహారపు అలవాట్లు వారికి ఉంటాయి. ఎవరిది వారికే గొప్ప అన్న ఇంగితాన్ని కూడా వాళ్ళు మరచిపోయి ఇక్కడి వారిని చులకన చేయటం రచయిత్రి తన నవలల్లో చిత్రించింది.

పత్రికల్లో కూడా తెలంగాణ వారిపై అబద్ధాలను వ్యాసాలుగా ప్రచురించేవారు. తెలంగాణ వాళ్లు మోసగాళ్లని, ఇక్కడి మగవాళ్లకు నైతిక విలువలు లేవని అన్నట్లుగా వాళ్ళ రాతలు ఉండేవి. వీటిని తిప్పి కొడుతూ తెలంగాణ వారు రాసినా ఆ పత్రికలు ప్రచురించేవి కావు. వ్యవసాయం ఉద్యోగ విషయాలను కాకుండా సంస్కృతి పరంగా కూడా ఆంధ్ర వాళ్ళ పట్ల తెలంగాణ ప్రజలలో ద్వేషం మొదలైంది.

ఈ విషయాన్నే మాదిరెడ్డి "అవుట్లెట్ లేక ఒక విధమైన ద్వేషం బయలుదేరింది." (మాదిరెడ్డి సులోచన సంధ్యారాగం నవల పుట 34) అన్నది.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం

మొదటి నుండి కూడా తెలంగాణలో పాఠశాల కళాశాల విద్యార్థి సంఘాలు బలమైన నిర్మాణం కలిగి ఉండేది. 1952 నాన్ ముల్కీ ఉద్యమంలో కూడా క్రియాశీలక పాత్ర పోషించారు వీరు. 1967 లో ప్రభుత్వం కాలేజీ ఫీజులను పెద్ద మొత్తంలో పెంచింది. దీనికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించి విజయం సాధించారు. ఈ సంఘటన తెలంగాణ విద్యార్థులు 1969 ఉద్యమంలో పాల్గొనుటకు దారి తీసింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సందర్భంలో ఒక చోట తన అభిప్రాయాన్ని ఈ విధంగా వెల్లడించింది. "ఈ ఉద్యమాల వల్ల లాభమా నష్టమా అన్నది నేను చర్చించదలచుకోలేదు. కానీ కొందరి స్వార్థానికి ఎందరో బలి అయిపోతారు అన్నది నిజం"(మాదిరెడ్డి సులోచన ఆశయాల ఆఖరిమెట్టు నవల. పుట 89)

ఉద్యమం గురించి తన రచనల్లో నిజాలను స్పష్టంగా వ్యక్తీకరించడానికి వెనుకంజ వేయలేదు. మభ్యపెట్టడానికి ప్రయత్నించలేదు. "ప్రత్యేక తెలంగాణ కోసం చేస్తున్న విద్యార్థి ఉద్యమం ఉధృతమైంది. ఆ ఉద్యమంలో కావాలని కొందరు

కాదనలేక కొందరు చేరారు ఉద్యమం తీవ్ర రూపం దాల్చింది వెల్లువలా వచ్చిన యువతరం శక్తిని ఎవరూ ఆపలేకపోతున్నారు ప్రత్యేక రాష్ట్రం కావాలంటూ ఎటుచూచిన ఊరేగింపులే. ఉద్యమ స్వరూపం అర్థమయి కొందరు గొర్రె దాటుగా మరికొందరు ఉద్యమంలో చేరారు" (మాదిరెడ్డి సులోచన సంధ్యారాగం నవల పుట 9) తెలంగాణలో ఉన్న సమైక్యవాదులు కొందరు రాష్ట్ర విభజనను వ్యతిరేకించారని ఉద్యమ వ్యతిరేక ప్రచారం కూడా నిర్వహించారని మాదిరెడ్డి సులోచన తెలియజేసింది. 'సంధ్యారాగం' నవలలో తెలంగాణ వాడైన శ్రీనివాస్ ఆంధ్ర నుండి టీచరుగా వచ్చిన రామారావు కలిసి ఈ పని చేసినట్టుగా రాసింది. శ్రీనివాస్ తమ్ముడు రవీంద్ర ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారునిగా చిత్రించింది విద్యార్థి ఉద్యమం ఆగిపోయాక మళ్ళీ రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించిన వ్యక్తిగా శ్రీనివాస్ రవీంద్రల బాబాయ్ చలపతి పాత్రను సృష్టించింది ఇది మర్రి చెన్నారెడ్డిని పోలి ఉన్న పాత్ర. చివరికి "సమైక్యవాదుల కృషివల్లే విద్యార్థి ఉద్యమం ఆగిపోయింది"అని రచయిత్రి తెలియజేసింది. ఉద్యమం తీవ్ర స్థాయికి చేరి ఉద్రిక్తంగా మారినపుడు హైదరాబాదు నగర పరిస్థితిని తెలియజేస్తూ "హైదరాబాద్ పట్టణము అట్టుడికి పోతుంది ఎటు చూసినా పోలీసులే. లాఠీ దెబ్బలతో రాజ్యం ఏలే రోజులని తెలిస్తే సత్యాగ్రహం చేసేవారు కాదేమో మన పెద్దలు. ప్రతివాడు బయటకు వెళ్లడానికి భయపడుతున్నాడు" (మాదిరెడ్డి సులోచన ఆశయాల ఆఖరిమెట్టు నవల పుట 90) ఆనాటి ముఖ్యమంత్రి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని అణచి వేయడానికి అనేక దురాగతాలకు పాల్పడ్డాడని రచయిత్రి తెలియజేసింది. అందుకు సంబంధించిన ఒక్క వార్త కూడా పత్రికల్లో రాకుండా నిషేధించారని కూడా తెలియజే సింది." ఉద్యమంలో పాల్గొన్న అనేక మంది విద్యార్థులు రౌడీల దాడిలో లేకపోయుంటే పోలీసుల దాడిలో సైనికుల దాడిలో చనిపోయారు"(మాదిరెడ్డి సులోచన సంధ్యారాగం నవల పుట 143) ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఆగిపోయింది. ఇందులో స్వార్థపరులు లాభపడ్డారు నిజాయితీపరులు నష్టపోయారు అని రచయిత్రి తెలిపింది.

తెలంగాణ ప్రాంతాలలోని నాగరిక సామాజిక సాంస్కృతిక పరిస్థితులను తన రచనల్లో చిత్రించింది మాదిరెడ్డి సులోచన. వీరి రచనల్లో స్త్రీల అభ్యుదయం స్వేచ్ఛ హక్కులు మొదలైన అంశాలు కూడా ఉంటాయి. కథల్లోని పాత్రలు తెలంగాణ ప్రాంత నేపథ్యంలో ఉంటాయి. మాదిరెడ్డి సులోచన రచనల్లో అత్యధికంగా తెలంగాణ పలుకుబడులు తెలంగాణ స్థానికత గోచరిస్తుంది. భూస్వామ్య కుటుంబంలో పుట్టిన కారణంగా తెలంగాణ ప్రాంతంలో ఆ రోజుల్లో దొరలు దేశముఖుల ఇళ్లల్లో ఆచార వ్యవహారాలు ఈమె నవలల్లో కనిపిస్తాయి. నిజాం నవాబుల పాలన, రజాకారుల దురాగతాలు అమాయకులైన ప్రజలను పన్నుల పేరుతో పీడించి వారి ధనమాన ప్రాణాలతో చెలగాటమాడిన పటేళ్ళ దుష్ట పాలనను సమయోచితంగా తన నవలల్లో ప్రవేశపెట్టింది. నిజాం వ్యతిరేక ఉద్యమాలు ముల్కీ నాన్ ముల్కీల అనుభవాలు సమైక్య ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు సమయంలో జరిగిన అన్యాయాలు తెలంగాణ వ్యవసాయ భూములపై, ఉద్యోగాలపై, సంస్కృతిపై, భాషపై జరిగిన దాడి, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమాలు మాదిరెడ్డి నవలల్లో కనిపిస్తాయి. రచయిత్రి సమకాలీన తెలంగాణ ఉద్యమాలు వాటిల్లోని సంఘటనలను మార్చి తన నవలల్లో ప్రవేశపెట్టి ప్రతీకాత్మకంగా రచించింది.

ఆధార గ్రంథాలు

1. తెలంగాణ ఉద్యమం రాష్ట్ర అవతరణ. తెలుగు అకాడమీ, హైదరాబాద్.

2. విద్యావతి, కె. మాదిరెడ్డి సులోచన (మోనో గ్రాఫ్). తెలుగు అకాడమీ. హైదరాబాద్, 2017.

3. సులోచన, మాదిరెడ్డి. సంధ్యారాగం నవల. క్వాలిటీ పబ్లిషర్స్, విజయవాడ. 2017

4. సులోచన, మాదిరెడ్డి. జననీ జన్మభూమి నవల. క్వాలిటీ పబ్లిషర్స్. విజయవాడ. 2019

5. సులోచన, మాదిరెడ్డి. లాహిరి నవల. క్వాలిటీ పబ్లిషర్స్. విజయవాడ. 2016

6. సులోచన, మాదిరెడ్డి. ఋతుచక్రం నవల. క్వాలిటీ పబ్లిషర్స్. విజయవాడ. 2017

7. సులోచన, మాదిరెడ్డి. ఆశయాల ఆఖరిమెట్టు నవల. క్వాలిటీ పబ్లిషర్స్. విజయవాడ. 2017

రచయిత: అసిస్టెంట్ ప్రొఫెసర్

ఎం. వి. ఎస్ ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల,

మహబూబ్ నగర్

సాహిత్య పరిశోధన

సామాజిక సంకెళ్ల విముక్తి స్వరం-అయోతీ దాస్ పండితర్

గడ్డకింద మాణిక్యం

0. పరిచయం:

భారతదేశ భూమి పుత్రులుగా, మూలవాసులుగా నిలిచిన దళితులు, అనేక అంతర్గత, బాహ్య విఘ్నాలతో తమ స్వాభావిక సహజ హక్కులను కోల్పోయారు. ఆర్య సంస్కృతి విస్తరణతో ఆ సంస్కృతికి ఆధారమైన రాచరిక వ్యవస్థ బలపడగా, భూస్వామ్య వ్యవస్థ పుట్టుకొచ్చి, ఈ భూమి వారసులైన దళితులను వారి స్వంత భూముల నుండి వేరుచేసింది. తరతరాలుగా వారు తమ జన్మభూమిలోనే కనీస హక్కులకూ, అవకాశాలకూ దూరమై, కట్టుబానిసల స్థితికి దిగజారిపోయారు. 1600 ప్రాంతం నుంచి భారతదేశంపై యూరోపియన్ వలస వ్యాపార శక్తుల ప్రభావం మెల్లగా విస్తరించసాగింది. ఈ శక్తులు కేవలం ఆర్థిక దోపిడీకి పరిమితం కాకుండా, ఆధునిక విద్య, విజ్ఞానం, శాంతిభద్రతా వ్యవస్థలు, చట్టబద్ధ పాలన, న్యాయపరమైన సమానత్వం వంటి అభ్యుదయ సూత్రాలను కూడా ఈ భూమిపై నాటాయి. ఈ పరిణామాల వలన భారతీయ ఆర్థిక, సామాజిక, రాజకీయ నిర్మాణాలలో లోతైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ మార్పులు సమాజంలోని ప్రతి వర్గాన్నీ వివిధ రీతులలో తాకి, కొత్త అవకాశాలను మాత్రమే కాక కొత్త సవాళ్లను తెచ్చాయి. ముఖ్యంగా, అట్టడుగున నిలిచిన దళిత వర్గాల హృదయాలలో కూడా నూతన చైతన్యపు కాంతిరేఖలు విరజిమ్మాయి. శతాబ్దాలుగా అలసిపోయిన జడత్వాన్ని దూరం చేసుకొని, ఈ వర్గాలు మార్పు వైపు అడుగులు వేయడం ప్రారంభించాయి.

1. పరైయర్లు – సామాజికార్థిక, రాజకీయ నేపథ్యం:

భౌగోళిక పరంగా దక్షిణ భారతదేశం మరియు శ్రీలంక ప్రాంతాలలో విస్తరించి ఉన్న దళిత వర్గాల్లో పరైయర్లు ముఖ్యులు. ఆది కాలంలో వీరు ప్రధానంగా వ్యవసాయం ఆధారంగా జీవనాన్ని నిర్మించిన రైతులు, శ్రామికులు. కానీ కాలచక్రం మార్పులు తెచ్చిన విపరీత ప్రభావాలతో, తమ ఆర్థిక సమృద్ధిని కోల్పోయి, సామాజికంగా దిగజారిపడి, చివరకు వ్యవసాయ శ్రామికులుగా కట్టు బానిసల స్థితికి చేరుకోవలసి వచ్చింది. సంగం యుగం నాటి కుల సమూహాల్లో తమకో ప్రత్యేక స్థానం ఉన్న ఈ వర్గం, అనేక కారణాల ఫలితంగా కాలగమనంలో 'అంటరాని' వారుగా మిగిలిపోయారు. అయితే, ఇదే వర్గంలోని వ్యవసాయ శ్రామిక దళిత సమూహం అయిన పరైయర్లు, సమాజంలో చోటుచేసుకున్న అనుకూల మార్పులను సమయోచితంగా స్వీకరించి, అద్భుతమైన వర్గ చైతన్యాన్ని, సామూహిక మెలకువను ప్రదర్శించారు.

మనదేశంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన జనాభా లెక్కల సేకరణ, ముఖ్యంగా కులాల నమోదు ప్రక్రియ, కుల అవగాహనకు కొత్త ఊపిరిని అందించింది. గణాంకాల రూపంలో తమ ఉనికిని గుర్తించబడిన అనుభూతి, కుల ఉద్యమాలకు ఒక స్పష్టమైన రూపం, ఒక సామూహిక చైతన్యాన్ని ఇచ్చాయి. ఈ పరిణామాల ప్రభావం దక్షిణ భారతదేశంలో ప్రత్యేకంగా కనపడింది. కుల వివక్ష పునాదులపై బలపడిన భూస్వామ్య వ్యవసాయ వ్యవస్థలో శతాబ్దాలుగా పీడితులైన దళితులు, ఈ పరిస్థితుల నుంచి విముక్తి కోసం కొత్త మార్గాలను అన్వేషించారు. తమను బంధించిన భౌగోళిక, వృత్తి పరిమితులను ధిక్కరించి, కొత్త ప్రాంతాలు, కొత్త వృత్తులు, కొత్త జీవనావకాశాల కోసం సామూహికంగా వలసలు చేపట్టారు. కుల వివక్షకు వ్యతిరేకంగా ఈ వలసలు వారి చేతిలో ఒక శక్తివంతమైన ఆయుధంగా మారాయి. శ్రీలంక, మలేషియా, బర్మా, దక్షిణాఫ్రికా వంటి దేశాలలో కఠినశ్రమతో సంపాదించిన ధనం, తిరిగి భారత భూమిలో ఆస్తులుగా మారి, వారికి కొత్త సామాజిక అంతస్తులను ప్రసాదించింది. ఒకప్పుడు బంధింపబడ్డ వర్గాలు, ఈ కొత్త ఆర్థిక బలంతో స్వేచ్ఛ యొక్క ఫలాన్ని కొద్ది కాలం పాటు రుచి చూశాయి.

బ్రిటిష్ పాలనలోని ఈ పరిణామాలు జనాభా లెక్కల సేకరణ, శ్రామిక వర్గాల వలసలు, పారిశ్రామికీకరణ తెచ్చిన ఉపాధి అవకాశాలు దళిత సమాజానికి ఒక కొత్త చరిత్రాత్మక దిశను చూపించాయి. ఇవే దళిత చైతన్యాన్ని మరింత స్పష్టంగా, మరింత క్రియాశీలంగా మలచిన శక్తులుగా నిలిచాయి. దళితుల జీవనయాత్రలో మరో కీలక మలుపు, ప్రభుత్వ ఉద్యోగాలు మరియు సైనిక సేవల ద్వారా వచ్చింది. సామాజిక మెట్టుపై అట్టడుగున నెట్టివేయబడ్డ ఈ వర్గానికి, ప్రభుత్వంలోని దిగువ

స్థాయి ఉద్యోగాలు కొత్త ఆత్మగౌరవానికి వేదిక అయ్యాయి. ఆర్థిక స్వతంత్రం, సామాజిక గుర్తింపు, వ్యక్తిత్వ అభివృద్ధి ఇవన్నీ ఈ అవకాశాల ద్వారానే మొలకెత్తాయి. సైన్యంలో సేవ చేయడం వారి జీవితంలో అనూహ్యమైన గౌరవాన్నీ, క్రమశిక్షణను అందించగా, కోలార్ బంగారు గనులు, ప్లాంటేషన్ పంటల పనులు వంటి కొత్త ఉపాధి మార్గాలు దళితులకు సంప్రదాయ కులవృత్తులైన డప్పు కొట్టడం, డప్పు తయారు చేయడం, తోటి పని, కాటి కాపరి మరియు ఊరి కాపరి పనుల సంకెళ్ళ నుండి విముక్తి ప్రసాదించాయి.

మద్రాసు ప్రాంతంలో బ్రిటిష్ పాలకులు ఇంటి పనులు, వంట పనుల కోసం దళితులకు ప్రాధాన్యత ఇవ్వడం, సమాజం వారిని చూసే చూపును కొంతమేర మార్చింది. ఈ కొత్త అవకాశాలు కేవలం ఉపాధి మార్గాలుగా మాత్రమే కాక, సామాజిక మెలకువకు విత్తనాలుగా మారాయి. దళిత వర్గాల్లో విద్య యొక్క విలువను గుర్తించిన చైతన్యం, తమ పిల్లల కోసం ప్రత్యేక పాఠశాలలను స్థాపించటానికి నడిపించింది. ఈ విద్యాసంస్థలు కేవలం అక్షరాస్యతకే కాక, దళిత సమాజం యొక్క భవిష్యత్తు స్వరాన్ని మలిచే కేంద్రాలుగా నిలిచాయి. ప్రజా ప్రాతినిధ్యం, ఓటు హక్కు వంటి భావనలు భారత సమాజంలో కొత్త వెలుగులను ప్రసరించగా, దళిత సమూహాలకు అవి ప్రత్యేకమైన ఉత్సాహం, ఉత్తేజాన్నీ నింపాయి. శతాబ్దాలుగా మూలవాసితత్వం నుండి అట్టడుగున నెట్టివేయబడ్డ ఈ వర్గం, మొదటిసారిగా తమ స్వరానికి విలువ దక్కుతున్న భావనను అనుభవించింది. మింటో–మార్లే సంస్కరణలు (1909) ద్వారా ప్రజాసభల్లో కుల ప్రాతినిధ్యం అనే కొత్త పద్ధతి ఆవిష్కృతమై, భారత రాజకీయంలో కొత్త దిశను చూపించింది. ఇది కేవలం చట్టపరమైన మార్పు మాత్రమే కాదుబీ ఇది అణగారిన వర్గాలకు గౌరవం, తమ హక్కుల పట్ల అవగాహన, సామాజిక చలనం కలిగించే శక్తిగా మారింది.

దక్షిణ భారతదేశంలో, వివిధ ప్రాంతాల దళితవర్గాలు ఈ రాజకీయ చైతన్యపు మెలకువను త్వరగా అందిపుచ్చు కున్నాయి. తమ చరిత్రలో తొలిసారిగా శక్తివంతమైన రాజకీయ వేదికపై తమ ఉనికిని వ్యక్తీకరించగల అవకాశం వారికి లభించింది. ఈ దశలో, దళిత సమాజం కేవలం శ్రామిక వర్గం కాకుండా, ఒక సామాజిక, రాజకీయ శక్తిగా రూపు దిద్దుకుంటున్న సంకేతాలు స్పష్టంగా కనబడ్డాయి. శతాబ్దాలుగా దళితులను బంధించి ఉంచిన నిర్బంధాలు క్రమంగా కూలిపోవడం ప్రారంభించగా, ఈ వర్గం కొత్త ఉత్సాహంతో ముందుకు అడుగులు వేసింది. తమ జీవితాలను మెరుగుపరచుకోవాలి, తమ చరిత్రను తిరిగి నిర్మించుకోవాలి, సమాజంలోని మిగిలిన వర్గాలతో సమాన అవకాశాలు సాధించుకోవాలి, ఇవన్నీ వారి ఆవేదనగా, లక్ష్యాలుగా మారాయి. తమపై విధించిన అవమానకర నిర్బంధాలను తొలగించాలని కోరుతూ దళిత ఉద్యమాలు దేశం నలుమూలలా చెలరేగాయి.

తెలుగు ప్రాంతాలలో భాగ్యం రెడ్డి వర్మ, కుసుమ ధర్మన్న, ఒడిశాలో భీమా భోయ్, కేరళలో నారాయణ గురు, అయ్యంకాళి, పొయిక్కయిల్ యోహన్నన్ (పొయిక్కయిల్ అప్పన్), మరాఠా ప్రాంతంలో జ్యోతిరావు పూలే వంటి ఈ మహనీయులు తమ కాలంలో దళిత సమాజానికి దారి చూపిన దీపస్తంభాలు. వారు కేవలం నేతలుగానే కాదుబీ సామాజిక సమానత్వం, ఆర్థిక స్వావలంబన, ఆత్మగౌరవం కోసం పోరాడిన ఆలోచనావంతులు. ఈ ఉద్యమాలకు కావలసిన సిద్ధాంతపరమైన పునాదిని కూడా కొందరు మేధావులు నిర్మించారు. మద్రాసు ప్రాంతానికి చెందిన అయోతీ థాస్ వారిలో ప్రథమ శ్రేణిలో వుంటారు. ఆయన భారతదేశ చరిత్రను లోతుగా అధ్యయనం చేసి, బౌద్ధ మత పతనం అనంతరమే కులవ్యవస్థ తన వికృత రూపాలను విస్తరించి, దళితుల సామాజిక ఆర్థిక స్థితిని దెబ్బతీసిందని స్పష్టం చేశారు. దళితుల ఉద్ధరణకు బౌద్ధమే మార్గమని విశ్వసించిన ఆయన, తమ పూర్వ మతమైన బౌద్ధ ధర్మాన్ని తిరిగి స్వీకరించమని దళితులను ప్రోత్సహించారు. బౌద్ధం మాత్రమే వారిని వివక్షల నుండి విముక్తి చేస్తుందని ధృఢంగా ప్రచారం చేశారు. ఈ ఆలోచనా స్రవంతి తరువాత కాలంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి మహనీయుని, అలాగే ద్రావిడ ఉద్యమ నేత ఈ.వి. రామస్వామి (పెరియార్) వంటి విప్లవవాదిని లోతుగా ప్రభావితం చేసి, వీళ్లకు స్ఫూర్తిని రగిల్చారు అయోతీ దాస్ పండితర్.

2. బాల్యం – విద్యాభ్యాసం:

దక్షిణ భారత భూమి పుత్రులుగా గుర్తించబడిన పరైయర్ దళిత వర్గంలో, 1845 మే 20న, చెన్నై నగరంలోని రాయపేట ప్రాంతంలో ఒక శిశువు జన్మించాడు. అతడే తరువాత కాలంలో సామాజిక చైతన్యానికి దీప్తినిచ్చిన ఇయోతీ థాస్. కుటుంబంలో అతడిని స్నేహపూర్వకంగా "కాటమరాయుడు" అని పిలిచేవారు. థాస్ కుటుంబానికి బ్రిటిష్ పాలనతో ప్రత్యేక సంబంధం ఉందిబీ అతని తల్లిదండ్రుల తరపు బంధువులు చాలామంది బ్రిటిష్ అధికారుల వద్ద ఇంటి పనివారు, వంటవారు(బట్లర్లు)గా ఉద్యోగాలు చేశారు. చిన్న వయసులోనే కాటమరాయుడు తన

అసాధారణ మేధస్సు, చురుకుదనం, సామాజిక అవగాహనతో కుటుంబం మరియు పరిసరాల్లో ప్రత్యేక గుర్తింపు పొందాడు. జ్ఞానాసక్తి అతనిలో సహజసిద్ధం. తన తాత వద్ద ప్రాచీన తాళపత్ర గ్రంథాలను పరిశీలించడం ద్వారా పూర్వ తమిళ లిపులపై అవగాహన పెంచుకున్నాడు. అదే సమయంలో, ద్రావిడ సాంప్రదాయ సిద్ధ వైద్య విధానాలను, మూలికల ఆధారిత వైద్యాన్ని లోతుగా అధ్యయనం చేసి, అందులో మంచి పేరును సంపాదించాడు. అతని విద్యాభ్యాస యాత్ర మరింత విశాలమైంది కవిరాజు పండిత అయోధ్య దాసు వద్ద వ్యాకరణం, సాహిత్యం నేర్చుకున్నాడుబీ బలభద్ర దేశికానంద వద్ద వేదాలు, వేదాంతం, తత్వశాస్త్రాలను అధ్యయనం చేశాడు. ఈ విశాల జ్ఞానాన్ని గుర్తిస్తూ ప్రజలు అతనికి "పండితర్" అన్న బిరుదు ప్రదానం చేశారు. తన గురువుపై గల గౌరవం, ప్రేమాభిమానాలకు గుర్తుగా, కాటమరాయుడు తన పేరును "అయోతీ థాస్" గా మార్చుకున్నాడు ఆ పేరు తరువాత కాలంలో దళిత చైతన్యానికి ప్రతీకగా నిలిచింది. నిలుస్తుంది.

3. ఊటీలో రూపుదిద్దుకున్న ప్రజా జీవితం:

అయోతీ థాస్ పుట్టిన ఇల్లు జ్ఞానాసక్తితో, విద్యతో నిండిన కుటుంబం. ఆయన తండ్రి కాంతప్పన్, బ్రిటిష్ అధికారి ఫ్రాన్సిస్ వైటీ ఎల్లిస్ వద్ద పనిచేసేవాడు. ఉద్యోగ కారణంగా ఈ కుటుంబం మద్రాసు సంయుక్త రాష్ట్రంలోని ఉదక మండలం (ఊటీ)లో స్థిరపడింది. అందువల్లే థాస్ బాల్యం ఊటీ పర్వతప్రాంతాల సౌందర్యంలో గడిచింది. ఈ కాలంలోనే ఆయన కళ్ల ముందు విస్తరించిన సమాజం, మతాల వైవిధ్యం, కులవ్యవస్థలోని అసమానతలు ఆయన మనసులో ప్రశ్నలను రేపాయి. మతం, కులం, సామాజిక అసమానతలపై లోతైన అవగాహన ఆయనలో మొలకెత్తింది. ఇదే సమయంలో భవిష్యత్తు జీవిత లక్ష్యాలకు పునాది వేసుకున్నాడు. 1870ల దశకంలో ఆయన ప్రజా జీవితంలో అడుగుపెట్టాడు. శైవ మతం, అద్వైత వేదాంతం వంటి తాత్విక అంశాలపై గాఢమైన ఆసక్తిని పెంపొందించుకున్నాడు. ఆ ఆలోచనా శక్తితో, నీలగిరి పర్వత ప్రాంతంలోని తొడా వంటి గిరిజన తెగలను సమీకరించి, క్రైస్తవ మతప్రచారానికి పోటీగా "అద్వైత ఆనంద సభ" అనే సామాజిక సంస్కరణ సంస్థను 1876లోనే నీలగిరిలో స్థాపించాడు. ఇది ఆయన ప్రజా సేవా మిషన్‌కు తొలి రూపురేఖ. కాలం గడిచేకొద్దీ ఈ చైతన్యం మరింతగా బలపడింది. ఆది ద్రావిడ ప్రజల అభ్యున్నతికి తన శక్తిని అంకితం చేస్తూ, 1891లో ఆయన "కులరహిత ద్రవిడ మహాసభ" ను స్థాపించారు. ఈ మహాసభ ఆలోచన, ఆచరణలో విప్లవాత్మకమైనది. ఈ కృషిలో ఆయనకు మద్దతుగా నిలిచిన మరో గొప్ప సంస్కర్త రెట్టమలై శ్రీనివాసన్.

4. తిరుక్కురళ్ పునరావిష్కరణ – చరిత్రను తిరిగి వెలికితీసిన కృషి

తమిళ మరియు సంస్కృత భాషల్లో అపార పాండిత్యం కలిగిన మద్రాసు ప్రెసిడెన్సీ సివిల్ సర్వీస్ అధికారి ఫ్రాన్సిస్ వైట్ ఎలీస్, ప్రాచీన ద్రావిడ సంస్కృతిని సంరక్షించడంలో అపూర్వమైన పాత్ర పోషించాడు. 1825లో ఆయన మద్రాసులో "తమిళ సంఘం" (Tamil Sangam Academy) అనే సంస్థను స్థాపించి, ప్రాచీన తమిళ సాహిత్య సంపదను పునరుద్ధరించడానికి నిరంతర కృషి చేశాడు. ఆయన కాలానికి నలభై సంవత్సరాల ముందుగానే దక్షిణ భారత భాషల ప్రత్యేక అస్తిత్వాన్ని గుర్తించిన దృష్టికోణం, తరువాత రాబర్ట్ కాల్డ్వెల్ (1856) తన "ద్రావిడ భాషా కుటుంబం" సిద్ధాంతంలో ప్రతిపాదించిన తులనాత్మక వ్యాకరణ భావనలకు పునాది వేసినట్లైంది.

ప్రాచీన సాహిత్యాన్ని రక్షించే లక్ష్యంతో ఎలీస్ తాళ పాత్రాలపై లభించిన పాత గ్రంథాలను సేకరించి పరి రక్షించడంలో విస్తృత ప్రయత్నాలు ప్రారంభించాడు. ఈ కృషిలో ఒక ముఖ్య ఘట్టం అయోతీ థాస్ కుటుంబంతో అనుబంధం. జార్జ్ హరింగ్టన్ అనే బ్రిటిష్ సివిల్ సర్వెంట్ ఇంటి పనివారిగా ఉన్న థాస్ కుటుంబీకులు, తిరుక్కురళ్, తిరువల్లువ మాలై, నన్నూరు (నాలటియార్) వంటి సంగం యుగపు అద్భుత గ్రంథాల ప్రతులను సేకరించి ఎలీస్కుఅందించారు. వీటి ద్వారా ప్రాచీన తమిళ సాహిత్యం పునరుద్ధరణకు ఒక కొత్త ద్వారం తెరవబడింది. అయితే ఈ పరిరక్షణ ప్రక్రియలో బ్రాహ్మణ పండితుల వక్రీకరణ ధోరణి థాస్ మనసును కలచివేసింది. 1835, 1837లో జరిగిన ప్రచురణల్లో, ద్రావిడ ముని తిరువల్లువర్ దళిత వారసత్వం, అతని జైన–బౌద్ధ ఆధ్యాత్మిక నేపథ్యం ఉద్దేశపూర్వకంగా విస్మరించబడ్డాయి. తిరువల్లువర్ తల్లి ఆటీ పరైయర్ మహిళ అని సూచించే ఆధారాలను కూడా పట్టించుకోలేదు. ఈ చరిత్ర వికృతీకరణ థాస్ మనసును గాఢంగా తాకింది. అప్పుడు అతను "తిరువల్లువర్ కేవలం ఒక సన్యాసి కాదుబీ ఆయన ద్రావిడ మూలాల నుండి పుట్టిన జైన–బౌద్ధ దళిత మేధావి." అని ప్రజలకు బహిర్గతం చేశాడు. ఈ ధైర్యవంతమైన ప్రకటన, ద్రావిడ చరిత్ర పునర్లిఖనానికి ఒక ప్రేరణగా నిలిచి, అణగారిన వర్గాల సాంస్కృతిక గౌరవం కోసం కొత్త దారిని చూపింది.

5. ఆధ్యాత్మిక అన్వేషణ – బౌద్ధ మత పునరావిష్కరణ

అయోతీ థాస్ పండితార్ జీవితంలో ఒక ప్రత్యేక వసంతం అతని ఆధ్యాత్మిక అన్వేషణ. జ్ఞానం పట్ల అతని తీరని దాహం, సమాజంలో సమానత్వం కోసం అతని నిరంతర కృషి, అతనిని వివిధ మత సంప్రదాయాల వైపు నడిపించాయి. ప్రారంభదశలో ఆయన శైవ మత సూత్రాలకు ఆకర్షితు డయ్యాడుబీ ఆపై వైష్ణవ భావధారలను విశ్లేషించి, క్రైస్తవ మత తాత్త్వికతను కూడా ఆసక్తిగా అధ్యయనం చేశాడు. ఆయన నాస్తిక వాదాన్ని కూడా నిర్లక్ష్యం చేయలేదుబీ మతం అవసరమా, లేదా అన్న ప్రశ్నలను లోతుగా తూలన చేసాడు. కానీ, చివరికి అతని మదిలో రూపుదిద్దుకున్న అవగాహన స్పష్టమైంది. ప్రజలను ఐక్యపరచడానికి మతం ఒక శక్తివంతమైన సాధనం కావాలి. ఈ ఆలోచన అతనిని బౌద్ధమతం వైపు తిప్పింది. బౌద్ధమతం ప్రసాదించే హేతుబద్ధత, సమానత్వం, కులరాహిత్యం వంటి ఆదర్శాలు అతనికి ప్రేరణగా మారాయి.

ఈ ఆధ్యాత్మిక పయనంలో ఒక ముఖ్య మలుపు మద్రాసు సమీపంలోని అడయార్‌లో గల దివ్యజ్ఞాన సమాజం (Theosophical Society) తో అతని అనుబంధం. అక్కడే అతనికి ఆ సమాజ నాయకుడు హెన్రీ స్టీల్ ఓల్కాట్ తో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం అతని ఆలోచనలకు కొత్త ద్వారాలను తెరిచింది. 1898లో, బౌద్ధమతంపై మరింత అవగాహన పొందాలని సంకల్పించి, తనకు ఆప్తుడైన విద్యావేత్త కృష్ణ స్వామి గారు (ఆయన పంచముల కోసం ఏర్పాటు చేసిన పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు) తో కలిసి శ్రీలంక యాత్రకు పయనమయ్యాడు. దివ్యజ్ఞాన సమాజం మద్రాసు శాఖ పత్రికలో నమోదైన సమాచారం ప్రకారం, 1898లో సమాజ సౌజన్యంతో, మద్రాసు పంచముల సంఘం తరపున ఇద్దరు ప్రతినిధులు శ్రీలంకకు పంపబడ్డారు. అక్కడ వారు ప్రముఖ బౌద్ధ సన్యాసి సుమంగళ గారి చేత బౌద్ధమతంలో దీక్ష పొందారు. ఈ కార్యక్రమాన్ని స్వయంగా హెన్రీ ఓల్కాట్ గుర్తించి ధృవీకరించాడు.

ఈ యాత్ర అయోతీ థాస్ జీవితంలో ఒక కీలక ఘట్టం. బౌద్ధమతం అతనికి కేవలం ఆధ్యాత్మిక ఆశ్రయం కాదుబీ అది దళిత సమాజానికి సమానత్వం, గౌరవం, సామాజిక న్యాయం ప్రసాదించే మార్గదర్శక దీపంలా మారింది. శ్రీలంక యాత్రలో బౌద్ధ భిక్షువు సుమంగల నాయక చేత శ్రద్ధాభరితంగా బౌద్ధమత దీక్షను పొందిన అయోతీ థాస్ పండితర్ జీవితం ఒక కొత్త అధ్యాయంలోకి ప్రవేశించింది. ఆ యాత్ర అతనికి కేవలం ఆధ్యాత్మిక దీక్ష మాత్రమే ఇవ్వలేదుబీ అది అతని ఆలోచనలకు దిశానిర్దేశం చేసి, దళిత సమాజానికి సమానత్వం, ఆత్మగౌరవం అందించే ఒక విప్లవాత్మక పంథాను అందించింది. 1898లో, శ్రీలంక నుండి తిరిగి మద్రాసుకు చేరుకున్న వెంటనే, ఆయన తన ఆధ్యాత్మిక అనుభవాన్ని కార్యరూపం దాల్చించేందుకు ముందడుగు వేశారు. మద్రాసు నగరంలోని రాయపేట ప్రాంతంలో "ది శాక్య బౌద్ధ సంఘం" (స్థానిక భాషలో చక్కయ్య పుట్ట సంఘం) అనే సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంఘం ద్వారా అయోతీ థాస్, ఆది ద్రావిడ సమూహాలకు బౌద్ధమత సూత్రాల ద్వారా కొత్త ఆత్మవిశ్వాసం, కొత్త వ్యక్తిత్వం అందించాలని సంకల్పించారు. శాక్య బౌద్ధ సంఘం అతనికి మతం ఒక విముక్తి సాధనం అవుతుందని నిరూపించిన వేదికగా నిలిచింది. అయోతీ థాస్ పండితర్ యొక్క ఆలోచనలు కేవలం మౌఖిక ప్రచారం వరకే పరిమితం కాలేదుబీ అవి శాస్త్రీయ పద్ధతిలో సమాజానికి చేరవేయాలన్న సంకల్పం అతనిలో ముద్రించుకుంది. 1907లో, ఆయన "ఒరు పైసా తమిళం" అనే పత్రికను ప్రారంభించారు దాని ద్వారా బౌద్ధమతం ద్వారా మాత్రమే విముక్తి సాధ్యమని సూటిగా చాటింది. అయోతీ థాస్ బలంగా నమ్మిన భావన ఏమిటంటే: దళితులు కుల వివక్ష బంధనాల నుండి విముక్తి పొందటానికి బౌద్ధమతమే సుజ్జన మార్గం. ఆయన వచనాల్లో కేవలం మతం కాదు, సామాజిక తిరుగుబాటు, ఆత్మగౌరవం, చరిత్ర పునర్లేఖనం కనిపించేవి. సాహిత్యం, జానపద గీతాలు, పురాణాలను ప్రత్యామ్నాయంగా వినియోగించి, బ్రాహ్మణిక కులవిధానాలను సవాలు చేసే కొత్త చరిత్రను రాయాలన్న ప్రయత్నం చేశాడు.

ఆయన వాదనల్లో ఒక ముఖ్యాంశం: ప్రస్తుతం అంటరాని వారుగా పరిగణించబడుతున్నవారు ఒకప్పుడు ఈ భూభాగంలో బౌద్ధులు. బ్రాహ్మణిక మత విధానాలను సవాలు చేసి సమానత్వం కోసం పోరాడినందుకు వారిని సామాజికంగా అవమానించి, అణగదొక్కి అంటరానివారిగా ముద్ర వేయబడ్డారని చారిత్రక ఆధారాలతో ఆయన నిరూపించాడు. అయోతీ థాస్ బౌద్ధాన్ని ఆధునిక సామాజిక భావజాలంతో పునర్ నిర్వచించాడు: స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలపై ఆధారపడిన మతం. ఆయన దృష్టిలో బౌద్ధం కేవలం ఆధ్యాత్మికతే కాదుబీ అది ఒక సామాజిక విప్లవం. అలాగే ఆయన ద్రావిడ చరిత్రపై ఒక గంభీరమైన వ్యాఖ్యానాన్ని అందించాడు: ఆర్య సంస్కృతి దక్షిణ భూభాగానికి రాకముందు వలంగై (కుడిచేతి) వ్యవసాయ వర్గాలు, ఇడంగై (ఎడమచేతి)

చేతి వృత్తుల వర్గాలు అనే విభజన మాత్రమే ఉండేదని, అందులోని పరైయర్లు (వలంగై) బౌద్ధమత అనుసరించేవారని, ఆర్య మత దురాక్రమణతో వారిని అంటరానివారిగా మలిచారని వాదించాడు. అయోతీ థాస్ భావించినది స్పష్టం: దళితులు తిరిగి తమ మూలమైన బౌద్ధమతానికి రావాలి. అదే వారి విముక్తి మార్గం అని తెలియజేశారు.

అయోతీ థాస్ స్థాపించిన సాక్య బౌద్ధ సంఘం తన ఉద్దేశాలను మద్రాసు సరిహద్దులకే పరిమితం చేయలేదు. కాలక్రమేణా, అది వేలూరు, ఛాంపియన్ రీఫ్స్, మారికుప్పం, కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ వంటి ప్రధాన పారిశ్రామిక, ఖనిజ క్షేత్రాల ప్రాంతాలకు విస్తరించింది. ఈ ప్రాంతాల్లోని గని కూలీలు, బంగారు గని కార్మికులు, అధికంగా దళిత వర్గాలవారు కావడంతో, సంఘం భావజాలం వారికి సహజంగానే ఆకర్షణీయమైంది. ఈ శాఖలు బౌద్ధ సంప్రదాయాలను ప్రజలకు చేరవేయడానికి సాయంత్రం మరియు రాత్రిపూట ప్రత్యేక ఉపన్యాసాలను, పాఠాలు నిర్వహించేవి. ప్రతి శాఖ యొక్క కార్యకలాపాలను "ఒరు పైసా తమిళం" పత్రికల్లో వివరంగా ప్రచురించి, బౌద్ధ ఉద్యమం సామాజిక రంగంలో విస్తరించడంలో కీలక పాత్ర పోషించాయి. ఈ వేదికల్లో అనేకమంది యువ దళిత మేధావులు చురుకుగా పాల్గొని, భవిష్యత్తు సామాజిక విప్లవానికి సిద్ధాంత పునాదులు వేసారు. అయితే, ఈ ఉద్యమం ఒంటరిగా నడవలేదు. అయోతీ థాస్ తోపాటు శ్రీలంకకు చెందిన అనగారిక ధర్మపాల భారతదేశంలో మహాబోధి ఉద్యమాన్ని ప్రారంభించి బౌద్ధమతానికి కొత్త ఊపిరి పోసిన నాయకుడు కూడా కీలక సహకారం అందించాడు. అలాగే సింగారవేల్, దక్షిణ భారతదేశానికి చెందిన ప్రఖ్యాత కమ్యూనిస్టు నాయకుడు, మరియు ప్రొఫెసర్ పి. లక్ష్మీ నరసు (క్రిస్టియన్ కళాశాల, మద్రాసు ప్రొఫెసర్) వంటి ప్రతిభావంతులు కూడా ఈ ఉద్యమంలో భాగమయ్యారు. ప్రొఫెసర్ పి. లక్ష్మీ నరసు, అయోతీ థాస్ ఆలోచనలతో ప్రేరేపించబడినవాడు, మహాబోధి సొసైటీలో చురుకైన సభ్యుడిగా నిలిచాడు. ఆయన మద్రాసు బౌద్ధ సంఘం స్థాపించి బౌద్ధ పరిశోధనలకు నూతన దారులు తీశాడు. 1907లో ఆయన రచించిన "ది ఎసెన్స్ ఆఫ్ బౌద్ధం" (బౌద్ధమతం యొక్క సారాంశం) వంటి గ్రంథాలు, ఆధునిక భారతీయ మేధావులకు ఒక దిక్సూచిని అందించాయి. ఈ గ్రంథాలు, ప్రొఫెసర్ నరసు పరిశోధనలు, తరువాతి కాలంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ నూతన బౌద్ధోద్యమానికి ప్రేరణాత్మక మూలాలు అయ్యాయి. అంబేద్కర్ ఆలోచనల్లో కనబడిన సమానత్వం, స్వేచ్ఛ, మానవ గౌరవం విలువలకు ఈ రచనలు ఒక ప్రాథమిక చరిత్రాత్మక పునాదిని అందించాయి.

6. కుల గుర్తింపును తిరస్కరించడం – అయోతీ థాస్ ఆలోచనా విప్లవం:

దళిత సమాజం ఎదుర్కొంటున్న కులాధారిత వివక్షను ఎదుర్కోవడంలో న్యాయపరమైన ప్రయత్నాలు విఫలమయ్యే కొద్దీ, అయోతీ థాస్ ఆవేదన మరింత పెరిగింది. వివిధ ప్రజాసంఘాలు తమ న్యాయమైన డిమాండ్లను అహేతుకంగా తిరస్కరించడంతో, ఆయన మనసులో ఒక కీలక ప్రశ్న మెలకువైంది: "మనం ఎవరు? ఈ కులవ్యవస్థలో మన స్థానమేంటి?" ఈ ఆత్మపరిశీలన అయోతీ థాస్ను తన కుల చరిత్రపై విస్తృత అధ్యయనానికి పూనుకొనిచ్చింది. మద్రాసులోని నెస్లియన్ మిషన్ పాఠశాలలో, ద్రావిడ సమాజానికి సంబంధించిన విద్యా కార్యక్రమాలను నడిపిస్తున్న రెవరెండ్ జాన్ రథినమ్తో ఆయన పరిచయం ఈ దిశలో ఒక కీలక మలుపు అయ్యింది. రథినమ్ సాన్నిధ్యం, ఆలోచనల లోతు అయోతీ థాస్ మేధస్సును కొత్త దిశగా మలిచాయి. ఈ మైత్రి ఫలితంగా, 1885లో "ద్రావిడ పాండియన్" అనే పత్రికను ఇద్దరూ కలిసి ప్రారంభించారు, అయోతీ థాస్ సహ సంపాదకుడిగా పనిచేశారు. ఈ వేదిక ద్వారా ఆయన సమాజంలోని మూల సమస్యలను విశ్లేషిస్తూ కులవ్యవస్థపై తీవ్ర విమర్శలు చేయడం ప్రారంభించారు. తన పరిశోధనల ఫలితంగా, 1886లో ఆయన చేసిన ఒక విప్లవాత్మక ప్రకటన చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది: "దళితులు హిందువులు కాదు" అని ఆయన తర్కపూర్వకంగా నిర్ధారణ చేశాడు. ఇది కేవలం ఒక వ్యాఖ్య కాదు – అది శతాబ్దాలుగా అణచివేయబడిన ప్రజల ఆత్మగౌరవాన్ని పునరుద్ధరించే ఒక ప్రకటన పత్రం.

ఈ లోతైన పరిశోధనల ద్వారా అయోతీ థాస్ మరో ముఖ్యమైన సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు: పంచములు, దళితులు అనేవారు వాస్తవానికి "ఆది తమిలలు" – నిజమైన అసలైన తమిళులు అని. (మూర్తి, పి., దళిత్ సమూగవియల్, పాండిచ్చేరి, 1994, పేజి 80). అణగారిన దళిత వర్గాల పూర్వ వైభవం ఆయన పరిశోధనల్లో స్పష్టంగా ప్రతిధ్వనించింది. తంగవేలు తన భారతీయ వరలారు (వాల్యూమ్ III, చెన్నై, 1977, పేజి 126) లో పేర్కొన్నట్లు, "ఆది తమిలర్" అన్న పదాన్ని అయోతీ థాస్ దళితులకు గౌరవప్రదమైన ఒక గుర్తింపుగా ఇచ్చారు. అయోతీ థాస్ యొక్క ఆలోచనా సారాంశం స్పష్టమైనది: "దళితులు తమను హిందువులుగా అంగీకరిస్తే,

వారు కులవ్యవస్థలోని అసమానతలు, అణిచివేతలనే సమ్మతించినట్టవుతుంది". ఈ సూత్రాత్మక వాదన ఆయన దళిత సమాజానికి ఇచ్చిన ఒక బలమైన సందేశం. ఈ ఆత్మనిబద్ధతే ఆయనను 'హిందూ' అనే గుర్తింపును ధైర్యంగా తిరస్కరించేలా చేసింది. ఈ ధోరణి ఒక పరిమిత ఆలోచన మాత్రమే కాకుండా ప్రాయోగిక చర్యల్లోనూ ప్రతిఫలించింది. 1891లో జరిగిన జనగణన సందర్భంలో, తమిళ ప్రభావిత ప్రాంతాలలోని దళితులను హిందువులుగా నమోదు చేయకూడదని, వారికి "ఆది తమిళులు" అనే గుర్తింపుని ఇవ్వాలని బ్రిటిష్ ప్రభుత్వానికి ఒక వివరణాత్మక మెమోరాండం సమర్పించారు. ఆ కాలం పరిస్థితులు నుండి గమనిస్తే, ఇది ఎంత విప్లవాత్మకమైనది అనేది అర్థమవుతుంది. అనేక ఇతర కులాలు జనగణనలో తమను ఉన్నత కులాలతో (క్షత్రియులు, వైశ్యులు) సమం చేయాలని పట్టుబడుతున్నప్పుడు, అయోతీ థాస్ మాత్రం మరో మౌలిక దిశలో ప్రయాణించారు. ఆయన వాదన ఇలా ఉంది: "దళితులు హిందూ కులవ్యవస్థలో భాగం కాదుబీ వారు కులవ్యవస్థ వెలుపల నిలిచినవారు, వారిని బౌద్ధులు మరియు కుల రహిత ద్రావిడర్ (ఆది ద్రావిడులు) గా పరిగణించాలి". ఈ సిద్ధాంతాన్ని సామాజిక వేదికలపై ప్రతిష్టాత్మకంగా వినిపించేందుకు, అయోతీ థాస్ మరియు రెట్టమలై శ్రీనివాసన్ 1891 డిసెంబరులో నీలగిరిలో ఒక సదస్సు నిర్వహించారు. అక్కడ వారు సంయుక్తంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితులను ఆది తమిళులు, ఆది ద్రావిడులుగా అధికారిక జనాభా లెక్కల్లో నమోదు చేయాలి అని కోరారు.

దళిత సమాజానికి స్పష్టమైన దిశానిర్దేశం ఇవ్వాలన్న ఉద్దేశంతో, అయోతీ థాస్ 1891లో "ద్రావిడ మహాజన సంఘం" అనే ప్రభావవంతమైన సంస్థను స్థాపించాడు. ఈ సంస్థ ఆధ్వర్యంలో అదే సంవత్సరం డిసెంబర్ 1న, నీలగిరుల ఊటీ పట్టణంలో ఒక చారిత్రాత్మక సమావేశం జరిగింది. ఆ సమావేశంలో జరిగిన సుదీర్ఘ చర్చల అనంతరం, దళితుల సమగ్ర అభ్యున్నతికి అవసరమైన పది కీలక తీర్మానాలను ఆమోదింపజేశారు.

ఈ తీర్మానాలలో ప్రాధాన్యత పొందిన అంశాలు –

1. దళిత విద్యార్థులకు ఉచిత ప్రాథమిక విద్య హక్కు.
2. సాధారణ పాఠశాలల్లో ప్రవేశానికి అడ్డంకులు ఎదురైతే, ప్రత్యేక పాఠశాలలు మరియు వసతి గృహాలు ఏర్పాటు చేయడం.
3. ప్రభుత్వ ఆధీనంలోని బంజరు భూములను దళితులకు పంచడం.
4. దేవాలయ ప్రవేశానికి హక్కు కల్పించడం వంటి సామాజిక సమానత్వ చర్యలు.

ఈ తీర్మానాలను ఆమోదించిన తర్వాత, అయోతీ థాస్ వాటిని మద్రాసు మహాజనసభ, అఖిల భారత జాతీయ కాంగ్రెస్ వంటి ప్రజాప్రతినిధ్య సంస్థలకు పంపి మద్దతు కోరాడు. అయితే, సమాజంలోని ప్రధాన శక్తులు అతని డిమాండ్లను తిరస్కరించాయి. ఇది అప్పటి సామాజిక వాస్తవాలను ప్రతిబింబించిన ఘట్టం.

7. ఆది ద్రావిడ గుర్తింపు:

దళితులపై ఉన్న "పరైయర్" అనే హేళనాత్మక పదానికి బదులుగా, అయోతీ థాస్ వారిని "ఆదిమ తమిళులు" (ఆది ద్రావిడులు) గా పరిగణించాలని 1881 జనగణన నుంచే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాడు. ఈ ఆలోచనను మరింత బలోపేతం చేస్తూ, ఆయన "ఆది ద్రావిడ మహాజన సభ" అనే మరో వేదికను 1891లో స్థాపించాడు. అయితే, ఈ ఉద్యమంలోనే ఒక భావ వైచిత్ర్యం వెలసింది. అయోతీ థాస్ ఉద్యమ సహచరుడు, బంధువు మరియు ప్రముఖ నాయకుడు రెట్టమలై శ్రీనివాసన్ మరో దృక్పథాన్ని ముందుకు తెచ్చాడు. అతని వాదన కూడా స్పష్టమైనది: "పరైయర్ అనే పదం మనకు అవమానం కాదుబీ అది మనకు గౌరవప్రదమైనది. మన గౌరవం దానిలోనే ఉంది". ఈ భావనతోనే శ్రీనివాసన్ "పరైయర్ మహాజన సభ" ను స్థాపించాడు, అంతేకాక "పరైయర్" అనే పత్రికను కూడా నడిపాడు (S. Srikumar, Kolar Gold Field: Unfolding the Untold, Partridge Publishing India, 2014). అయోతీ థాస్ ప్రవేశపెట్టిన సమానత్వ భావజాలం కేవలం తన కాలంలోనే కాక, తర్వాతి తరాల దళిత నాయకుల ఆలోచనా ధోరణిని కూడా ప్రభావితం చేసింది. ఆయన ఆలోచనల కాంతి కిరణాలు రెట్టమలై శ్రీనివాసన్, ఎం.సి. రాజా వంటి ప్రముఖ నాయకుల వైఖరిని మలిచాయి. వారిలో ముఖ్యంగా ఎం.సి. రాజా ఒక పరైయర్ నాయకుడు, మద్రాస్ కౌన్సిల్ సభ్యునిగా రాజకీయ వేదికపై ప్రఖ్యాతి గడించిన వ్యక్తి అయోతీ థాస్ కలలను కార్యరూపం దాల్చించడంలో కీలకపాత్ర పోషించాడు. ఆయన ప్రభుత్వ యంత్రాంగంలో పరైయర్ అనే హేళనాత్మక పదాన్ని రద్దు చేయించి, దానికి బదులుగా "ఆది ద్రావిడ" అనే గౌరవప్రదమైన పదాన్ని ఉపయోగించేందుకు సుదీర్ఘమైన పోరాటం చేశాడు. 1914లో, ఆయన కృషి ఫలించి, మద్రాస్ కౌన్సిల్‌లో ఆమోదించబడిన తీర్మానం ద్వారా ఈ పదమార్పు అధికారిక రికార్డుల్లో

స్థిరపెట్టబడింది (S. Srikumar, Kolar Gold Field: Unfolding the Untold, Partridge Publishing India, p. 357). ఈ సంఘటనతో అయోతీ థాస్ అనుకున్న లక్ష్యం సాధ్యమైంది, ఆయన కలలు నిజమయ్యాయి.

8. ద్రావిడ వాదం - దాస్ దృక్పథం

దక్షిణ భారతదేశంలో ద్రావిడ చైతన్యానికి మూల ప్రతిపాదకులలో ఒకరు అయోతీ థాస్. మద్రాసులోని రాయపేట వెస్లీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెవరెండ్ జాన్ రత్నంతో కలిసి ఆయన 1882లో "ద్రావిడ కళ%న%గం" అనే రాజకీయ వేదికను స్థాపించడం ఈ చైతన్యానికి మొదటి మెట్టు. ఈ జంట 1896లో "ద్రావిడ పాండియన్" అనే పత్రికను ప్రారంభించి ద్రావిడ వాదం యొక్క స్వరాన్ని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లింది (జి. అలోసియస్, Nationalism without a Nation in India, Oxford, 2000). అయోతీ థాస్ ఆలోచనల్లో ద్రావిడ వాదం ఒక సిద్ధాంతం మాత్రమే కాక, స్వాభిమాన పోరాటం కూడా. ఈ అంశాన్ని చరిత్రలో తరచుగా విస్మరించారు. కాని, ఆయన దృక్పథం విప్లవాత్మకం. 1912 అక్టోబర్ 30న ''తమిలన్'' పత్రికలో ఆయన జాతీయవాదాన్ని నిర్వచిస్తూ, "ఒక భూమి పట్ల స్థానికుల హక్కు అనేది ఆ భూమిని అభివృద్ధి చేసి ఆ ఫలాలను అనుభవించే వారికే చెందుతుంది" అని స్పష్టం చేశారు. ఈ నిర్వచనంలో ఆయన సమానత్వాన్ని ప్రధానంగా ఉంచి, "సమానుల మధ్యే నిజమైన జాతీయవాదం వికసిస్తుంది" అని నొక్కి చెప్పారు. అఖిల భారత జాతీయ కాంగ్రెస్ పార్టీపై ఆయన గట్టి విమర్శలు చేశారు. 1910 సెప్టెంబర్ 14న "తమిలన్" పత్రికలో ఆయన ఒక వ్యాసంలో "పార్టీ పేరులో జాతీయత ఉన్నా, చేతలలో ఎక్కడా సమానత్వం లేదు" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఆర్య సంస్కృతాధిపత్య ధోరణిని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. దక్షిణ భారతీయుల స్థానిక సంస్కృతి, భాషలకు ఆయన అచంచలమైన మద్దతు తెలిపారు. తమిళ భాష ప్రాచుర్యం పొందేందుకు, అది మరింత సజీవంగా నిలవాలంటే అక్షరాల సంఖ్యను తగ్గించాలని ప్రతిపాదించారు (తమిలన్, 30 డిసెంబర్ 1908). అనేక వ్యాసాలు, ప్రసంగాలలో ఆయన తమిళ సంస్కృతి పట్ల తన అభిమానాన్ని పదే పదే వ్యక్తం చేశారు. ద్రావిడ వాదాన్ని, ద్రావిడ స్వాభిమానాన్ని ఆయన సామాజిక న్యాయం, భాషాభిమానంతో కలిపిన ఒక సమగ్ర ఉద్యమంగా తీర్చిదిద్దారు.

9. ద్రావిడ సంస్కృతిలో బౌద్ధ-జైన వారసత్వాన్ని వెలికితీసిన అయోతీ థాస్

"గతమే భవిష్యత్తుకు దారికొల్పే దీపస్తంభం" అనే సూత్రాన్ని ధ్యేయంగా పెట్టుకొని, అయోతీ థాస్ ద్రావిడ చరిత్రను కొత్త కోణంలో పరిశీలించాడు. భారతీయ చరిత్రను బ్రాహ్మణకేంద్రీకృత దృక్కోణం నుంచి విడదీసి, బౌద్ధ మత తాత్విక దృక్కోణంలో పునర్రచించే ప్రబల ప్రయత్నం చేశాడు. ముఖ్యంగా తమిళం, దళితులు, బౌద్ధమతం అనే మూడు అంతరంగాల మధ్య సంబంధాన్ని పునర్నిర్మించి, తన సిద్ధాంతాలకు దృఢమైన పునాదిని వేసుకున్నాడు.

పాళీ భాషలోని బుద్ధుని జీవితచరిత్రలు, అశ్వఘోషుని బౌద్ధ గ్రంథాలు, వేదాలు, ఉపనిషత్తుల వంటి ఆధారాలను విపులంగా అధ్యయనం చేసి, వాటి తాత్పర్యాన్ని తమిళ సాహిత్య ధారలో మళ్లీ ప్రస్ఫుటం చేశాడు. ఆరమణి దీపం, ఆరమణి సారం, గొౌత్రికురుళ్, త్రివాసకం, త్రికటుగం, మణిమేకలై, జీవక చింతామణి, శిలప్పాధికారం, బంగపతి, కుండలకేసి, సూదామణి వంటి అనేక సాహిత్య గ్రంథాలను ఆధారంగా తీసుకుని, బౌద్ధ సిద్ధాంతాలను తమిళ భాషా స్వరూపానికి దగ్గరగా తీర్చిదిద్దాడు.

ఈ విధంగా ఆయన ప్రతిపాదించిన బౌద్ధం "తమిళ బౌద్ధం"గా ఒక ప్రత్యేక రూపం దాల్చింది. ఇది కేవలం మతపరమైన ఉద్యమం కాకుండా, హేతువాదం, నాస్తికత్వం, కులవ్యతిరేకత, సామాజిక న్యాయం వంటి ఆధునిక ఆలోచనలతో బౌద్ధాన్ని కలిపిన ద్రావిడ తాత్విక ప్రవాహంగా నిలిచింది. తమిళ సాహిత్యంలో బౌద్ధ-జైన మతాల పాత్రను ఆయన విశ్లేషిస్తూ, శిలప్పాధికారం, మణిమేకలై, బంగపతి, కుండలకేసి, జీవక చింతామణి అనే ఐదు మహాకావ్యాలు తమిళ భాషకు చేసిన శృంగార అలంకారం లాంటివని పేర్కొన్నాడు. వీటిలో మణిమేకలై, కుండలకేసి బౌద్ధ కవుల కృతి కాగా, మిగిలిన మూడు జైన కవుల ప్రతిభఫలాలు. తిరుక్కురళ్ విషయంలో ఆయన చేసిన వ్యాఖ్యలు విశేష ప్రాముఖ్యం కలిగినవి. తిరుక్కురళ్‌ను ఆయన "త్రివాసకం"గా పిలుస్తూ, "తిరి" అంటే "మూడు" అని, ఇది బుద్ధుని మూడు పిటకాల ప్రతిరూపం కాబట్టి దీన్ని ద్రావిడ భాషలో మొట్టమొదటి బౌద్ధ గ్రంథంగా చూడాలని వాదించాడు (అలోసియస్ జి., ఇయోతీ థాస్సర్ సింథానిగల్, పాలయంకోట్టై, 1999, పుట 14). బౌద్ధం-జైన మతాల మధ్య పోలికలు చూపుతూ, ఈ రెండు మతాలు ప్రజలకు అందుబాటులో ఉండే భాషలోనే తమ సూత్రాలను బోధించాయని థాస్ స్పష్టంచేశాడు. బుద్ధుడు తన

సహచరులకు ప్రజల మాతృభాషలోనే బోధించాలని సూచించినట్లు కాల్వ వగ్గ గ్రంథంలో ఉందిబీ జైనుల సిద్ధసేన దివాకర చరిత్రలో కూడా ఇదే భావన కనిపిస్తుంది. థాస్ అభిప్రాయం ప్రకారం, ఈ రెండు మతాలు తమిళ భాషకు అనేక మేధోసంపదలు అందించాయి. పల్లికూడం వంటి విద్యాసంస్థల ద్వారా జైనులు ద్రావిడ ప్రాంతాల్లో విద్యా వ్యాప్తికి కృషి చేశారు. స్థానిక వైద్య పద్ధతులు, తాత్విక సంప్రదాయాలతో బౌద్ధ-జైన మతాలు విడదీయరాని సంబంధం కలిగించాయి. ద్రావిడ ప్రజలు తమ పూర్వపు ఆచారాలను విడువకుండానే ఈ మతాల సౌలభ్యం వల్ల తమ జీవన విధానాలను సుసంపన్నం చేసుకున్నారని ఆయన నమ్మాడు.

అంబికయ్యమ్మన్ ప్రసాదించిన త్రివాసకం, హరిశ్చంద్ర అబద్ధం, ఇంద్ర జాతి చరిత్ర, శాక్య మహర్షి చరిత్ర, తిరువల్లువర్ చరిత్ర, నందన్ చరిత్ర, బుద్ధుడు రాత్రి మరియు పగలు లేని కాంతి, మురుగ భగవాన్ చరిత్ర వంటి రచనలతో పాటు, నిజమైన బ్రాహ్మణత్వం, ప్రాచీన తమిళ భాషా మూలాలు, బుద్ధుని ఆదివేదం వంటి విషయాలను కూడా ఆయన సబాల్టన్ దృక్కోణంలో రాసి, సామాన్య ప్రజల హృదయాలకు చేరువ చేశాడు.

10. పత్రికా నిర్వహణ - ముద్రిత పదం ద్వారా చైతన్య జ్యోతి:

సామాజిక ఉద్యమాల చరిత్రలో పత్రికలకు ఉన్న ప్రాధాన్యత అపారమైంది. మాట మాటగా వ్యాప్తి చెందే నినాదాలు ఒక వర్గానికి ప్రేరణ ఇవ్వగలవుబీ కానీ ముద్రిత పదం శక్తి, అనేక మందిని ఏకకాలంలో మేల్కొలిపే సామర్థ్యం కలిగి ఉంటుంది. కాలానుగుణంగా దీనిని గుర్తించిన నాయకులు, తమ ఆలోచనలను సామాన్య ప్రజల హృదయాల్లోకి చొప్పించడానికి పత్రికను శక్తివంతమైన ఆయుధంగా ఉపయోగించారు (ఘోష్, ఎ. 2006, పవర్ ఇన్ ప్రింట్: పాపులర్ పబ్లిషింగ్ అండ్ పొలిటిక్స్ ఆఫ్ లాంగ్వేజ్ అండ్ కల్చర్ ఇన్ కోలోనియల్ సొసైటీ, న్యూఢిల్లీ: ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్). మద్రాసు పరిసర ప్రాంతాల్లో పరైయర్ సమాజం 19వ శతాబ్దం మధ్యకాలంలో ఆత్మజ్ఞానం పొందుతూ, తమ స్వరాన్ని వ్యక్తపరచడానికి పత్రికా రంగంలో అడుగుపెట్టింది. 1869లో పండిత తిరు వెంకటస్వామి ఆ దళిత చైతన్యానికి తొలి కాంతి ప్రసరించినవాడు. అతని "సూర్యోదయం" పత్రిక మద్రాస్ నగరంలో వెలువడినప్పుడు, అది కేవలం వార్తాపత్రిక మాత్రమే కాదు, ఆత్మగౌరవం కోసం కొట్టుకున్న ప్రతి హృదయానికి మేల్కొలుపు ఘంటిక. ఈ వెలుగులోనే, ఒక తరం తరువాత, అయోతీ థాస్ ముద్రిత పదం మహత్తును మరింత విశ్లేషించి, దాన్ని తన ఉద్యమానికి కీలక స్తంభంగా మలిచాడు. బౌద్ధమత తాత్వికత, కులవ్యతిరేక ఆలోచనలు, ద్రావిడ చరిత్ర - ఈ మూడింటినీ సామాన్యుల గృహాల లోపలికి చేర్చడానికి ఒక ప్రత్యేక వేదిక అవసరమని ఆయన గ్రహించాడు. అలా "ఒక పైసా తమిళం" అనే వారపత్రిక రూపుదిద్దుకుంది. 1907 జూలై 19న ఇది వెలువడినప్పుడు, దాని వెనుక ఉన్న ఆలోచన సూటిగా, స్పష్టంగా ఉండేది - జ్ఞానం అందరికీ, అందుబాటులో ఉండాలి. కేవలం ఒక పైసా ధరతో ప్రతీ బుధవారం ప్రజలకు అందుబాటులోకి వచ్చిన ఈ పత్రిక, తక్కువ ధరలో విస్తృత చైతన్యం పంచిన అద్భుతమైన ఉదాహరణగా నిలిచింది. కేవలం ఆరంభంతో సంతృప్తి చెందకుండా, అయోతీ థాస్ పత్రికా రంగంలో తన సత్తాను నిరూపించాడు. వారం వారానికి పదునైన వ్యాసాలు, కులవ్యవస్థపై ఘాటైన విమర్శలు, సామాజిక సంస్కరణల పట్ల ఆవేశపూరితమైన పిలుపులు - ఇవన్నీ ఈ పత్రిక పుటల్లో ఉప్పొంగేవి. చివరికి, తన ఉద్యమ దిశను మరింత విస్తరించడానికి, 1908 ఆగస్టు 26న ఆయన ఈ పత్రికకు కొత్త పేరు ఇచ్చాడు - "తమిళన్". ఈ పేరుమార్పు కేవలం ఒక ఫార్మాలిటీ కాదుబీ ఇది ఆయన ఆలోచనల పరిణామానికి ప్రతీక, ద్రావిడ స్వాభిమానానికి పునరుజ్జీవం.

అయోతీ థాస్ ఆలోచనలకు, అతని సామాజిక ఉద్యమాలకు ఒక ముఖ్య వేదిక 'ఒరు బైసద్ తమిళన్' పత్రిక. ఈ పత్రిక ముఖచిత్రం ప్రత్యేకతతో నిలిచేది. బౌద్ధ స్ఫూర్తిని గుర్తు చేస్తూ తొమ్మిది తామర రేకులపై చిహ్నం ఆకళింపు చెయ్యబడింది. ఎడమ వైపు రేకుపై 'జయదు', కుడి వైపు రేకుపై 'మంగళం', మధ్య రేకుపై 'నన్మెయిక్ కాపాడిది' అని శ్లోకములా రాయబడిన పదాలు ఈ పత్రిక యొక్క దృఢమైన విలువలను ప్రతిబింబించేవి. ఈ పత్రిక ద్వారా అయోతీ థాస్ ఉత్తర భారత సాంస్కృతిక ఆధిపత్యాన్ని, దక్షిణాదిపై ఉండే ఆర్య సంస్కృతి ప్రభావాన్ని, మూఢనమ్మకాలను, అంటరానితనాన్ని వంటి అన్యాయాలను ఘాటుగా విమర్శించాడు. ఆయన రచనల్లో వేద ఇతిహాసాల విశ్లేషణ, సామాజిక దురాచారాలపై వ్యంగ్యం, సామాజిక న్యాయవాదం ప్రతిబింబించేవి. ఆయన రచించిన పుస్తకాలలో 'యథార్థ బ్రాహ్మణ వేదాంత వివరాలు', 'వేష బ్రాహ్మణ వేదాంత వివరాలు', 'శ్రీ మురుగ దేవుడి చరిత్ర', 'విభూతి పరిశోధన' వంటి గ్రంథాలు ప్రత్యేక ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. వీటిలో ఆయన మూఢనమ్మకాల వ్యతిరేకత, కుల నిర్మూలన, ప్రాతినిధ్య రాజకీయాలు, అణగారిన

వర్గాల విముక్తి, స్త్రీవాదం, తమిళ భాషా అవగాహన, హేతుబద్ధత, ఆత్మగౌరవం, హిందీ వ్యతిరేకత, వైదిక మతం, బ్రాహ్మణ వ్యతిరేకత, సామాజిక విలువలు, సామాజిక న్యాయం, అంటరానితనం నిర్మూలన వంటి ఆలోచనలను ప్రబోధించాడు (డికెన్స్ లియోనార్డ్, వీ. One Step Inside Tamilian On the Anti-Caste Writing of Language, Social Scientist, Vol. 45, No. 1/2, 2017).

అయోతీ థాస్ మరణానంతరం ఈ పత్రిక కొంతకాలం విల్సన్ పట్టాభిరామన్ ఆధ్వర్యంలో కొనసాగింది. ఆ తరువాత కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ ప్రాంతంలో అప్పాదురై ఈ పత్రికను ప్రచురిస్తూ దాని వ్యాప్తిని విస్తరించాడు (R. సురేష్ కుమార్., తమిళనాడులో అణగారిన తరగతి ఔన్నత్యానికి పండిట్ అయోతీ థాస్ పాత్ర, Review of Research, Vol. 1, Issue IV, 2012). ఈ పత్రిక ప్రభావం మద్రాసు లేదా తమిళనాడులో మాత్రమే పరిమితం కాలేదు. అది కర్ణాటక, కోలార్ గోల్డ్ ఫీల్డ్స్, కొడగు, అలాగే బర్మా, దక్షిణాఫ్రికా, ఇరంగూన్, సింగపూర్ వంటి ప్రపంచంలోని తమిళ వలసల ప్రాంతాలకు వ్యాపించింది. ఈ విధంగా, 'ఒరు పైసా తమిళన్' తమిళ చైతన్యానికి, ద్రావిడ స్వాభిమానానికి, సామాజిక సమానత్వానికి ఒక శక్తివంతమైన ఆయుధంగా నిలిచింది.

11. రాజకీయ రంగంలో అయోతీ థాస్ – మితవాద స్వరాలు:

అయోతీ థాస్ ఆలోచనా ప్రవాహం సామాజిక సంస్కరణల వరకే పరిమితం కాలేదుబీ రాజకీయాలను కూడా ఆయన స్వతంత్ర దృష్టితో పరిశీలించాడు. తన కాలానికి విరుద్ధంగా, స్వరాజ్యాన్ని తక్షణ అవసరంగా చూడకుండా, మితవాద ధోరణిని అవలంబించాడు. ఆయన దృష్టిలో, క్రింది కులాల సామాజిక సంక్షేమం, విద్యా విస్తరణ, ఆర్థిక అభివృద్ధి కోసం కొంతకాలం బ్రిటిష్ పాలన అవసరం. స్వదేశీ ఉ న్నతవర్గాలు స్మశాన భూముల్లాంటి మౌలిక హక్కులను క్రింది కులాలకు నిరాకరిస్తూ ఉంటే, అదే సమయంలో స్వరాజ్యం కోసం కంఠధ్వనులు వినిపించడం వ్యంగ్యాస్పదమే అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించాడు (తమిలన్, 07 జనవరి 1914, పేజీ 1).

ఈ దృష్టికోణం కాంగ్రెస్‌పై ఆయన విమర్శలను మరింత పదును పెట్టింది. ఆయన అభిప్రాయంలో అఖిల భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ధనికుల, భూస్వాముల ప్రయోజనాలను రక్షించే వేదికగా ఉంది. బెంగాల్ బ్రాహ్మణులు, మరాఠా బ్రాహ్మణులు ఈ సంస్థలో ఆధిపత్యం చూపుతున్నారని, దాని వల్ల దక్షిణ భారత ప్రజలు మాత్రమే కాక క్రింది కులాల వారు పూర్తిగా ప్రాతినిధ్యానికి దూరమవుతున్నారని ఆయన ఘాటుగా విశ్లేషించాడు. ఇంకా ఒక ముఖ్యమైన అంశాన్ని ఆయన బహిర్గతం చేశాడు – భారత జాతీయతకు నిజమైన ముప్పు విదేశీయుల నుంచి కాకుండా కులం మరియు మతం ఆధారిత అసమానతల నుండే ఉద్భవిస్తుంది అని ఆయన స్పష్టంగా పేర్కొన్నాడు (తమిలన్, 24 డిసెంబర్ 1913, పేజీ 2).

ఈ స్పష్టత ఆయనకు అంతర్గత రాజకీయ విభజనలపై ఆగ్రహం కలిగించింది. ఆయన చెప్పిన మరో విమర్శ మరింత కఠినమైనది: భారత జాతీయ కాంగ్రెస్ ఆరు కోట్ల దళితుల కష్టాలను పక్కన పెట్టి, దక్షిణ ఆఫ్రికాలోని వర్ణవివక్ష సమస్యలపై గొంతు విప్పడం నిరుపయోగం అని ఆయన అభిప్రాయపడ్డాడు (అలోసియస్, జి., ఇయోతీతస్సర్ సింతనైగల్, పేజీ 94). ఈ ప్రకటనలు ఆయనను బ్రిటిష్ మద్దతుదారుడిగా కాకుండా, క్రింది కులాల సమస్యలను ప్రధాన అజెండాగా చేసిన వాస్తవవాదిగా నిలబెట్టాయి.

12. సబాల్టన్ చరిత్రకర్తగా అయోతీ థాస్–ప్రత్యామ్నాయ కృషి:

అయోతీ థాస్ ఒక సామాజిక చింతకుడు మాత్రమే కాదుబీ చరిత్రను పునర్నిర్వచించిన ఒక సబాల్టన్ చరిత్రకర్త. పురాణాలు, ఇతిహాసాలు, జానపద సంప్రదాయాలను ఆయన సాధారణ పాఠకుని కోణం నుంచి చూడలేదు. పీడిత జనాల దృష్టితో, అణగారిన సమూహాల బాధలను కేంద్రీకరించి చరిత్రను పునర్మూల్యాంకనం చేయడానికి ప్రయత్నించాడు. భారతదేశంలో ప్రత్యామ్నాయ చరిత్ర రచనా పద్ధతికి తొలి మద్దతుదారులలో ఆయన స్థానం అగ్రగణ్యమైనది. అయోతీ థాస్ ఆలోచనలకు ఒక విశాలమైన భౌతిక, మానసిక పునాది ఉంది. హిందూయిజం, బౌద్ధం, జైనం, ఇస్లాం, క్రైస్తవ మతం వంటి వివిధ మతాల తాత్విక భావాలను లోతుగా అధ్యయనం చేయడంతో పాటు, తమిళం, సంస్కృతం, పాళీ, ఇంగ్లీష్ భాషలపై ఆయనకు పట్టు ఉండేది. కర్నల్ ఓల్కట్ వంటి పాశ్చాత్య మేధావుల రచనలు కూడా ఆయన అధ్యయనంలో భాగమయ్యాయి (Old Days Buddhist Records, 1896-1898, Vol. VI, మద్రాస్, పి. 346).

ఈ బలమైన పునాదులపై నిలబడి, ఆయన చరిత్రను కొత్త కోణంలో పునర్రచించడానికి ప్రయత్నించాడు. పురాణాలు, జానపద సంప్రదాయాలు ఆయనకు కథల కవచం కాదు,

చరిత్రకు ఆధారం అయ్యాయి. రచయితగా ఆయన చూపిన విస్తారాన్ని నేటి సమాజం గమనించాలి: 325 రాజకీయ వ్యాసాలు, 55 సాహిత్య వ్యాసాలు, 51 సామాజిక వ్యాసాలు, 109 మతపరమైన వ్యాసాలు ఆయన తమిళన్ పత్రికలోనే ప్రచురించాడు. ఈ రచనలు కేవలం సంఖ్యల గణనకే పరిమితం కావుబీ అవి దళితుల ఆత్మగౌరవానికి పునాది వేసిన మేధోప్రయాణంగా పరిగణించాలి.

13. భవిష్యత్తు తరాలకు వేగు చుక్క:

అయోతీ థాస్ సాధించిన గొప్ప విజయాల్లో ఒకటి, అణగారిన వర్గాల ప్రజలు తమ స్వీయ చరిత్రను తెలుసుకోవాలన్న, దాన్ని అధ్యయనం చేయాలన్న చైతన్యాన్ని కలిగించడం. పీడిత జనాల ఆత్మగౌరవాన్ని మేల్కొలిపిన జ్యోతి ఆయనది. తన ఆలోచనల శక్తితో ఆయా వర్గాలనే కాక, ఆధిపత్య వర్గాల మేధావులను కూడా ప్రభావితం చేశారు. దీన్ని ద్రావిడ ఉద్యమనేత ఇ.వి. రామస్వామి (పెరియార్) స్వయంగా అంగీకరించారు. తన సంఘసంస్కరణ ఆలోచనలకు, హేతుబద్ధమైన ఆత్మగౌరవ ప్రచారానికి పండితమణి అయోతీ థాస్ మరియు తంగవ్యాల్ అప్పతురై ప్రధాన ప్రేరణలు అని. ఈ అంగీకారం అయోతీ థాస్ ఆలోచనల విశాలతను, ప్రభావాన్ని ప్రతిబింబిస్తుంది. అయోతీ థాస్ బౌద్ధాన్ని దళిత విముక్తి మార్గంగా భావించారు. అదే దారిని అనుసరించి, బాబాసాహెబ్ అంబేద్కర్ తన నవయాన బౌద్ధంను నిర్మించారు. ఈ ఆలోచనల స్రవంతి దళితుల ఆత్మగౌరవ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది.

అయోతీ థాస్ బుద్ధుని గురించి "లైట్ ఆఫ్ నైట్ అండ్ డే" అనే చిన్న పుస్తకాన్ని రచించారు. ఇటీవల, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ కూడా ఆయన ఆలోచనల వైశాల్యాన్ని గుర్తుచేస్తూ, "రాత్రి-పగలుల వెలుగు" అనే బిరుదుతో సత్కరించారు. అయోతీ థాస్ ఒక బహుముఖ ప్రజ్ఞాశాలి: సబాల్టన్ చరిత్రకారుడు, పత్రికా నిర్వాహకుడు, రచయిత, సంఘసంస్కర్త, రాజకీయ సంస్థల నిర్మాత, తమిళ భాషా పరిశోధకుడు, తాత్వికుడు, సామాజిక వివక్షపై అలుపెరగని పోరాటయోధుడు. ఈ మహనీయుడు 69 ఏళ్ల వయస్సులో, 1914 మే 5న కన్నుమూశారు (స్వప్న సామెల్, దక్షిణాన దళిత ఉద్యమం భారతదేశం 1857-1950, న్యూఢిల్లీ, 2004, పి.182). ఆయన మరణించినా, ఆయన వెలిగించిన చైతన్య జ్యోతి మాత్రం ఆరకుండా ముందుతరాలకూ మార్గదర్శి అవుతూనే ఉంది.

ఆధార గ్రంథాలు:

1. హార్ట్, జార్జ్ ఎల్.బీ హీఫెట్జ్, హాంక్ (2001). ది ఫోర్ హండ్రెడ్ సాంగ్స్ ఆఫ్ వార్ అండ్ విజ్డమ్: యాన్ ఆంథాలజీ ఆఫ్ పొయెమ్స్ ఫ్రమ్ క్లాసికల్ తమిళం, ది పురాణనూరు. న్యూయార్క్: కొలంబియా యూనివర్సిటీ ప్రెస్. p. 191.

2. గోఫ్, కాథ్లీన్ (2008) [1981]. ఆగ్నేయ భారతదేశంలో గ్రామీణ సమాజం. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రెస్. p.32.

3. ఫాంటైన్, పెట్రస్ ఫ్రాన్సిస్కస్ మరియా (1990). ది లైట్ అండ్ ది డార్క్: పురాతన ఇరాన్, ఇండియా మరియు చైనాలలో ద్వంద్వవాదం. బ్రిల్ అకడమిక్ పబ్. p.100.

4. అలోసియస్, జి (2006): నేషనలిజం విౌట్ ఏ నేషన్ భారతదేశంలో, ఢిల్లీ: ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్. p.58.

5. బసు, ఆర్ (2011): నందనార్ పిల్లలు: ది పరైయర్స్' ట్రస్ట్ విత్ డెస్టినీతో ప్రయత్నించండి, తమిళనాడు 1850-1956, p. 111 కొత్తఢిల్లీ: సేజ్ పబ్లికేషన్స్.

6. బాలసుబ్రహ్మణ్యం, J (2001): సూర్యోదయం నుండి సూర్యోదయం వరకు దళిత పత్రికలు, నాగర్‌కోయిల్: కాలక్రమం. p. 14.

7. మణి, పె.సు., 'పండిథర్ ఇయోతీ తస్సనార్', దినమణి, (తమిళ దినపత్రిక), 15 అక్టోబర్ 1989, p.23.

8. థియోసాఫిస్ట్ జర్నల్, ఏప్రిల్-జూన్ 1914, పేజి 315.

9. తంగవేలు, జి., తమిళ థీసియా ఉనర్విన్ మున్నోడి తమిళన్ ఇయోతీ థాస్సర్ పండితార్, p.8.

10. T. రవిచంద్ర, అంబేద్కర్ను ప్రభావితం చేసిన ఆంధ్రుడు, మిసిమి, నవంబర్. 1993. p. 25.

11. కుల అధ్యయనం- ప్రొఫెసర్. పి. లక్ష్మి నరసు, ఏషియన్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్, ఢిల్లీ 1988

12. తమిజాన్ వార పత్రిక, 14 అక్టోబర్, 1908.

పరిశోధక విద్యార్థి

ఎస్వీ యూనివర్సిటీ, తిరుపతి

పలుకుబళ్లు-జాతీయాలు-సామెతలు-ఊతపదాలు

డా. ఇమ్మిడి మహేందర్

మనుషులు సంఘజీవులు. తమ మనస్సులోని భావాలను తోటి వారితో పంచుకోవడానికి భాష అనే సాధనాన్ని సృష్టించుకున్నారు. భాష మనిషితో పాటే పుట్టింది, పెరిగింది, విస్తృతమైంది. మానవ పరిణామ క్రమంలో ఏర్పరచుకున్న సంస్కృతి, సంప్రదాయాలు, నమ్మకాలు, ఆచరణలు అన్ని క్రమంగా అభివృద్ధి చెందాయి. వీటి నేపథ్యంలో ఆయా భాషలకు ప్రత్యేకమైన పలుకుబళ్లు, జాతీయాలు, సామెతలు, ఊత పదాలు ఏర్పడ్డాయి. అవి నిత్య వ్యవహారంలో ప్రజల నాలుకలపై నర్తిస్తాయి. విషయాన్ని స్పష్టంగా, ఎదుటివారి హృదయానికి హత్తుకునేలా మాట్లాడటం ఒక కళ. భాషా వ్యవహర్తలు తమ మాతృభాషలో వీటిని అలవోకగా, ఎటువంటి కృత్రిమ ఆలోచనలు లేకుండా ఉపయోగిస్తారు.

పలుకుబళ్లు:

ప్రతీ భాషకు తనదైన భావ వినిమయ సంవిధానం ఉంటుంది. భావ వినిమయంలో మాట్లాడే తీరును లేదా భాష వ్యవహారంలో ఉన్న ప్రత్యేక వాడుకని సూచించే దానిని మనం 'పలుకుబడి' అని అంటాము. పలుకుబడులు అంటే ఒక భాషలో తరచుగా వాడుకలో ఉంటూ, ఆ భాషకు సహజత్వాన్ని ఇచ్చే పదబంధాలు లేదా మాటల కూర్పు అని నిర్వచించుకోవచ్చు.

భాషావాడుకలో ఉన్న ఏ పదబంధమైనా పలుకుబడిగా ఉండవచ్చు. వివరంగా చెప్పాలంటే పలుకుబడులలోనే జాతీయాలు, సామెతలు వచ్చి చేరుతాయి. అదే సమయంలో పలుకుబడులకు కొంత ప్రత్యేకత కూడా ఉంది. ఇది ఒక పదబంధంగా కూడా ఉంటుంది. దీనికి పదాల అర్థమే ఉండవచ్చు లేదా, కొంచెం భిన్నంగా ఉండవచ్చు. ఇవి వాక్యంలో ఒక భాగంగా కూడా ఉపయోగపడతాయి. ఉదాహరణకు గుక్కెడు నీళ్లు, తల తాకట్టు పెట్టైనా, కళ్లు నెత్తికెక్కడం, చీకు చింతా లేకుండా, మాట పడకపోవడం, మాట సహాయం, ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడు, పేరు నిలబెట్టడం, చెవిలో జోరీగ, పప్పులో కాలేయడం, కన్నీరు మున్నీరు కావడం, చేతులు ఎత్తేయడం, కడుపు కట్టుకోవడం, ఊరి మీద బతకడం, చేతులు కలపడం, బెల్లం కొట్టిన రాయి, నాలుక కరుచుకోవడం, తల నరుక్కోవడం, నొసటి రాత, ఒంట బట్టలేదు, బుద్ధి గడ్డి తినడం, తిలోదకాలు ఇవ్వడం, ఆశలపై నీళ్లు పోయడం, కాలికి బుద్ధి చెప్పడం, మన్ను తిన్న పాములా, మూతి ముడుకోవడం, తోక తొక్కిన తాచులా, తోక ముడవడం, చేతి చలువ, గుండె చెదరడం, గుండె బరువెక్కడం, గుండె నిబ్బరం, గుండెను రాయి చేసుకోవడం, నీళ్లు నమలడం, కంటి మీద కునుకు లేదు, అగ్గి మీద గుగ్గిలం, తలలో నాలుకలా, కత్తి మీద సాము, ఒక కంట కనిపెట్టడం, బావిలో కప్ప, ఇల్లు గుల్లయింది, ఒళ్లు హూనమయింది, తలదించుకోవడం, వెన్నుదన్ను, తలకు మించిన భారం, కొమ్ముగాయడం, తలుపులు మూసుకుపోవడం, ఊపిరి సలపనితనం, కాళ్ల బేరానికి రావడం, విషం కక్కడం, తల పండిపోవడం, నాలుక దులుపుకోవడం, రెండు పడవలపై ప్రయాణం, మంచం పట్టడం, బాల్చి తన్నడం, మట్టి కొట్టుకుపోవడం, ఉసురు తగలడం, పిల్లి నడక, కడుపులో పెట్టుకోవడం, ఒంటి నిండా కళ్లు, కండ్లల్లో ఒత్తులు వేసుకోవడం, తలభారం, తల పట్టుకోవడం వంటి ఎన్నో పలుకుబళ్లు తెలుగు భాషలో నిత్య వ్యవహారంలో ఉన్నాయి.

అంశం పలుకుబడులు (Idiomatic Expressions) **జాతీయాలు** (Idioms) **సామెతలు** (Proverbs)

నిర్వచనం: భాషావాడుకలో ఉన్న ఏ ప్రత్యేకమైన పదబంధమైనా కావచ్చు ఒక ప్రత్యేకమైన, స్థిరమైన అర్థాన్ని ఇచ్చే పదబంధం జీవిత సత్యాన్ని, అనుభవాన్ని చెప్పే పూర్తి వాక్యం

స్వరూపం ఒక పదబంధం

ఒక పదబంధం ఒక పూర్తి వాక్యం అర్థం పదాల అర్థమే ఉండవచ్చు. లేదా కొంచెం భిన్నంగా ఉండవచ్చు పదాల విడివిడి అర్థానికి భిన్నంగా, సమూలంగా ఒకే కొత్త అర్థాన్ని ఇస్తాయి. మానవ స్వభావం, జీవిత అనుభవాల గురించి ఒక సత్యాన్ని బోధిస్తుంది

ఉదాహరణ: గుక్కెడు నీళ్లు చేతికి ఎముక లేదు నదిలో పడ్డ చేపలా

2. జాతీయాలు:

ఏ భాషలోనైనా జాతీయాలు ఆ భాషకు ప్రత్యేకమైన సౌందర్యాన్ని తెచ్చిపెడతాయి. భావ వ్యక్తీకరణను నేరుగా హృదయాన్ని హత్తుకునేలా చేస్తాయి. వీటిల్లో ఆయా భాషల జీవన సంస్కృతి ప్రతిబింబిస్తుంది. ఈ జాతీయాలను అనువాదం చేయడం చాలా కష్టం. ఎందుకంటే ప్రతీ భాషకు తనదైన సంస్కృతి, సంప్రదాయాల పరంపర ఉంటుంది. వాటిల్లో మాత్రమే అవి పుడతాయి. అవి భాషలో ప్రత్యేక లక్షణంతో ప్రవర్ధిల్లుతుంటాయి.

జాతీయం అంటే ఒక జాతి భాషలో స్థిరపడిన ప్రత్యేకమైన పదబంధం. దీని అర్థం ఆ పదాలలోని అక్షరాల మీద ఆధారపడి ఉండదు. ఇవి భాషకు ప్రత్యేకతను, సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి. దీనిని భాషాశాస్త్ర పరిభాషలో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

భాషలో కొన్ని పదాలకు సహజమైన అర్థం ఉంటుంది. మరికొన్ని పదాలకు లక్షణార్థం ఉంటుంది. కొన్నింటికి వ్యంగ్యార్థం ఉంటుంది. కొన్ని వ్యస్త పదాలు కలిసిపోయి పదబంధాలుగా ఏర్పడతాయి. ఇలా ఏర్పడిన పదబంధాలలో కొన్నింటికి వాటికి సహజంగా ఉండే అర్థాన్ని కోల్పోయి, వాటి సమ్మేళనంగా ఉండే గుణం లేదా రూపం కారణంగా ఏర్పడే ప్రత్యేకార్థాన్ని సంతరింపజేసుకొని విశిష్ట రూపాలుగా ఏర్పడతాయి. వీటినే "జాతీయాలు" అంటాము.

నిర్వచనాలు:

ఒక జాతికి సంబంధించినవి అని జాతీయానికి అర్థం. ఒక భాషకు ఉండే ప్రత్యేకత, విశిష్టమైన పలుకుబడి అనే అర్థంలో మనం వాడుతున్నాము. జాతీయాలను విశిష్ట పదబంధాలు, నుడికారాలు, పలుకుబళ్లు అని కూడా పిలుస్తుంటారు.

1. విడివిడి మాటల కలయికచే ఆ పదాలకు విడిగా లేని ఒక భావాన్ని స్ఫురింపజేస్తాయి. ఇలా కొన్ని పదాల కలయిక ద్వారా సామూహిక అర్థాన్ని అందించే పదబంధాలను లేక పద సమూహాలను జాతీయం అనవచ్చు.

– ప్రొ. మూలె విజయలక్ష్మి (తెలుగు జాతీయాల కోశం అభిహారికం)

2. లక్షణార్థంలో ప్రత్యేకార్థం సంతరించుకున్న వ్యస్త రూప పదాలనూ జాతీయాలనవచ్చు.

3. ప్రకరణార్థమును తెలిపెడి ఒక తద్ధిత ప్రత్యయము (సూర్యరాయాంధ్ర నిఘంటువు)

చెప్పదలచుకున్న అభిప్రాయాన్ని ఇతరులకు స్పష్టంగా, నేరుగా అర్థం అయ్యేలా, హృదయానికి హత్తుకునేలా చెప్పడానికి అందరూ ప్రయత్నిస్తారు. ఆ ప్రయత్నంలో భాగంగానే జాతీయాలను నిత్య వ్యవహారంలో ఎక్కువగా వాడుతుంటారు. ఈ కింది వాటిని పరిశీలిద్దాం.

1. నేనంటే వానికి నచ్చదు.
2. నా పేరు వింటేనే వాడికి ఒళ్లంతా మంట.
3. నన్ను చూస్తే వాడు కండ్లల్లో కారం పోసుకుంటాడు.

పై మూడు వాక్యాలలోని మొదటి వాక్యంలో విషయాన్ని నేరుగా చెప్పడం జరిగింది. 'నచ్చదు' అనడం బాగానే ఉంది. ఆ నచ్చకపోవడం ఎంతవరకు? దాన్ని ఏమైనా కిలోల రూపంలోనో, లీటర్ల రూపంలోనో కొలిచి చెప్పగలమా? అంటే అది సాధ్యం కాదు. అందుకనే భాషా వ్యవహర్తలు విషయాన్ని వర్ణించి చెప్పడం ప్రారంభిస్తారు. అంటే నచ్చకపోవడాన్ని గురించి అతని మనసులో ఉన్న భావం, లేదా ఆ భావం గాఢతను ఎదుటి వారికి అర్థం చేయించడానికి కొన్నిసార్లు 'అస్సలు నచ్చదు', 'ఏ మాత్రం నచ్చదు' వంటి శబ్దాల సహాయం తీసుకుంటారు. ఈ పద్ధతే దాదాపు అన్ని భాషల్లోనూ ఉంటుంది.

ఇలా వర్ణనతో రాజీ పడకుండా ఇంకా విషయాన్ని లోతుగా చెప్పాల్సి వచ్చినప్పుడు అలంకార శైలిలో చెప్పవచ్చు. ఆ ప్రయత్నమే పై రెండో వాక్యంలో ఉంది. పేరు విన్నా, ప్రస్తావన వచ్చినా ''మండిపోతాడు లేదా భగ్గుమంటాడు'' అని వివరించవచ్చు. ఈ విధంగా భావ స్పష్టత కోసం అలంకార శైలిని వాడడం కూడా అన్ని భాషల్లో ఉంటుంది.

ఆ భావంలోని గాఢతలో ఎక్కువ, తక్కువలను హృదయానికి హత్తుకునేట్లు చెప్పడంలో ఇంకొక మార్గాన్ని కూడా అనుసరించవచ్చు. దాన్ని కూడా అలంకార శైలిలో భాగంగానే చూస్తారు. విషయ వర్ణనకు ఉపయోగపడేది అయినా దీనిలాంటిదే మరొక ఘటన లేదా ఉదాహరణ, తార్కాణం, ఉపమానము లాంటి వాటిని ఉపయోగించుకోవడం ద్వారా కూడా విషయాన్ని ఆలంకారికంగా చెప్పవచ్చు. దీని గురించి ఒక వాక్యంలో తేల్చివేయడం కష్టం. ఎక్కువ ఉదాహరణల ద్వారా మాత్రమే తెలుసుకోవాలి.

"కండ్లల్లో కారం పోసుకుంటాడు అంటే? నిజంగా కండ్లల్లో కారం తెచ్చి పోసుకుంటాడని అర్థం కాదు. కండ్లల్లో కారం పోసుకుంటే ఏ విధంగా ఉంటుందో, ఆ విధంగా నన్ను చూస్తే వాడు ఉంటాడని అభిప్రాయం. ఈ భావవ్యక్తీకరణ

బాగుంది. గాఢమైన భావాన్ని చెప్పేటందుకు పనికి వచ్చింది. ఇట్లాంటి సందర్భాలు వచ్చినప్పుడు అందరు దీన్ని ఉపయోగిస్తారు. ఇలా అందరూ ఉపయోగించిన తర్వాత క్రమక్రమంగా అది. నిఘంటువులలోకి చేరుతుంది.

కండ్లల్లో కారం పోసుకొను: అసూయపడడం అని అర్థం. (బాగా బతికితే, వాడు కండ్లల్లో కారం పోసుకుంటడు)

పై జాతీయంలో మూడు మాటలు ఉన్నాయి. కండ్లు, కారం, పోసుకోవడం వంటి పదాలు వేటికవిగా భిన్నార్థాన్ని కలిగి ఉన్నాయి. కానీ, అవన్నీ ఒక పదబంధంగా చూస్తున్నప్పుడు 'అసూయపడటం' అనే అర్థంలోకి మారిపోయాయి. ఈ భావాన్ని ఏ ఇతర భాషల్లోకి నేరుగా అనువాదం చేయలేము. ఇది తెలుగు జాతికి సంబంధించిన ప్రత్యేకమైన పదబంధం, జాతీయం. ఈ విధంగా ఒక భాషకు పరిమితమైన ప్రత్యేక పదబంధాలను మనం "జాతీయాలు" అని పిలుస్తాము.

జాతీయాలు ఏర్పడే విధానం:

జాతీయాలు ఆయా ప్రాంతాల సామాజికార్థిక, రాజకీయ, సాంస్కృతిక జీవన వైవిధ్యాన్ని ఆధారంగా చేసుకొని ఏర్పడతాయి. అంటే ఒకే రకమైన భౌగోళిక, సామాజిక ఇతివృత్తాన్ని కలిగి ఉండటం, కొంత మంది వ్యక్తుల ప్రత్యేక లక్షణాలను సూత్రీకరించడం ద్వారా గానీ ఇవి ఏర్పడతాయి. వీటిలో ఆయా భాషా సమాజాల జీవన సంస్కృతులు, ఆచారాలు, సంప్రదాయాలు వ్యక్తమవుతాయి. కాలం మారుతున్న కొద్ది ఈ నేపథ్యాలు మారితే, ఆ మారిన వాటి ఆధారంగా కొత్త జాతీయాలు ఏర్పడతాయి. ఉదాహరణకు వాస్తవాలతో సంబంధాలు లేకుండా కేవలం వాట్సఫ్‌లో ప్రచారం అయ్యే వాటినే నిజాలు అనుకునే సమూహాలను "వాట్సఫ్ యూనివర్సిటీ స్టూడెంట్స్" అని అంటుంటారు. వీటిని బట్టి అర్థమవుతుంది ఏమంటే జాతీయాలకు సమాజంతో ఎక్కువ సంబంధం ఉంటుంది. వీటికి వ్యాకరణ నియమాలు కానీ, తర్క సహితమైన నిబంధనలు కానీ ఉండవు. ఇప్పుడు కొన్ని జాతీయాలను పరిశీలిద్దాం.

1. శరీర అవయవాలను కేంద్రంగా చేసుకున్న జాతీయాలు:

1. వాడు తలలో నాలుక లాంటోడు.
2. వాని పొట్టు కొట్టిండ్రు.
3. నువ్వు లేకపోతే చెయ్యి విరిగినట్లుంది
4. కాలుకు బలపం కట్టుకొని తిరిగిండ్రు.
5. నెత్తీ నోరు కొట్టుకోని చెప్పడం.

2. పశువులు లేదా జంతువులను కేంద్రంగా చేసుకున్న జాతీయాలు:

1. దున్నపోతు మీద వానపడ్డట్టు
2. గోడ మీది పిల్లి
3. కుక్కతోక
4. కాకిగోల
5. గొర్రె తెలివి
6. నక్కజిత్తులు
7. ఊసరవెల్లి లెక్క
8. ఉడుం పట్టు

3. భౌగోళికతను కేంద్రంగా చేసుకున్న జాతీయాలు

1. కొంప కొల్లేరే
2. రామేశ్వరం బోయినా శనేశ్వరం బోలేదు.
3. వైకుంఠ యాత్ర
4. శ్రీరంగం నీతులు
5. తిరుపతి మంగలిపని

4. ఆచార వ్యవహారాలను కేంద్రంగా చేసుకున్న జాతీయాలు:

1. పప్పన్నం బెట్టడం
2. బొట్టు, కాటుక పెట్టి పిలుస్తరా
3. పెద్ద పీట వేయడం
4. మూలకు కూర్చో బెట్టడం
5. దింపుడు కళ్లం ఆశ

5. ప్రకృతిని కేంద్రంగా చేసుకున్న జాతీయాలు

1. వానాకాలం చదువు
2. చిలుక పలుకులు
3. మర్రి నీడ
4. మసిపూసి మారేడు కాయ చేయడం

6. చారిత్రకతను కేంద్రంగా చేసుకున్న జాతీయాలు

1. పరుగుల రాణి పీటీ ఉష
2. వెర్రి వెంగళప్ప
3. తురుంఖాన్
4. అపర చాణక్యుడు
5. దిగొచ్చాడు పెద్ద మోతుబరి

3. సామెతలు:

మనుషులు తమ నిరంతర సంభాషణల్లో చమత్కారంగా మాట్లాడేందుకు ప్రయత్నిస్తుంటారు. తమ భావాలను ఎదుటి వారికి అందజేయడానికి ఏర్పాటు చేసుకున్న వ్యవస్థ భాష అని ముందే చెప్పుకున్నాం. ఆ వ్యవస్థ కొన్ని వేల యేళ్ల నిరంతర ప్రయాణంలో అనేక అనుభవాలను ప్రోది చేసుకుంది. ఆ

అనుభవాల లోంచి సామెతలు పుట్టాయి. చెప్పదలచుకున్న విషయాన్ని నిశితంగా, సూటిగా, స్పష్టంగా వివిధ పోలికలతో వ్యక్తం చేయడానికి సామెతలు ఉపకరిస్తాయి.

సామెత అంటే పోలిక. తరతరాల అనుభవాలను ప్రోది చేసుకొని, వర్తమాన సంఘటనలతో వాటిని పోలుస్తూ సామెతలను ఉపయోగిస్తారు. సామెతలో సాదృశ్యం వల్ల, చెప్పే విషయానికి స్పష్టత వస్తుంది. మనస్సుకు హత్తుకునేట్లుగా మాట్లాడాలనే, లేదా రాయాలనుకునే వారు సామెతలను ఎక్కువగా ఉపయోగిస్తారు. సామెతలను జోడించి సంభాషణ జరిపితే అవి తప్పనిసరిగా మనస్సును హత్తుకుంటాయి. విషయం స్పష్టంగా అర్థమవుతుంది. సామెతకు తెలుగులో శాస్త్రం, సామ్యం, కత, లోకోక్తి, నానుడి, వంటి పేర్లు కన్పిస్తున్నాయి.

నిర్వచనం:

సామ్యం అంటే పోలిక అని అర్థం. సామ్యత నుండి సామెత అనే పదం పుట్టింది. "చెప్పాలనుకునే విషయాన్ని పూర్తిగా వివరించాల్సిన అవసరం లేకుండా ఒక్క వాక్యంలో తేల్చడానికి, వర్తమాన సంఘటన లేదా విషయాన్ని గత సంఘటనల తాలూకు అనుభవ జ్ఞానంతో వివరించడానికి ఉపయోగపడే మాటలనే సామెతలు" అంటారు.

సామెతలు – ప్రాచుర్యం:

ప్రతి భాషలో అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి అనేక పద్ధతులు ఉంటాయి. మౌలిక ప్రతిభ, కల్పనా శక్తి, అన్వేషణాసక్తి కలిగిన ప్రాచీన మానవులే సామెతలను సృష్టించి ఉంటారు. సామెతలు ఈ కాలానికి చెందినవి కావు. మనిషి వికాసంతో పాటే అవి సహ ప్రయాణం చేశాయి. సామెతల పుట్టుక ప్రధాన కారణం అనుభవం. ఈ అనుభవాత్మక అభివ్యక్తి రూపమే సామెతలుగా రూపొందాయి.

సామెతలు ఎప్పుడు పుట్టాయి అని ప్రశ్నించుకొని, దానికి సమాధానాన్ని రాబట్టలేము. దానికి ఒక కాల నిర్ణయాన్ని చేయడం సాధ్యం కాదు. కుటుంబం, ఆచారాలు, సంప్రదాయాలు, చారిత్రక సంఘటనలు, ప్రజల నమ్మకాలు, పండుగలు, జానపద కథలు, ప్రాదేశిక ప్రత్యేకతల్లోంచి సామెతలు పుట్టుకొస్తాయి.

సామెతల లక్షణాలు:

సామెతలు సంక్షిప్తంగా ఉంటాయి. సామెతల్లో విషయం సూటిగా, స్పష్టంగా ఉంటుంది. సామెతలు ఎక్కువగా

అంశం	పలుకుబడులు (Idiomatic Expressions)	(జాతీయాలు)Idioms
నిర్వచనం	భాషావాడుకలో ఉన్న ఏ ప్రత్యేకమైన పదబంధమైనా కావచ్చు	ఒక ప్రత్యేకమైన, స్థిరమైన అర్థాన్ని ఇచ్చే పదబంధం
స్వరూపం	ఒక పదబంధం	ఒక పదబంధం
అర్థం	పదాల అర్థమే ఉండవచ్చు లేదా కొంచెం భిన్నంగా ఉండవచ్చు	పదాల విడివిడి అర్థానికి భిన్నంగా, సమూహంగా ఒక కొత్త అర్థాన్ని ఇస్తాయి.
ఉదాహరణ	గుక్కెడు నీళ్లు	చేతికి ఎముక లేదు

ఆలంకారికంగా ఉంటాయి. అల్పాక్షరాలలో అనల్పార్థ రచనగా భావించవచ్చు. సాధారణంగా సామెతల్లో ఒక వాక్యం గానీ, ఒకే పరిణామం కలిగిన రెండు వాక్యాలు గానీ ఉంటాయి. సామెతల్లో ప్రాస, అనుప్రాసలతో కూడిన లయాత్మక గుణం ఉంటుంది. తద్వారా వాటిని సులభంగా గుర్తించుకోవడం, ఉపయోగించడానికి సులువుగా ఉంటుంది. వీటిల్లో ఏదో ఒకదానికి సంబంధించిన లక్షణం తప్పనిసరిగా సామెతల్లో ఉండాలి.

1. సంక్షిప్తంగా ఉండాలి.
2. విస్తృత ప్రచారంలో ఉండాలి.
3. విషయాన్ని ప్రతిభావంతంగా వ్యక్తం చేయగలగాలి.
4. ప్రయోజనకరమైన ఆలోచనను రేకెత్తించగలగాలి.
5. నిరంతర సామాజిక వినియోగం నలిగిన మాటలై ఉండాలి.
6. మనస్సును హత్తుకునేలా, దృష్టాంతంగా చెప్పగలగాలి.
7. అలంకార చమత్కృతి ఉండాలి.
8. లోక జ్ఞానానికి, జాతి అనుభవానికి తోడ్పడే విధంగా ఉండాలి.
9. యతి, అనుప్రాసలు కలిగి ఉండాలి.

నీతిని చెప్పే సామెతలు:

మానవ సమూహమంతా ఒక వ్యవస్థలో నిర్మాణం అయింది. సమాజంలో ధర్మం, న్యాయం అన్ని వేళలా సక్రమంగా ఉండాలంటే ప్రజల మధ్య కొన్ని భావాలను వ్యాప్తి చేయాల్సి ఉంటుంది. అలాంటి భావాలలో ఒకటి పరుల సొమ్ముకి సంబంధించింది. పరుల సొమ్ము అనేక విధాలుగా దోచుకోవడం అనేది కనబడుతుంది. దొంగతనం, దోపిడి, హత్యలు ద్వారా ఆ సొమ్మును పొందుతున్నారు. అది దుర్మార్గమైన పద్ధతుల ద్వారా జరుగుతుంది. దీన్ని న్యాయ సమ్మతం కాదు అని చెప్పే సామెత "పరుల సొమ్ము – పాపిష్టి సొమ్ము" అనేది. అలాగే నష్టపోయినా పర్లేదు కానీ, ఎదుటి వారి బుద్ధి తెలిసింది

అని అనుకునేలా, పాజిటివ్ కోణంలో ఆలోచించాలని సూచించేది "కుండ పోతే పోయింది కానీ, కుక్క బుద్ధి తెలిసినట్టు" అనేది. అలాగే ఎదుటి వారికి అన్యాయం చేయాలని చూస్తే మనమే అన్యాయం అవుతామని సూచించే సామెత "చెరపకురా – చెడేవు" అనే సామెత, అలాగే మనిషికి కలిగిన సకల దారిద్ర్యాలు, సంపద లేమి వంటివి ఏవి అయినా, కృషి చేయడం ద్వారా పోతాయని సూచించేది "కృషితో నాస్తి దుర్భిక్షం" అనే సామెత. వీటితో పాటు అనేక సామెతలు నీతిని బోధించే క్రమంలో భాగంగా ఏర్పడ్డ సామెతలు.

అనుభవం ఆధారంగా చెప్పే సామెతలు

మనిషికి కాలక్రమంగా వచ్చే జ్ఞానాలలో అనుభవ జ్ఞానం చాలా ప్రధానమైంది. అదే అన్ని ప్రవర్తనలకు కారణంగా నిలుస్తుంది. ఏదైనా తప్పు చేసినా, చేసే పనిలో మన చర్యల వల్ల ఎలాంటి మార్పు ఉండదు అని గ్రహించినా చాలామంది మౌనంగా ఉండిపోతారు. అలా మౌనంగా ఉండిపోవడం ద్వారా దాన్ని వ్యతిరేకించడం లేదని నిరూపణ అవుతుంది. అంటే వ్యతిరేకించడం లేదంటే ఏదో ఓ కోశాన అంగీకరిస్తున్నట్టేననే భావాన్ని సూచించేది "మౌనం అర్ధాంగీకార సూచికం" అనే సామెత. అలాగే ఎటువంటి కష్టమైన పనులైనా కృషి చేయడం, సాధన చేయడం ద్వారా సాధిస్తాము. కనుక నిరంతర సాధనే పనులను సాధించడానికి నేపథ్యం అవుతుందని సూచించేది "సాధనమున పనులు సమకూరు" అనే సామెత. అలాగే కొందరు పనులు చేయడంలో అలసత్వం, మాట వరసకు పనులు చేస్తుంటారు. ఆ పనిని చిత్తశుద్ధితో చేయరు. అటువంటి విషయాన్ని సూచించేది "చిత్తశుద్ధి లేని శివ పూజల లేల" అనే సామెత. శరీర శుద్ధి లేని శివ పూజలు అయినా ఫలిస్తాయి. కానీ, చిత్తశుద్ధి లేని పూజలు చేసినా, ఫలితం ఉండదని సూచించడం ఇందులో ప్రధానాంశం. అలాగే ఒక పని మీద మనస్సును లగ్నం చేసి, మరొక పనితో జతకూడుతారు. మనస్సులో ఒక భావన, చేతల్లో ఒక పని. ఈ రెండు పొత్తు కుదరదు. కనుక ఏదో ఒక దానిని చేపట్టాలని సూచించే "చిత్తం శివుని మీద, భక్తి చెప్పుల మీద" అనే సామెత.

కుటుంబం ఆధారంగా చెప్పే సామెతలు

సమాజంలో కుటుంబం ప్రధానమైన యూనిట్. కుటుంబ సభ్యుల మధ్య అనేక బంధాలు, బంధాలే బంధనాలు అయిన సందర్భాలు అనేకం ఉంటాయి. అలాంటి వాటి నేపథ్యంగా కూడా చాలా సామెతలు వచ్చాయి. ఎవరికైనా సొంత సంతానమే కడవరకు నిలుస్తుంది అని చెప్పేది "అక్క బిడ్డ అక్కరకు రాదు, చెల్లె బిడ్డ చేతికి రాదు" అనే సామెత. ఈ సామెత ఎక్కువగా ఆడపిల్లలు లేని కుటుంబాలలో ఎక్కువగా ప్రాచుర్యంలో ఉంటుంది. భారతీయ సమాజంలో ఇంటి ఆడపిల్లకు చాలా ప్రాధాన్యం ఉంటుంది. కేవలం మగ పిల్లలే ఉన్న కుటుంబాలలో సంప్రదాయ కార్యక్రమాలకు అక్క, చెల్లెలి పిల్లలని పిలుచుకుంటారు. కొన్ని సందర్భాలలో వారు అందుబాటులో లేదా దూరమయినప్పుడు ఈ సామెతను ఎక్కువగా ఉపయోగిస్తారు. సొంత బిడ్డ అయితే ఎన్ని పనులు ఉన్నా, ఎన్ని విభేదాలు వచ్చినా కలిసిపోతుందనే అర్థంలో ఉపయోగిస్తారు. అలాగే అత్తకు కోడలు ఎన్నటికి కూతురు కాదు, కోడలు కోడలే, బిడ్డ బిడ్డే అనే అర్థంలో బంధాలను సూచించేది "కోటి వరాలు ఇచ్చినా కోడలు బిడ్డ గాదు, అరవై వరాలు ఇచ్చినా అల్లుడు కొడుకు కాదు" అనే సామెత. పుట్టుకతో ఏర్పడే బంధాలే కలకాలం ఉంటాయని, ఒక బంధుత్వం మరొక బంధుత్వంలోకి మారదని అంటారు. అలాగే నిరంతరం ఇంటిలో ఉండేదానికి విలువ ఉండదు అనేది ఒక నిర్ధారణ. దగ్గర ఉంటే ఒక రకంగా, దూరంగా ఉంటే ఒక రకంగా బంధాలు ఉంటాయి. ఇంట్లో ఉన్న కోడి అయినా, పప్పుతో సమానం అని చెప్తూ, మాంసం అనే విలువ కూడా కోడి కోల్పోయినట్లు, బంధాలను సూచించేది "ఇంటి కోడి పప్పుతో సమానం" అనే సామెత. అలాగే తండ్రి బాధ్యతలు మోస్తే, తల్లి సమస్తాన్ని మోస్తుందని అంటారు. పిల్లల ఆలనా, పాలన విషయంలో తండ్రి కన్నా, తల్లి నయం. కడుపుల కన్నందుకు కంటికి రెప్పోలే సాదుకుంటుందని అంటుంటారు. ఈ భావనను సూచించేది "ఏనుగంత తండ్రి కన్నా, ఏకుల గుల్లంతా తల్లి నయం" అనే సామెత. అలాగే ఇంటి రుచికి, పక్కింటి రుచికి తేడా ఉంటుందని సూచించేది. బంధాల విషయంలో ఇంటి కన్నా, బయటి విషయాలకు, బయటి బంధాలకు విలువ ఇస్తున్నప్పుడు సూచించేది "పొరుగింటి పుల్ల కూర రుచి" అనే సామెత.

ఇతర సామెతలు:

1. అందని ద్రాక్ష పుల్లన
2. ఆడబోయిన తీర్థం ఎదురయినట్లు
3. ఉట్టికి ఎగరలేనమ్మ మొగులందుకుంట అందట
4. ఏమి లేని ఇస్తరాకే ఎగిరెగిరి పడతది, అన్ని ఉన్న ఇస్తరాకు అణగిమణగి ఉంటది
5. ఇల్లు ఇగురెక్కుతది, పందిరి పచ్చబడుతది
6. ఇల్లలుకంగనే పండుగ కాదు
7. ముందుంది ముసుర్ల పండగ

8. ఎంకి పెళ్లి సుబ్బి సావు కుచ్చింది
9. ఉరుమి ఉరిమి మంగళం మీద పడ్డట్లు
10. చేతులు కాలినంక ఆకులు పట్టుకొని ఏం లాభం
11. గుమ్మిల వడ్లు గుమ్మిలనే ఉండాలే, గుట్టాలోలిగ బిడ్డలుండాలి
12. అంగట్లో అవ్వ అంటే ఎవ్వనికి పుట్టినవు బిడ్డ అందట
13. కాలి కంచాలకు సప్పుడు ఎక్కువ
14. పొమ్మన లేక పొగ బెట్టినట్లు
15. ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదు
16. ఆరుద్ర కురిస్తే ఆరు కార్తెలు కురుస్తాయి.
17. చల్ల కోసం వచ్చి మంత దాచడం ఎందుకు
18. అందితే జుట్టు, అందక పోతే కాళ్లు
19. దుక్కుంటే దిక్కుంటుందట
20. నీళ్లు లేని ఊరు, నారి లేని ఇల్లు ఒకటే
21. అమ్మబోతే అడవి కొనబోతే కొరివి
22. వెండి బేరమాడుతూ, బంగారం కొసరడిగినట్టు
23. కాకి పిల్ల కాకికి ముద్దు
24. సముద్రంలో ఆవగింజ
25. గోళెమంత గుమ్మడికాయ, ఈలపీటేకు లోకువ
26. కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతది
27. కన్నతల్లికి కంచంలో అన్నం పెట్టనోడు, చినతల్లికి చీరబెట్తన్నాడట వంటి అనేక సామెతలు జన జీవనంలో భాగంగా ఉన్నాయి.

4. ఊత పదాలు

మనుషులమైన మనం అన్ని వేళల ఒకే విధంగా వ్యవహరించం. ఎవరి వ్యవహార శైలి వారికి ఉంటుంది. భాష విషయంలో కూడా వ్యక్తిగత చేష్టలు, ఉపయోగించే పదాలు వంటివి కొన్ని సార్లు ఇతరుల కన్నా వ్యక్తులను ప్రత్యేకంగా చూసే విధానానికి భూమిక అవుతాయి. అలాంటి వాటిల్లో ఊత పదాలు ఒకటి. ఊత పదాలు అంటే మాట్లాడేటప్పుడు ఎక్కువగా ఉపయోగించే, లేదా అలవాటుగా, అప్రయత్నంగా ఉపయోగించే పదాలు. ఈ పదాలు వాక్యం అర్థాన్ని మార్చకపోయినా, సంభాషణకు ఒక లయను ఇస్తాయి.

"భాషా వ్యవహారంలో ప్రధాన అర్థాన్ని అందించకుండా, మాట్లాడేటప్పుడు ఆసరాగా లేదా విరామానికి ఉపయోగించే పదాలు లేదా చిన్న పదబంధాలను ఊతపదాలు" అంటారు. వీటిని ఆంగ్లంలో Fillers, Discourse Markers" అని కూడా అంటారు.

మాట్లాడే వ్యక్తి తదుపరి వాక్యం గురించి ఆలోచించడానికి సమయం తీసుకుంటున్నప్పుడు, లేదా

సంభాషణలో కొనసాగింపును చూపడానికి, లేదా ఒక ఆలోచన నుండి మరొక ఆలోచనకు మారుతున్నప్పుడు వీటిని ఉపయోగిస్తారు.

ఉదాహరణకు: "అంటే," "మరి," "ఇది," "అది," "బాగా" వంటి పదాలు తరచుగా ఊత పదాలుగా ఉపయోగించబడతాయి.

ఊత పదాలను ఎందుకు ఉపయోగిస్తారు?

ఊత పదాలను ఉపయోగించడానికి ముఖ్య కారణాలు:

1. ఆలోచించడానికి సమయం: మాట్లాడే వ్యక్తి ఏమి చెప్పాలో త్వరగా నిర్ణయించుకోనప్పుడు, మాట మధ్యలో నిశ్శబ్దం రాకుండా ఉండేందుకు ఈ పదాలను ఉపయోగిస్తారు.
2. సంభాషణ నిరంతరాయంగా సాగడం: ఊత పదాలు సంభాషణను ఆపకుండా, నిరంతరాయంగా (smoothly) సాగేలా చేస్తాయి.
3. భావ సందర్భాన్ని కలుపడం (Discourse Marking): ఒక ఆలోచనను ముగించి, మరొక కొత్త ఆలోచనను ప్రారంభించడానికి ఇవి సహాయపడతాయి. (ఉదా: "సరే, ఇప్పుడు...").
4. అలవాటు/శైలి: కొందరికి ఇవి కేవలం మాట్లాడే అలవాటులో భాగమైపోతాయి.

ఒకే పదాన్ని, పదాలను వ్యక్తి తన సంభాషణల్లో పదే పదే ఉపయోగిస్తుంటే ఆ పదాలను ఆ వ్యక్తి వాడే ఊత పదం లేదా ఊత పదాలు అని అంటారు. సంభాషణల్లోని ఊత పదాలను గమనిస్తే సంభాషణ ప్రారంభానికి ముందూ, లేదా ఆ తర్వాత, ఎక్కువ సార్లు మధ్య మధ్యలో ఊత పదాలు అప్రయత్నంగా వస్తుంటాయి.

సంభాషణలకు ముందు వచ్చే ఊత పదాలను గమనిస్తే "నీకీ విషయం తెలుసా, ఒక మాట చెప్పనా, మరేంటంటే, వంటి పదాలు ఎక్కువగా ఉపయోగిస్తారు. అలాగే సంభాషణల మధ్యలో వచ్చే ఊత పదాలను గమనిస్తే "అదన్న మాట, నిజంగా, పుణ్యం ఉంటుంది, నిజమా కాదా, చాలాచాలా, బహుశా, ఆ విధంగా ముందుకు పోతా ఉన్నాం" వంటి పదాలను ఎక్కువగా ఉపయోగిస్తారు. అలాగే సంభాషణ తర్వాత ఉపయోగించే ఊత పదాలను గమనిస్తే "అర్థమైందా, తెలిసిందా" వంటి పదాలను ఉపయోగిస్తారు. అలాగే శ్రోత ఆకళింపు చేసుకున్న విషయాన్ని వ్యక్తం చేసేటప్పుడు వాడే పదాలను చూసినట్లయితే "అవునా, నిజమా, అలాగా, బలే బలే, బాగు బాగు" వంటి పదాలను ఉపయోగిస్తారు. అలాగే శ్రోత సమాధానం చెప్పేటప్పుడు ఉపయోగించే పదాలను గమనిస్తే "కాదా మరి, అవును కదా మరి, సో (SO)" వంటి ఎన్నో పదాలు నిరంతర సంభాషణలో వింటుంటాం. అలాగే సినిమాల్లోని కొన్ని పాత్రలకు కూడా ఊత పదాలను కల్పించారు. "అయితే ఓకే, అంత సీన్ లేదు, సరే అలానే కానీయ్" లాంటి పదాలు ఊత పదాలుగా నిలిచాయి.

రచయిత: సహాయ ఆచార్యులు(PT), ఓయు

సాహిత్య విమర్శ

తెలంగాణ పరిశోధనకు విలువైన చేర్పు

శ్రీరంగరాజు కేశవరావు సాహిత్యం-పరిశీలన

డా. చంద్రయ్య శివన్న

తెలుగు పరిశోధనారంగంలో తెలంగాణ పరిశోధకుల కృషిని సమీక్షించుకుంటోన్న కాలం ఇది. తెలంగాణవారు చేసిన సాహిత్యసేవపై జరిగిన పరిశోధనల్ని మూల్యాంకనం చేసుకుంటోన్న సందర్భము కూడా. ఆచార్య వెలుదండ నిత్యానందరావు కూర్చిన 'విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన' గ్రంథసూచీలోని 'విశిష్ట వ్యక్తి పరంపర' అనే పన్నెండో శీర్షికలో పేర్కొన్న 31మందిలో తెలంగాణనుంచి ఒక్క సినారె మీదనే విస్తృతస్థాయిలో పరిశోధన జరిగినట్టు తెలుస్తోంది. తెలంగాణకు సంబంధించిన వ్యక్తులమీద అక్కడక్కడ కొన్ని పరిశోధనలు మాత్రమే జరిగాయి. ఆ వరుసలో జరిగిన పరిశోధనే లింగంపల్లి రామచంద్ర చేసిన 'శ్రీరంగరాజు కేశవరావు సాహిత్యం పరిశీలన'. ఈ పరిశోధనకుగానూ ఆయన 1992లో కాకతీయ విశ్వవిద్యాలయంనుంచి డాక్టరేట్ పట్టాను పొందారు. ప్రొఫెసర్ హరిశివకుమార్ పర్యవేక్షకులుగా వ్యవహరించిన ఈ పరిశోధన, 'వ్యక్తుల సాహిత్య కృషి'పై జరిగిన పరిశోధనల పరంపరలో ఎన్నదగింది. దీన్ని 'శ్రీరంగరాజు కేశవరావు సాహిత్యం పరిశీలన'అనే పేరుతో1994లో పుస్తకంగానూ ముద్రించారు.

విశిష్టమైన వ్యక్తిపై జరిగిన విశిష్టమైన పరిశోధన 'శ్రీరంగరాజు కేశవరావు సాహిత్యం పరిశీలన' గ్రంథం. శ్రీరంగరాజును విశిష్టమైన వ్యక్తి అనడానికి కారణాలు లేకపోలేదు. శ్రీరంగరాజు కేశవరావు ఒక జమీందారు. లింగంపల్లి రామచంద్ర ప్రకారం, శ్రీరంగరాజు 1835-1840 మధ్యకాలంలో జన్మించాడు. ఆనాటి తెలంగాణ-భూస్వామ్య సమాజంగా ఉండింది. జమీందారులు రైతుల్ని, వివిధ రకాలుగా పీల్చిపిప్పిచేసారు. రైతులందరూ 'బారా కొత్వాల్', 'చిల్లరదేవుళ్ల' సంస్కృతిలో మగ్గిపోతున్న కాలం అది. అటువంటికాలంలో జమీందారీ కుటుంబంలో పుట్టిన శ్రీరంగరాజు కేశవరావు సాహిత్య సృజన చేయడం విశిష్టమైన విషయంగానే పరిగణించాల్సి ఉంటుంది. కళాతృష్ణ ఉంటే తప్ప ఇది సాధ్యంకాదు. శ్రీరంగరాజు కేశవరావు, ఆ కాలంనాటి భూస్వామ్య సంస్కృతి కోరుకున్నట్టుగా ప్రబంధాలు రాసాడు. యక్షగానాన్ని సృజించాడు. లఘుకృతులు పుట్టుకొస్తున్న ఆ కాలంనాటి సాహిత్య సంప్రదాయాల్ని ప్రతిఫలిస్తూ రచనలు చేసాడు. జమీందారు అయ్యుండీ, రచనల్ని చేయడం అరుదు. తెలుగు సాహిత్యంలో మనకు రాజకవులున్నారు. తెలంగాణలో జమీందారులు సాహిత్యాన్ని పోషించారేకానీ ప్రత్యక్షంగా సృజన చేసారో లేదో పరిశీలించాల్సి ఉంది. (ఈ పరిశీలన ప్రస్తుత వ్యాసాంశం కాదు). ఈ కోణంలోంచి ఆలోచించినప్పుడు శ్రీరంగరాజు కేశవరావు విశిష్టమైన వ్యక్తి మాత్రమే కాదు విభిన్నమైన వ్యక్తి కూడా. ఆచార్య టి. నవనీతరావు, 'సాహిత్యం-శాస్త్రం-కళారంగం' అనే మూడు నదుల త్రివేణీ సంగమం శ్రీ రంగరాజు కేశవరావు' అని కొనియాడారు.

శ్రీరంగరాజు, ఖిలాషాహాపురం అనే గ్రామంలో జమీందారు కుటుంబంలో పుట్టిన సాహితీవేత్త. ఈయన గురించి మొట్టమొదటగా సాహితీలోకానికి పరిచయం చేసిన సురవరం ప్రతాపరెడ్డి, "అరబ్బీ, ఫార్సీ, ఉర్దూ, సంస్కృతము, తెనుగు వీటిలో అనమాన పండితులు. ఫార్సీ కవిత్వముచే నవాబు యక్బాలుద్దౌలాను మెప్పించి 'కవి శిరోమణి'యను బిరుదమందినారు'' అని పేర్కొన్నారు. అంతేకాకుండా శ్రీ రంగరాజు జన్మస్థలం, జన్మదినం, రచనా విశేషాల్ని పేర్కొన్నారు. తర్వాతకాలంలో ఆచార్య పేర్వారం జగన్నాథం, శ్రీరంగరాజు చేసిన సాహిత్య కృషి విశేషాల్ని మరింత విస్తృతపరిచారని లింగంపల్లి రామచంద్ర తన పూర్వ పరిశోధనల సమీక్షలో క్రోడీకరించారు. శ్రీ రంగరాజు, పుట్టిన సంవత్సరాన్ని గురించి విస్తృతంగా చర్చించి, ఆయన 1835-1840 మధ్యకాలంలో జన్మించాడని నిర్ధారించారు.

లింగంపల్లి రామచంద్ర, తన పరిశోధన కృషిని తొమ్మిది అధ్యాయాలుగా వింగడించుకున్నారు.

అవి:

1. 19వ, శతాబ్దం సాంస్కృతిక పునరుజ్జీవనం

2. రంగరాజు కేశవరావు జీవితం-వ్యక్తిత్వం

3. ఇంద్రద్యుమ్నీయం-ప్రబంధం

4. విక్రమాదిత్యం-అసంపూర్ణ ప్రబంధం

5. హనుమద్విజయం-యక్షగానం

6. అధ్యాత్మ రామాయణం-కీర్తనలు

7. లఘుకృతులు

8. ఉపసంహారం

9. అనుబంధం.

మొదటి అధ్యాయంలో ఆధునికకాలంలో జరిగిన సాంఘిక సంస్కరణలు, సాహిత్య తీరుతెన్నుల్ని పరామర్శించారు. ముఖ్యంగా 19వ, శతాబ్దంనాటి సాహిత్యంపై ఉన్న వివిధ అభిప్రాయాల్ని ఉటంకిస్తూ, "ఏ యుగమునకాయుగములో మంచిచెడ్డలు రెండును చేరియుండును. స్వర్ణయుగమని చెప్పుకొను కృష్ణదేవరాయల కాలములోనూ రఘునాథరాయల కాలములోనూ వెలువడిన సాహిత్యమునందు సైతము అధమరకము కావ్యములు లేకపోలేదు. అంధయుగమని చెప్పిన అర్వాచీన కాలమునందు అత్యుత్తమ కావ్యములుండకపోలేదు. అది మనము పరిశీలించు విధానమునుబట్టి మన దృక్పథమునకు వీలుగా మారుచుండును" అని చెప్పిన యండమూరు సత్యనారాయణ అభిప్రాయంతో ఏకీభవిస్తారు లింగంపల్లి రామచంద్ర. ఇలాంటి సమ్యక్ దృక్పథంతోనే ఆయన తన పరిశోధనంతా కొనసాగించాడు. ఈ అధ్యాయంలో తెలంగాణ చరిత్ర-సాహిత్యాన్ని పరామర్శిస్తూ, బ్రిటిషాంధ్ర, నిజామాంధ్ర ప్రాంతాల్లోని సామాజిక, సాంస్కృతిక వ్యవస్థల్లోని తేడాల్ని విశదపరిచారు. శ్రీరంగరాజు జన్మస్థలమైన ఖిలాషాహపురం, అందులోని కోట వైభవం, ఆ గ్రామంలోని వీరుడైన సర్వాయిపాపన్న, బీబీ నాంచారి కథలు ప్రస్తావించబడ్డాయి.

'శ్రీరంగరాజు కేశవరావు జీవితం-వ్యక్తిత్వం' గురించి రెండో అధ్యాయంలో విస్తృతంగా చర్చించారు. ఆయనపై వచ్చిన పూర్వ పరిశీలనల్ని, పరిశోధనల్ని కూలంకషంగా సమీక్షించి, తన పరిశోధనకు సరిపడా నేపథ్యాన్ని సమకూర్చుకున్నారు. "కేశవరావుగారు భక్తకవి, సంస్కృతాంధ్రాలలో గొప్ప పండితుడు. ఉరుదూ, ఫారసీ, అరబీ భాషాసాహిత్యాల స్వరూప స్వభావాలను అవగాహనకు తెచ్చుకున్న ప్రఖ్యాతకవి. సంగీతశాస్త్రంలో నిపుణుడు. జ్యోతిషశాస్త్రంలో ఉన్న ఆంతర్యాన్ని గమనాన్ని దర్శించిన మేధాజీవి. ఖగోళశాస్త్రాన్ని అధ్యయనం చేసిన సునిశిత ప్రజ్ఞాశీలి. ఉదార హృదయుడు. భాగవతోత్తముడు బహుముఖ ప్రజ్ఞాశాలి. సాహితీమూర్తి. రావుగారిలో ఉన్న ఈ మేలిమి గుణాలన్నీ ఆయన కావ్యాలలో కూడా కన్పిస్తుంటాయి" అంటూ శ్రీరంగరాజు సాహిత్య, శాస్త్ర మూర్తిమత్వాన్ని వివరించారు. ఆయన రచనావ్యాసంగాన్ని, ఆ క్రమాన్నంతటినీ స్థూలంగా పరిచయం చేసాడు. శ్రీరంగరాజు రాతప్రతుల్ని పరిశీలించిన బిరుదురాజు రామరాజు భారతిలో, డా. కోవెల సంపత్కుమారాచార్య జనధర్మ పత్రికలో వ్యాసాలు రాసారు. తర్వాత పేర్వారం జగన్నాథం 'ప్రగతిపథంలో జనగామ'వంటి విశేష సంచికల్లో శ్రీరంగరాజు కావ్యవిశేషాల్ని చర్చించారు. శ్రీరంగరాజు రాసిన 'ఇంద్రద్యుమ్నీయం' ప్రబంధానికి పేర్వారం జగన్నాథం రాసిన విస్తృతమైన పీఠికతో 1968లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ గ్రంథాన్ని ముద్రించింది. బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి తన సాహిత్య చరిత్రలో శ్రీరంగరాజు కావ్య మాధుర్యాన్ని చర్చించారు. ఇట్లా శ్రీరంగరాజుపై తనకంటే పూర్వం జరిగిన కృషిని సాకల్యంగా ప్రస్తావించి పరిశోధకుడిగా తన నిజాయితీని ప్రదర్శించాడు లింగంపల్లి రామచంద్ర. ఒక అంశంపై పరిశోధనకు ఉద్యుక్తులవడానికంటే ముందు, సదరు అంశంపై జరిగిన పూర్వపరిశోధనల్ని, పరిశీలనల్ని విస్తృతంగా అధ్యయనం చేయడం అనే సుగుణం లింగంపల్లి రామచంద్రనుంచి అందిపుచ్చుకోవాల్సిన మేలిమి గుణం.

శ్రీరంగరాజు కేశవరావుకు పేరుప్రఖ్యాతుల్ని సంపాదించి పెట్టిన ప్రబంధం-ఇంద్రద్యుమ్నీయం. లింగంపల్లి రామచంద్ర, ఈ ప్రబంధానికి అత్యంత ఎక్కువ ప్రాధాన్యమిచ్చాడని ఆయన రాసిన పుటల సంఖ్య తెలియజేస్తోంది. దీన్ని పరిశోధకుడు 'నాలుగు కాలాలు నిలిచే కావ్యం'గా కొనియాడాడు. ఈ కథకు సంబంధించిన మాతృక గురించి విస్తృతంగా చర్చించాడు. 'ఇంద్రద్యుమ్నుడు' అనే పేరును ప్రస్తావించిన ప్రతి పూర్వగ్రంథ విశేషాల్ని ప్రస్తావించారీ గ్రంథంలో. విష్ణుపురాణంలో, మహాభారతంలో, కూర్మపురాణంలో, బ్రహ్మపురాణంలో ఇంద్రద్యుమ్నుని వృత్తాంతాలున్నా వాటికీ, ప్రస్తుత ఇంద్రద్యుమ్నీయం ప్రబంధానికి ఎటువంటి సంబంధంలేదని తేల్చిన విషయం ఎంతో ప్రశంసనీయం. శ్రీమద్భాగవతంలోని గజేంద్రమోక్షం ఘటాన్ని ఆధారంచేసుకొని శ్రీరంగరాజు ఈ

ప్రబంధాన్ని రసవత్కావ్యంగా తీర్చిదిద్దాడని నిర్ధారించాడు. ఇది రామచంద్రగారి విస్తృత అధ్యయన ఫలితం. ఫలితాల్ని నిగ్గుతేల్చడంలో ఏ పరిశోధకుడికైనా ఉండాల్సిన సూక్ష్మేక్షణ దృష్టి. కథౌచిత్యం, రూప చిత్రణం, వర్ణన కథాకథనానికి పరిపోషకాలుగా నిల్చిన విషయాల్ని రామచంద్ర సోదాహరణంగా విశ్లేషించాడు. ఈ క్రమంలో తన విశ్లేషణకు ఉపయోగపడే పద్యాల్ని ఎంపిక చేసుకోవడంలో ఎంతో నైపుణ్యాన్ని పాటించాడనిపిస్తోంది. అందుకే ఎక్కడా అన్వయంలో అసంబద్ధతకానీ, క్లిష్టతకానీ, కాఠిన్యతకానీ అనిపించదు. ప్రాచీన కావ్యపరిశోధనలో పాటించాల్సిన పద్ధతులివే. శ్రీరంగరాజు సంస్కృతాన్ని బాగా ఆకళింపుచేసుకున్న కవిపండితుడిగా తెలుగు పద్యాల్ని తీర్చిదిద్దిన తీరును రమణీయంగా విశ్లేషించారు డా. లింగంపల్లి రామచంద్ర. స్త్రీ, సైన్య, ఉదయాస్తమ, నక్షత్ర, లక్ష్మీదేవి, మలయానిల, నగర, నాయకాది వర్ణనల్ని సాధికారికంగా చేసిన విశ్లేషణ, వాడిన పరిభాష రామచంద్రలోని భావుకపరిశోధకుడిని గుర్తుచేస్తుంది. ఆలంకారిక విశేషాలు, రసం, అనుకరణలు, పాత్ర పోషణ, ఛందస్సు, భాష మొదలైన కావ్యశాస్త్రాది విశేషాల్ని కవి శ్రీరంగరాజు పోషించిన విధానాన్ని విడువకుండా పరామర్శించాడు. ఇట్లాగే 'విక్రమాదిత్యం–అసంపూర్ణ ప్రబంధం' అనే నాల్గో అధ్యాయంలోనూ చేసిన అనుశీలన ప్రతిభావంతంగా ఉంటుంది.

ప్రారంభంలో చెప్పినట్టు, 19వ, శతాబ్దపు సాహిత్య సంప్రదాయమైన యక్షగాన రచన విశేషాల్ని ఐదో అధ్యాయంలో అనుశీలించారు లింగంపల్లి రామచంద్ర. యక్షగానం, చతుర్విధ కళాఖండం. సంగీత, సాహిత్య, నృత్య, రూపక కళల సంపుటి ఈ యక్షగానం. ఇది తర్వాతికాలంలో నాటకానికి దారుల్ని పరిచింది. సాహిత్యం ప్రక్రియ, దృశ్యరూపకళతోపాటూ ప్రదర్శితమవడం యక్షగానం ప్రత్యేకత. ఇది పండితులను, పామరులను కూడా ఆకర్షించగల కళారూపం. ఇరవయ్యేళ్ల క్రితంవరకూ తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో 'బైలాట' పేరుతో ప్రదర్శితమవుతూ సజీవంగా ఉండేది. యక్షగానం అలసిపోయిన జనసామాన్యానికి ఒక వినోద క్రీడ. దేశీయ పద్ధతుల్లో, ఛందోరీతులతో ప్రజల్ని సమ్మోహితుల్ని చేయగల శక్తి యక్షగాన సొంతం. ఈ ప్రక్రియ పండితులనూ, రాజకవులనూ ఆకర్షించగలిగింది. జమిందారీ, పండిత కవీ అయిన శ్రీరంగరాజు కూడా ఈ యక్షగాన రచనకు దూరంగా ఉండలేకపోయాడు. ఆయన 'హనుమద్విజయం' అనే యక్షగానాన్ని రాసాడు. దీని సమగ్ర అనుశీలన లింగంపల్లి రామచంద్ర చేసిన పరిశోధన గ్రంథంలో కనిపిస్తుంది. ఈయన, యక్షగాన ప్రక్రియకు సంబంధించిన పూర్వ వృంతాతాల్ని క్రమానుగతంగా ప్రస్తావించారు. ప్రౌఢ ప్రబంధ ప్రక్రియల్ని సృజించిన శ్రీరంగరాజు అత్యంత సరళమైన పద్ధతిలో దీన్ని రచించాడని ఈ పరిశోధకుని వ్యాఖ్య.

శ్రీరంగరాజు రాసిన 'హనుమద్విజయం' రసవాహిని వలె సాగిందని చెబుతూనే అక్కడక్కడ దొర్లిన కొన్ని అనౌచిత్యాలను పేర్కొనడం లింగంపల్లి రామచంద్ర నిశితదృష్టికి నిదర్శనం. హనుమచేత చేయించిన కాశీ మాత దూషణ తీవ్రస్థాయిలో ఉందంటాడు. జగన్మాత, లోకేశ్వరి, ఆమె శంభురాణి అయిన కాళికాదేవిని "కడుపుగాలి, పాడుముండ, దవడ వండ్లు గిండ్లురాలవా"–అని తిట్టించడం ఉచితంగా లేదంటాడు.

మరో సందర్భంలో ఏకపత్నీవ్రతుడైన శ్రీరామునికీ మైరావణుని సోదరి మాతంగినితో పెండ్లి జరిపించడం ఉదాత్తంగా లేదంటాడు. "బహుశ రావుగారు మారుతిచేత దుర్గను దూషింపజేయడం, శ్రీరామునికి మాతంగినితో కల్యాణం జరిపించడం పామర జనాన్ని ఆనందింపజేయాలనే ఉద్దేశ్యంతో రచించి ఉంటారని మాత్రమే భావింపవచ్చుని" తనకుతాను సముదాయించుకుంటాడు.

రామచంద్ర, 'హనుమద్విజయం' నామౌచిత్యాన్ని అనుశీలిస్తూ, ఇదే ఇతివృత్తంతో బూచుపల్లె కొండయ్య, పురాణం పిచ్చయ్య, నల్లబిల్లి బసివిరెడ్డి, కొల్తూరి పురుషోత్తమ కవి మొదలైన కవులు రాసిన 'మైరావణ చరిత్ర' యక్షగానాల్ని ప్రస్తావించాడు. 'హనుమద్విజయం'లో 'మైరావణుడు' ప్రతినాయకుడు. అది అంత ప్రాధాన్యం ఉన్న పాత్రకూడా కాదని చెబుతూ దానికి 'మైరావణ చరిత్ర' అని పెట్టిన నామం ఔచిత్యంగా లేదని దాన్ని పూర్వపక్షంచేస్తూ, శ్రీరంగరాజు పెట్టిన నామాన్నే సమర్థించాడు. మైరావణుడు అసురజాతికి చెందినవాడు. కాబట్టి అది అశుభాన్ని సూచిస్తుంది అనే నమ్మకం లింగంపల్లి రామచంద్రకున్నట్టు దీనిద్వారా తెలుస్తోంది. రావణాసురాది చక్రవర్తులను శూద్రులుగా ముద్రవేసి చంపారని చెబుతోన్న వర్తమాన సిద్ధాంతానికి రామచంద్ర ఆలోచన భిన్నంగా ఉందనిపిస్తోంది. లభించిన రెండు ప్రతుల్లోనూ

ఉన్న దస్తూరి శ్రీరంగారావుది కాదని చెబుతూ 'హనుమద్విజయం' రచన కూడా శ్రీరంగారావుది కాదన్న అభిప్రాయాన్ని పూర్వపక్షంచేస్తూ అనేక ఉపపత్తులను చూపిస్తూ, అది శ్రీరంగారావు రచనే అని నిర్ధారించాడు. అందుకు సమర్థనగా పేర్వారం జగన్నాథం, డా. హరికిషన్, భాష్యం కృష్ణమాచార్యులు, నెల్లుట్ల కేశవరావు మొదలైన పరిశోధకులు చేసిన వాదనల్ని ప్రస్తావించాడు. ఇది రామచంద్ర వాదపటిమను నిరూపించే ఒకానొక సందర్భం.

వాల్మీకి కృత సంస్కృత రామాయణం జగత్ప్రసిద్ధం. దాన్ని అనుసరించి తెలుగులో ఎన్నో రామాయణాలు వివిధ ప్రక్రియల్లో వెలువడ్డాయి. అధ్యాత్మ రామాయణం కూడా వివిధ ప్రక్రియల్లో తెలుగులోకి అనువాదం అయింది. కీర్తనల రూపంలో వెలువడిన అధ్యాత్మ రామాయణం ప్రజలు పాడుకోవడానికి అనుకూలంగా ఉండడంతో మునిపల్లె సుబ్రహ్మణ్య కవి రాసిన అధ్యాత్మ రామాయణ కీర్తనలు బహుళ ప్రచారాన్ని పొందాయి. తూము నరసింహదాసు, వరద రామదాసు, పరాంకుశదాసు, ప్రయాగ రంగశర్మవంటి కవులు అధ్యాత్మ రామాయణాన్ని కీర్తనలరూపంలో తెలుగు చేసారు. ఆ క్రమంలో శ్రీరంగరాజు కూడా 70 కీర్తనలుగా అధ్యాత్మ రామాయణాన్ని తెలుగులోకి అనువదించాడు. 'రామచంద్ర అధ్యాత్మ రామాయణం–కీర్తనలు' అనే ఆరో అధ్యాయంలో శ్రీరంగరాజు సంక్షేపించిన విధానాన్ని గణాంకాలతో సహా వివరించాడు. బాల(8 కీర్తనలు), అయోధ్య(8 కీర్తనలు), ఆరణ్య(14 కీర్తనలు), కిష్కింద(7 కీర్తనలు), సుందర(7 కీర్తనలు), యుద్ధకాండ(26 కీర్తనలు)లు అని పేర్కొన్నాడు.

''అహల్యా శాపవిమోచన ఘట్టం వాల్మీకీయ అధ్యాత్మలలో వేరు వేరుగా ఉంది. శ్రీమద్రామాయణంలో గౌతముడు ఇంద్రుని విఫలుడవు కమ్మని, ఆహల్యను వేయి సంవత్సరాలు వాయుభక్షణం చేస్తూ భస్మశాయిగా భూతజాలానికి కన్పింపకుండా ఉండుమని శపించాడు. ఆధ్యాత్మంలో "యోనిలంపట దుష్టాత్మన్ సహస్ర భగవాన్ భవ" అని దేవేంద్రుని, ఒక శిలను ఆశ్రయించి తపింపుమని గౌతమసతిని శపించి వేయిసంవత్సరాలు గడచిన పిదవ తదాశ్రయశిలను రాముడు పాదంతో స్పృశిస్తాడు. అప్పుడు శాపవిమోచనం కలుగుతుందని తెలిపాడు. ఈ ఘట్టం ఆధ్యాత్మాన్ని అనుసరించి విస్తృత ప్రచారం పొందింది. మూలంలో ఉన్న ఈ సన్నివేశాన్ని శ్రీరంగరాజు

శాపహతిని కఠిన శిలారూపమున గుందు తాపసి

చాపల హరిణేక్షణ సతిపాపమునెడ బాపీ

తాపసి యగు గౌతమమునిచే పూజితుడై–(అధ్యా.బా.కా. కీర్తన–5) అని మాత్రమే రచించి గౌతముని శాపోక్తులను పూర్తిగా విడిచి పెట్టారు" అని వివరించాడు. ఇది శ్రీరంగరాజు సంక్షిప్తంగా చేసిన అధ్యాత్మ రామాయణాన్ని సంక్షేపించిన పద్ధతులను సాకల్యంగా విశ్లేషించిన విధానానికి నిదర్శనం.

శ్రీరంగరాజు అధ్యాత్మ రామాయణాన్ని కీర్తనల్లో రచించడంతో ఆగక, నిత్యజీవితంలో ప్రజలు పాడుకోవడానికి వీలుగా ఇంకా అనేక రామ సంబంధి కృతుల్ని, కృష్ణ సంబంధి కృతుల్ని, శ్రీవెంకటేశ్వర సంబంధి కృతుల్ని రాసాడని తన పరిశోధన గ్రంథంలోని ఏడో అధ్యాయంలో లింగంపల్లి రామచంద్ర వివరించాడు. ఉపసంహారంలో, రామచంద్ర పరిశోధన ఫలితాల్ని పొందుపరిచారు. అనుబంధంలో శ్రీరంగరాజు స్వదస్తూరి, ఆయన వేసిన శ్రీరామచంద్రుల రేఖాచిత్రం, ఖిలాషాహపురం కోటముఖద్వారం, కోటలోని మధ్యబురుజుల రేఖాచిత్రాల్ని పొందుపరిచారు.

ముగింపు

పరిశోధకుడిగా లింగంపల్లి రామచంద్ర, తాను ఎంచుకున్న అంశానికి మూలకంగా పనిచేసిన అనేక రచనల్ని ఆమూలాగ్రం అధ్యయనం చేసిన దాఖలాలు ఈ పరిశోధన గ్రంథంనిండా మనకు కనబడతాయి. ఇది ఆయన విశ్లేషణకు ఎంతగానో దోహదపడిందని ఏ అధ్యాయాన్ని పరిశీలించినా ఇట్టే తెలిసిపోతుంది. ఈ విస్తృతాధ్యయనం, ఆయన చెబుతున్న విషయానికి సమర్థతనూ, విశ్లేషణాసామర్థ్యాన్ని అందించిందని చెప్పవచ్చు. ఈ పరిశోధన గ్రంథం సిద్ధాంత అన్వయంలో అసంబద్ధతకానీ, క్లిష్టతకానీ, కాఠిన్యతకానీ మనకు ఇసుమంతైనా అనిపించకపోవడం ఆయన రచనాశైలి, దృక్పథ పటిమ ప్రత్యేకత. ప్రాచీన కావ్యపరిశోధనలో పాటించాల్సిన పద్ధతులకు ఉదాహరణగా ఈ పరిశోధన నిలుస్తుందనేది నిర్వివాదాంశం. ఇట్లా దీన్ని తెలంగాణ పరిశోధనకు ఒక విలువైన చేర్పుగా భావించవచ్చు. కొత్త పరిశోధకులను అటువైపుగా ప్రోత్సహిస్తుంది.

రచయిత: అసిస్టెంట్ ప్రొఫెసర్
తెలుగుశాఖ, నిజాం కళాశాల

సాహిత్యం/
కథ

మబ్బులమాటున జాబిలమ్మ

చింతాడ సుశీల

హాల్లో నుండి వచ్చిన కేకలతో ఉలిక్కిపడి ఒక్క ఉదుటున నిద్ర లేచిన సాహిత్యకు, "ఇది పానకమా? చక్కెర పాకమా? ఇలాగేనా కాఫీ తగలెట్టేది? ఇన్నేళ్లలోఒక్క రోజైనా కాఫీ సరిగ్గా కలిపి ఇచ్చావా?"అంటూ అమ్మను ఊదరగొడుతూ చీవాట్లు పెడుతున్న నాన్న అరుపులు వినిపించాయి. ఓహ్... దీనికేనా పొద్దున లేస్తూనే ఈ రాద్ధాంతం ఏంటో నాన్న ఏ క్షణాన ఎలా ఉంటారో తెలియదు. పాపం అమ్మను చూస్తే జాలేస్తుంటుంది. నాన్నగారు లేని సమయాలలో ఎన్నోసార్లు ఈ విషయం కదిపి "నీకు బాధగా ఉండదా అమ్మ..? నాన్న గారి మీద నీకు కోపం రాదా?"అని అడిగేది సాహిత్య.

'మీ నాన్నగారు ప్రముఖ రచయిత. ఒక మంచి కథ రాయాలంటే దానికి ఎంత ఊహాశక్తి కావాలి. ఆయా పాత్రల భావాలను అక్షరాలుగా ఏర్చి, పేర్చి పదాలను వాక్యాలుగా చేసి ముత్యాలసరాలుగా కూర్చాలి. దీనికి ఎంతో ఆలోచన, పట్టుదల, దీక్ష, అవసరం. దానితో ఒత్తిడికి గురై ఏదో కోపగించుకుంటారు. దానికే బాధపడితే ఎలాగా? ఆలుమగల బంధంలో ఇవన్నీ మామూలే. అందరి ఇళ్లలోను ఇలాంటి చిన్న చిన్న తగాదాలు ఉండనే ఉంటాయి. అందుకే అన్నారు మన పెద్దలు ఇంటింటికీ ఒక మట్టి పొయ్యి అని'..... తల్లి మాటలకు అడ్డుపడుతూ 'అది పాతకాలం నాటి సామెత. ఇప్పుడు ఈ ఆధునిక యుగంలో గ్యాస్ స్టవ్లు, ఇండక్షన్ స్టవ్లు, ఎలక్ట్రానిక్ స్టవ్లు...తప్పించి మట్టి పొయ్యిలెక్కడున్నాయి?' తెలిగ్గా నవ్వుతూ అంది సాహిత్య.

"మీ నాన్నగారు పని చేసే కాలేజీలో వాళ్ళ కోలీగ్ నీకు మంచి సంబంధం చూసారంట.నీలాగే ఆ అబ్బాయి కూడా సాఫ్ట్వేర్ ఇంజనీరేనంట. ఆ సంబంధం ఖాయం అయి పెళ్లి జరిగితే నీవు కూడా ఇల్లాలిగా ఓర్పు, సహనం అన్నీ అలవర్చుకుంటావు" అని ఆత్మీయంగా అంది సృజన. "ఆహా... నేనైతే చచ్చినా ముక్కూ, ముఖం తెలియని జీవిని పెళ్లి చేసుకోను. నాకు తెలిసిన, నన్నర్థం చేసుకున్నవాన్నే పెళ్లి చేసుకుంటాను. ముఖ్యంగా నాన్నలాంటి దుర్వాసున్ని అసలు చేసుకోను"సాహిత్య అంది స్థిరంగా.

'మా కాలేజ్లో ప్రాక్టికల్స్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ రోజు కాస్త ముందుగా వెళ్ళాలి. నిన్ను మీ కంపెనీ దగ్గర డ్రాప్ చేసి నేను అటునుండటే కాలేజికి వెళతాను. నీవు తొందరగా రెడీ కామ్మా'..ఆజ్ఞ జారీ చేసి తన సెల్ఫోన్ కనిపించకవేవటంతో ఇంట్లో సామానంతా చిందర వందర చేస్తూ వెతుకుతున్నారు రాజారాం గారు.అసలే కాలేజీకి త్వరగా వెళ్ళాలి అంటున్నారు. "నేను వెదకి పెడతాను, ఈలోగా మీరు టిఫిన్ తినండి. టైం అవుతుంది..."అంటూ ప్లేటు అందించింది సృజన. ప్లేటు గిరాటేసి "నువ్వే ఇంట్లో ఖాళీగా ఉంటావు తీరుబడిగా కూర్చుని తిను." అంటూ భార్య వంక తీవ్రంగా చూపు విసిరి, "సాహిత్యా! రామ్మా వెళదాం" అంటూ విసురుగా బయటకు వచ్చి కారులో కూర్చున్నారు రాజారాం గారు.సాహిత్యఆఫీసుకు వెళుతుందే, గాని ధ్యాసంతా అమ్మ పైనే ఉంది. ఇంతలో కారు డాష్ బోర్డులో నుండి సెల్ రింగ్ అయిన శబ్దం వినిపించటంతో..సాహిత్య ఆ ఫోన్ బయటకు తీసి, రాజారామ్ కు ఇచ్చింది. "సెల్ ఇక్కడ మరిచిపోయి ఇల్లంతా వెదికితే దొరుకుతుందా? ముఖాన ఎప్పుడూ చెదరని చిరునవ్వుతో ముగ్ధ మనోహరంగా ఉండి మనం ఏ టైంలో ఏమి కావాలన్నా వెంటనే అమర్చి, ఆప్యాయతానురాగాలు పంచిన అమ్మను ఏది ఒక సాకుతో, చీటికీ మాటికీ కటువైన మాటలతో తూలనాడుతుంటారు. మీ క్రూరత్వం నా చిన్ననాటి నుండి చూసి, చూసి విసిగిపోయాను నాన్న. ఇకనైనా మీ పద్ధతిని మార్చుకోండి" అంటూ తన తండ్రి వైపు నిరసనగా చూసి తను జాబ్ చేసే సంస్థ దగ్గర దిగిపోయింది.

కూతురు అన్న మాటలకు రాజారాం గారు ఒక్క క్షణం విస్మయం చెందినా ఆమె మాటలు అతనికి సబబుగానే అనిపించాయి. "నేనేమి చేయను? కొలిమిలో నిప్పురవ్వలు రాజుకున్నట్లు గత జ్ఞాపకాలు ఎన్నేళ్లైనా గుండె లోతుపొరల్లో అతుక్కుపోయి ఉన్నాయి. ఆ గాయం తగ్గాలంటే ఏదో మార్పు జరగాలి..."అనుకుంటూ కూతురు వెళ్ళిన వైపు దృష్టి సారించారు. ఈ లోగా, ఒక అబ్బాయి ఎవరో నవ్వుతూ, సాహిత్యకు ఎదురొచ్చి,ఆమె చేయి పట్టుకుని ఏవో కబుర్లు చెప్తున్నాడు. ఎవరీ అబ్బాయి! ఇది వరకు సాహిత్యతో కలిసి ఉండటం చాలా సార్లు చూసాను. అమెతోటి ఉద్యోగి అయివుండొచ్చు. కాని, వాళ్ళ చనువు చూస్తుంటే ఇదేదో ప్రేమ వ్యవహారంలా ఉంది.

ఏదైనా వీళ్ళపై నిఘావేసి ఉంచాలి." అనుకుంటూ కాలేజ్ వైపు కారు పోనిచ్చాడు రాజారాం.

మరునాడు సాహిత్యను ఆఫీస్ వరకు డ్రాప్ చేస్తూ, ఏదో మాట్లాడాలని ప్రయత్నించారు రాజారాం గారు. తండ్రికి అవకాశం ఇవ్వకుండా ముఖం పక్కకు తిప్పుకుంటూ కారు దిగి విసవిసా నడిచి వెళ్లిపోయింది సాహిత్య. ఆఫీస్ లో అంకిత్ సీట్ ఖాళీగా ఉండటం చూసిన సాహిత్య, "ఇంకా రాలేదేంటి? లీవ్ పెట్టాడా? లీవ్ పెడితే నాకు ముందుగానే చెప్తాడే?"ఇలా అనుకుంటూ ఉండగానే ఆయాస పడుతూ వచ్చాడు అంకిత్. "ఏంటి అంత కంగారుపడుతున్నావు?" అడిగింది అతణ్ణి సాహిత్య. "నేను చెప్పేది వింటే నీవు కూడా కంగారు పడతావు, మీ డాడీ నా ఫ్రెండ్ ఒకడిని కలిసి, మన వివరాలన్నీ అడిగారంట!" వాడు నాకేమీ తెలియదంటే... "మీరందరూ సహోద్యోగులువివరాలు తెలియకుండా ఉండవని గద్దించే సరికి మనం ప్రేమించుకున్నామని, పెళ్లి కూడా చేసుకోవాలని అనుకుంటున్నామని చెప్పేశాడంట. ఈమధ్య కాలంలో పరువు హత్యలనీ, కులవివక్ష హత్యలనీ జరగడం టివీలలో, పేపర్లలోచూస్తున్నాం కదా. ఎందుకైనా మంచిది. మీరు కొన్నాళ్లపాటు ఎక్కడికైనా దూరంగా వెళ్ళి, జాగ్రత్తగా ఉండండి' అని నా ఫ్రెండ్ చెప్పాడు.

"అది విన్నప్పటినుండి నాకు భయంగా ఉంది..." అంటూ పెద్దగా నిట్టూర్పు విడిచాడు అంకిత్... "నాకూ భయంగానే ఉంది. మా నాన్న నైజం తెలిసిన దాన్ని. భార్యను ప్రేమగా చూడలేని వ్యక్తి కూతురు ప్రేమను ఏమర్థం చేసుకుంటారు. మనల్ని బలి తీసుకెళ్ళడానికైనా వెనుకాడరు".. సాహిత్య స్వరంలో సన్నని వణుకు. సరే ముందు మనం ఇక్కడ నుండి బయటకు వెళదాం అనుకుంటూ సంస్థ ఆవరణలోకి వచ్చారు, ఇద్దరు.

ఎటూ, ఏదీ అర్థం కాని పరిస్థితిలో రోడ్అవతలివైపు వీళ్ళ చూపులు నిలిచిపోయాయి. అక్కడ రాజారాం గారు కారు డోర్ తీసి నలుగురు అపరిచితులతో మాట్లాడుతున్నారు. "ఇక సందేహమే లేదు. మనమీద దాడి చేయడానికే వచ్చినట్లున్నారు. ముందుగా మనల్ని మనం రక్షించుకోవాలి. వెంటనే పోలీసులకు ఫోన్చేసి, ఈ ఏరియాకు రమ్మనమని చెప్పు" చెమటలు పట్టిన మొహాన్ని తుడుచుకుంటూ అంది సాహిత్య. ఎలా? ఏమి చేయాలి? అనే సందిగ్ధావస్థలో ఉండగానే, అక్కడ అపరిచితులు, వాగ్వాదంతో ఘర్షణకు దిగి, రాజారాం భుజంపై కత్తితో పొడిచి పారిపోతున్నారు. ఈ అనుహ్యమైన ఘటనను నిశ్చేష్టులై చూస్తున్న సాహిత్య, అంకిత్ లు, ఒక్క అంగలో, రాజారాం గారి దగ్గరకు చేరుకొని, అప్పటికే గుమిగూడిన జనాన్ని పక్కకి నెట్టూతూ, అదే కారులో హుటాహుటిన ఆప్పత్రికి తరలించారు.అక్కడ ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి అయ్యాక, రాజారాంను, ఆపరేషన్ థియేటర్కి తీసుకు వెళుతున్నారని, రాజారాం గారి డ్రస్, కంటి అద్దాలు, సెల్, వాచ్ ఇవన్నీ సాహిత్యకు ఇచ్చింది నర్స్. షర్ట్ జేబులో ఏదోకవర్ కనిపించటంతో, అందులోని పేపర్ తీసి చదవసాగింది ఆత్రుతగా.

"అమ్మా సాహిత్యా..... నేను కాలేజీలో పీజీ చదివిన రోజులవి. మా అమ్మానాన్న వ్యవసాయ కూలీలు. నా చదువు వాళ్ల తలకుమించిన భారం. అయినప్పటికీ కష్టపడి నన్ను చదివించారు. కొన్ని సార్లు కాలేజీ ఫీజ్ కట్టడానికి గడువు దగ్గర పడుతున్నా సకాలంలో డబ్బు పంపించలేకపోయేవారు. అలాంటప్పుడు నా క్లాస్మేట్ సుధ,నా ఫీజ్ కట్టి, నా ఆందోళన తీర్చేది. అప్పట్లో నాకు చిన్న చిన్న కవితలు, కథలు రాయడం పట్ల ఆసక్తిగా ఉండేది. రాసినవి ఒక డైరీ బుక్ లో భద్రపరుచుకునేవాడిని. వాటినిసుధ చూసి,"నీ సృజనతో రాసినవి నలుగురూ చదవాలి గాని ఇలా మరుగున పడనీయకుడద"ని, పత్రికలకు పోస్ట్ చేసేది. అవి వివిధ పత్రికలలో ప్రచురితం అయినప్పుడు, తన ఫ్రెండ్స్ కు చూపించి సంబరపడేది. "నీవు మంచి కథలు రాసి పెద్ద రచయిత అవుతావని నాకనిపిస్తుంది". అని నాచే కథలు వ్రాయడానికి ప్రేరేపించేది.

అలా నాకు చేరువ కావటంతో, నేను ఆమెతో సన్నిహితంగా మెలిగేవాడిని. సెలవుల్లో, అప్పుడప్పుడు నేను కథలు వ్రాస్తుంటే, తను కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చేది. ఆమెలోని ఉన్నతమైన, ఉదాత్తమైన భావాలకు మగ్గుడినయి, 'నిన్ను పెళ్ళి.చేసుకోవాలనుకుంటున్నాను'అని చెప్పాను. అప్పుడామె కళ్ళల్లో కోటి కాంతులు విరబూసాయి. కానీ, అంతలోనే ముఖం కిందకు దించుకుని "నా ఈ అవిటితనం చూసి జాలిపడి ఈ నిర్ణయం తీసుకున్నావా?" అని అడిగింది. "లేదు నీ వ్యక్తిత్వం నచ్చి ఈ మాట చెప్పాను", అన్నాను.

'నా వైకల్యాన్నిజాలి చూపులతో కొందరుచూస్తే, మరికొందరు ఈసడింపుగా ఛీత్కారంతో చూసేవారు. మీరు సహృదయంతో నన్ను పెళ్లి చేసుకుంటానంటున్నారు. ఇది నాకు కలలా అనిపిస్తూంది' అంటూ కన్నీళ్లు పెట్టుకుంది. 'విధి వంచనతో ఏర్పడిన వైకల్యాన్ని ఆత్మస్థైర్యంతో ఎదుర్కొని విద్యావంతురాలుగా నిలిచిన నీ మనోధైర్యానికి మెచ్చి నిన్ను పెళ్లి చేసుకోవాలనుకున్నాను' అంటూ ఆమెను ఓదార్చాను.'ఇప్పటి యువత స్వాతంత్ర్యం, సమానత్వం, ప్రేమ,

ఆదర్శాలు, ఆశయాలు ఉన్న కథలు చదివి సమాజంలో మార్పును తీసుకువస్తారనే ఉద్దేశంతో నీవలాంటి కథలు రాస్తుంటావు. దానికి నాంది నీవే కావాలని నన్ను చేసుకోదలుచుకుంటున్నావా?' అని అమాయకంగా ప్రశ్నిస్తున్నసుధతో, 'అలాగే అనుకో నిన్ను చేసుకోవటం నా ఆశయం. ఆశ కూడాను'నిశ్చితత్వం నిండిన మనసుతో దృఢంగా చెప్పాను.

పీజీ చివరి సంవత్సరం పరీక్షలు రాసి ఊరు వచ్చాను. ఇంట్లో అందరూ ముభావంగా, ఉదాసీనతతో ఉన్నారు. ఎందుకిలా ఉన్నారు ఏం జరిగింది అని నిలదీసి అడిగితే చెప్పారు మా నాన్న….'నీ చెల్లెల్ని సూసుకోవడానికి ఈ మధ్యన పెళ్లి సంబంధం వచ్చింది. మేము సంతోషించాము కానీ ఆ సంతోసం ఎంతోసేపు నిలవలేదు. ఆవచ్చిన కుర్రాడు నీ చెల్లెలు ఇంతకుముందే ప్రేమించుకున్నారట. అది ఆడితో కాలు జారిందట. దానికిప్పుడు మూడో నెల గర్భమట. ఈ సంగతి ఆ కుర్రాడి తల్లి మాకు చెప్పి, ఆడికి ఒక అక్క ఉంది…దానికి ముందు పెళ్లి చేయకుండా, చిన్నోడైన దాని తమ్ముడికి ఎట్టాగ పెళ్లి చేస్తాము. మీ అబ్బాయి, ఆడి అక్కని పెళ్లి చేసుకుంటే, మీ పిల్లని మేము కోడలిగా చేసుకునేందుకు లగ్గాలు పెడతామని కరాకండిగా చెప్పి వెళ్లినారు. నీ పరీక్షలప్పుడు ఇవన్నీ చెప్పి నీ మైండు కరాబు చెయ్యడమేలని, నీకు చెప్పలేదు. ఈ ఊర్లో మన పరువు పోకముందే నీ చెల్లికి పెళ్లి చెయ్యాలనుంది. ఈ పెళ్లి జరక్కపోతే,అది ఏ అగాయిత్యం సేసుకుంతదో, ఏటో…అని ఏ పనికి ఎళ్లకుండా, దానికి కాపలా కాత్తున్నాము. ఈ ఇపత్తు నుండి ఎలగ గట్టెక్కిత్తావో నీదే భారం….." ఇంక నాన్న నోట్లోనుంచి మాటలు రానట్లు నా వైపు దీనంగా చూస్తుండిపోయారు.

ఈ విపత్కర పరిస్థితిని ఎలాఎదుర్కోవాలి. నాన్న చెప్పిన సంబంధాన్ని నేను చేసుకోనంటే….పరువుకి ప్రాణమిచ్చే నాన్న ప్రాణం తీసుకుంటే … నాన్న అన్నట్లు చెల్లి ఏ అఘాయిత్యనికైనా పాల్పడితే…ఏ ఆర్థిక వెసులుబాటు లేని తండ్రికి, ఇప్పటివరకు ఏ ఆసరా ఇవ్వకుండా ఇన్నాళ్ళు చదువుతోనే గడిపాను. "ఉద్యోగం తెచ్చుకొని కుటుంబాన్ని ఎప్పుడాదుకుంటావ"నీ ఏనాడు నన్నడగలేదు. అలాంటి నాన్నకు ఏమిచ్చి ఋణంతీర్చుకోగలను. అందుకే, అప్పటివరకూ, నా అర్ధాంగిగా, సుధను నా గుండెల్లో గుడి కట్టుకున్న నేను, మనసు చంపుకొని, ఆ గుడిని కూల్చుకోవటానికి సిద్ధపడి, మీ అమ్మ మెడలో తాళి కట్టాను.

నా వివాహం అయిన కొద్దిరోజులకు, నా స్నేహితుడు నాకొక టెలిగ్రామ్ పంపాడు, "సుధ చనిపోయింద"ని. అది చూసిన నాకు షాక్ తో, శరీరమంతా కంపించినట్లు అయ్యింది. వివరాలు తెలుసుకునేందుకు వెంటనే సుధ వాళ్ళ ఊరెల్లాను. హార్ట్ ఎటాక్ తో చనిపోయిందని చెప్పారు. సుధ మరణం నన్నుఎంతగానో కృంగదీసింది. సుధను పెళ్లి చేసుకొని ఉండి వుంటే, ఇలా జరిగి ఉండేది కాదేమోనన్న భావన, నన్ను వెంటాడి వేధించేది. దివ్యాంగురాలైన సుధను వివాహం చేసుకొని తోడుగా ఉండాలనే నా ఆదర్శాన్ని సమాధి చేసి సృజనను చేసుకున్నాననే అపరాధభావంతో, మీ అమ్మను చీటికి మాటికి విసుక్కునే వాడిని. కానీ, నీవనుకున్నట్లు కసాయివాడిని కానమ్మా. ఇవన్నీ నీతో చెప్పి, నా మనసులోని భారాన్ని దింపుకోవాలనుకుంటే, నీవు, నాతో ఎడముఖం, పెడముఖంగా ఉన్నావు. ఎందుకిలా ప్రవర్తిస్తున్నవా అని అరా తీస్తే, నీవు ఒక దివ్యాంగుడిని ప్రేమించి, పెళ్లి చేసుకోవాలనుకుంటూ న్నావని తెలిసింది. నేను దానికి అడ్డు పడతానేమో అనే సందేహంతో, నన్ను తప్పుగా అర్థం చేసుకున్నావు. నా లక్ష్యం వైపు పయనించమని నిన్నెప్పుడూ నిర్దేశి0చకపోయినా, నా ఆశయాల బాటలో నడచి నీకు నీవుగా, అంకిత్ ను ఆదర్శ వివాహం చేసుకోవాలనుకున్నావు. నీ నిర్ణయంతో, నా జీవితకాల వ్యథ మంచులా కరిగిపోయింది. దానితో, నాలో వున్న చిరాకు, విసుగు, కోపం పోయి, వాటి స్థానంలో, అనురాగం ఆప్యాయతలు చోటుచేసుకున్నాయి….. ఉత్తరాన్ని చదువుతున్న సాహిత్య కళ్ళలోనుండి కన్నీళ్ళు జలజల రాలిపోతున్నాయి,తన తండ్రిని ఎంత మూరు?డిగా అనుకున్నది తలచుకోగానే. తండ్రి పట్ల ఉన్న అసహ్యపు పొరలు వీగిపోయాయి. అప్పుడే, పోలీసుస్టేషన్ నుండి వచ్చిన అంకిత్, సాహిత్య భుజంపై చేయి వేసి, తడుతూ…."మావయ్య గారికి ఏమి అవ్వదు, ఏడ్చువద్దు, ధైర్యంగా ఉండు' అంటూ ఓదార్చాడు. "మా నాన్న గారిపై దాడి చేసింది ఎవరో తెలిసిందా!!? పోలీసులు ఏమి చెప్పారు?" ఆత్రంగా అడిగింది సాహిత్య. "మనం అనుకున్నట్లు వాళ్ళు, మావయ్యకు శత్రువులు కారు. వీధి రౌడీలంట…"చెప్పాడు అంకిత్. "వీధి రౌడీలా! ? వాళ్ళతో మా నాన్నకు వైరం ఏంటి?…."

కళాశాల బహిరంగ సభల ప్రసంగాలలో, సమాజాన్ని చైతన్యపరచాలంటే, యువత విద్యావంతులై ఉండాలి. కొంతమంది పదవతరగతి వరకే చదివి, ఆపై చదువుల్లో చేరకుండా మానేస్తుంటారు. మరికొందరు డ్రాపవుట్ అవుతూ వుంటారు. ఇలా సగం చదువులతో, ఏ ఉద్యోగమూ రాక, కాయకష్టం చేసుకోలేక దుర్భర జీవితం అనుభవిస్తారు. అలాంటి వాళ్ళు రౌడీలుగా మారి, సమాజానికి చీడపురుగులుగా తయారవుతారు. అలా కాకుండా, యువత ఉన్నతమైన చదువులు

చదివితే సమాజంలో గౌరవంగా బ్రతకొచ్చు. మీ బంగారు భవిష్యత్ మీ చేతుల్లోనే ఉంది. ఇలా యువతనుద్దేశించి ప్రసంగించారు. ఆ మాటలు రౌడీలకు నచ్చక, ఇలాంటి ప్రసంగాలు చేస్తే బాగుండదని మీ నాన్నగారిని హెచ్చరించటానికి వచ్చి, మాటా, మాటా పెరగడంతో ఉద్రేకంలో గాయపరిచారని వాళ్ళ విచారణలో తేలింది. మంచికి పోతే చెడు ఎదురైనట్లు, ఆశయాలతో సమాజ శ్రేయస్సు కోరుకునే వారిని కొందరు ప్రోత్సహిస్తారు. ఇంకొందరు ఆటంకపరుస్తారు. రకరకాల మనస్తత్వాలతో వ్యక్తుల అవగాహనా స్థాయిని బట్టి వాళ్ళ ఆలోచనలు చేష్టలు ఉంటాయి.

నర్సు వచ్చి పిలవడంతో,పరుగున వెళ్లి తండ్రి ఛాతిపై వాలి బావురుమని ఏడుస్తూ "చదువుకుంటే బాగుపడతారని చెప్పినందుకు, పర్యవసానం ఇదా? వాళ్ళను దేవుడు శిక్షించి తీరతాడు!"బెడ్ పై, నీరసంగా పడుకొని ఉన్న తండ్రిని చూసి, బాధతో వాళ్ళపై ద్వేషంతో, శాపనార్థాలు పెట్టసాగింది సాహిత్య. "రౌడీఇజమ్ చేసి, వాళ్ళ పిల్లలు తెచ్చిన డబ్బులతో జల్సాలు చేసుకునేవారు కొందరు తల్లిదండ్రులు. వాళ్ళు చదువులతో మంచి దారి పట్టి రౌడీఇజమ్ మానేస్తారని, ఆ ద్వేషం నాపై చూపించారు. ఏదైతేనేమి రౌడీల వారసులు వాల్మీకిలా మారి, అప్పటి వరకు కత్తులు పట్టిన చేతులతో, ఇప్పుడు కలాలు పట్టి కాలేజీ చదువులు చదువుతాం అనడము...ఇంత బాధలో కూడా నన్ను సంతోషపరిచింది. ఏదైనా మంచికే జరిగింది అమ్మా..."అంటూ సాహిత్య తల నిమురుతూ ఊరడించాడు, రాజారాం. 'నీవు, అంకిత్ లు సకాలంలో,నన్ను హాస్పటల్లో అడ్మిట్ చేయటంతో, నాకు ఆపాయం తప్పింది. నేను మీకు కృతజ్ఞుణ్ని తల్లీ అంటూ, పక్కకు చూపులు తిప్పి వెతుకుతూ అంకిత్ ఎక్కడ' అని అడిగారు. "ఎస్సైగారు పిలవడంతోపోలీస్ స్టేషన్‌కి వెళ్ళాడు", చెప్పింది సాహిత్య. "అలాగా..... మన కారులో నా బ్యాగ్ ఉంది తెచ్చి ఇవ్వమ్మా, దాంట్లో కావ్య గారు రాసిన కొన్ని నవలలు ఉన్నాయి, చదువుకుంటాను"అన్నాడు రాజారాం.

"ఏంటి? కదలలేని పరిస్థితిలో కథలు చదవాలని ఎలా అనిపిస్తుంది. గాయం నొప్పితో బాధపడుతున్నారు కాసేపు కళ్ళు మూసుకుని విశ్రాంతి తీసుకోండి" తండ్రిపై చిరుకోపం ప్రదర్శించింది, సాహిత్య. "నిజానికి బాధలో ఉన్నప్పుడే ఆ కథలు చదివితే నా మానసిక సంఘర్షణ తగ్గుతుంది. ఇది ఈ నాటిది కాదు. ఎప్పటి నుంచో కొనసాగుతూంది. నాకుశారీరకంగా, మానసికంగా ఏ బాధ కలిగినా సరే ఆమె రాసిన కథలు చదివితే, మా అమ్మలాలింపులాగ,ఓదార్పుగా ఉంటుంది". "హా! చూశా నాన్న. మీ బ్యాగులో అన్నీ కావ్యగారు రాసిన పుస్తకాలే. వాటిలో 'బంధం' అనే కథ చదివాను. ఎన్నిసార్లు చదివినా, మళ్ళీ మళ్ళీ చదవాలనిపిస్తుంది". "చదవండి" అంటూ రాజారాంకు పుస్తకం అందించింది సాహిత్య."నీవెప్పుడు చదివావు?" అడిగాడు. "ఈ ఒక్కటే కాదు, నాన్నగారు. కావ్యగారి రచనలన్నీచదివాను. ఆమె రచనల్లో, మన సంస్కృతి సంప్రదాయాల్లో ఉన్న నైతికవిలువలు, వివాహ వ్యవస్థకు ఇచ్చే గౌరవం విశదీకరిస్తూ రాసే విధానం నాకు బాగా నచ్చుతుంది. అందుకే, ఆవిడ అభిమానినై, ఆమెను కలుసుకున్నాను".

ఆ మాటలకు రాజారం ఆశ్చర్యపోతూ, "నిజమా !!? నేను నమ్మలేక పోతున్నాను. ఆమెను ఎలా కలుసు కోగలిగావు?"ఆశ్చర్యం నిండిన స్వరంతో..."నేనూ ఆమెను కలవగలనా?" అని అడిగారు రాజారాం గారు. 'తలచుకుంటే మీరూకలవగలరు'. అంది సాహిత్య. "అవునా, నాకు ఇప్పుడే నాకు కలవాలనుంది. ఎలా?""లేడికి లేచిందే పరుగు అన్నట్లు ఇప్పుడే అంటే ఎలా కుదురుతుంది? పోనీ ఒక పని చేస్తే...మీ అభిమాని చావు బతుకుల్లో ఉన్నాడు... మిమ్మల్ని చూడాలని అంటున్నాడని పిలిస్తే... ఇక్కడకు వస్తుందా?" ఆశగా అంటున్న తండ్రిని చంటి పిల్లాడ్ని చూసినట్లు ఎగాదిగా చూసి, 'సరే కాని, అమ్మ గంట నుండి మనం ఇంకా ఇంటికి చేరలేదేంటని ఫోన్ చేస్తుంటే, ఏం చెప్పాలో తెలియక, కట్ చేస్తున్నాను. ఏం చెప్పమంటారు? కావ్యగార్ని తీసుకు రావటానికి వెళతాను. మీరు ఇక్కడ ఒంటరిగా ఎలా ఉంటారు. అమ్మను మీ దగ్గర ఉంచి వెళతాను సరేనా? "నాకిలా జరిగిందని మీ అమ్మకు చెప్పకు. ఆమె కంగారుపడి మనల్ని కంగారు పెడుతుంది." అన్నాడు రాజారాం. "సరే నర్స్ కి మిమ్మల్ని చూస్తుండమని చెప్పి వెళతాను."అంటూ సాహిత్య అటు వెళ్ళగానే, .రాజారాం గారి మనసులో అలజడి...'కావ్య గారిని తీసుకు వస్తానని వెళ్లింది సాహిత్య. కాని ఆమె వస్తుందో?...రాదో!!?..రాదేమో అనుకుంటేనే మనసు బాధతో మూలుగుతుంది. ఎలాగైనా ఆమెను చూడాలనే ఆరాటంతో క్షణం యుగంలా గడిచింది అతనికి.

అంతలో గాజుల సవ్వడి వినిపించడంతో, తన అభిమాన రచయిత వచ్చిందనే ఆత్రంలో బలవంతంగా లేవబోయాడు. "అయ్యో! మీరిలా లేవకండి గాయం. బాధ ఇంకా ఎక్కువ అవుతుంది" అంటూ దిండు సరిచేస్తూ భర్త తలను మెల్లగా దిండుపై వాల్చుతూ కన్నీళ్లు పెట్టుకుంది సృజన. సృజనను చూడగానే రాజారాం గారు చుట్టూ పరికిస్తూ నేనేమి చెప్పాను,నీవేమీ చేసావు అన్నట్టు, కళ్లతోనే కూతుర్ని

ప్రశ్నించారు. మీరు చెప్పినట్లే చేశానంటూ తలపంకిస్తూ,కళ్లతోనే సమాధానమిచ్చింది సాహిత్య. "నాతో పరిహాసమా?" కోపం దిగమ్రింగుకుంటూ అరచినంత పని చేసారు రాజారాం గారు. "ప్రామిస్ అక్షరాల మీ అభిమాన రచయిత్రి 'కావ్య' గారినే తెచ్చాను. ఆమెతో ఏం మాట్లాడాలనుకున్నారో... మాట్లాడుకోండి". ముసిముసి నవ్వులతో అంది సాహిత్య. "నిజమా! ఇన్నాళ్లు నేను యిష్టంగా చదివిన రచనలు సృజన రాసినవా??" నమ్మలేనట్లు షాక్ తగిలిన వాడిలా సృజనను చూస్తూ అలాగే విస్మయంలో ఉండిపోయాడు రాజారాం.

ప్రక్కనే ఉన్న సృజన చేతిని అప్రయత్నంగా దగ్గరకు తీసుకొని, తన పెదవులతో స్పృశించి ముద్దు పెట్టుకున్నాడు. ఈ హటాత్పరిమానానికి, సృజన తల సిగ్గుతో వాలిపోయింది. "కావ్య అన్న పేరు, నీ కలం పేరా? నీ కథలు చదివేవారి హృదయాల్ని హత్తుకునేలా రాసిన, నీ రచనలకు ప్రేరణ ఎవరు? మరెందుకు రాయడం నిలిపివేశావు?' సృజనను సూటిగా చూస్తూ, ప్రశ్నలు వేయసాగాడు. అందుకు సృజన, "నా చిన్నతనంలోనే మా నాన్నగారు చనిపోయారు. మా తాతయ్య చెప్పిన పురాణాలు, ఇతిహాసాలు, కథలు ఎక్కువ వినేదాన్ని. స్కూల్లో మా సత్యం మాష్టారు, వ్యాస రచన పోటీలు పెట్టినపుడు,నేను వ్రాసిన వ్యాసం కావ్యంలా రాసానని, నన్ను పొగిడి, ఈ రోజు నుండి నీ పేరు సృజన కాదు..'కావ్య సృజన' అంటూ నాకు ప్రథమ బహుమతి ఇచ్చి అభినందించారు. సత్యం మాస్టర్ అన్నమాటతో ప్రేరణ పొంది, రచయిత 'కావ్య'గా కథలను రాశాను. తండ్రి ప్రేమ నోచుకోని నాకు, మీ ప్రేమ లభిస్తుందని ఎంతో ఆశతో ఎదురు చూశాను. కాని నా ఆశ, ఆవిరైంది. ఏనాడు మీరు, నా ఉనికిని కూడా గమనించక పోవడంతో, మన బంధం బంధనంలా తోచింది. దానితో మానసిక ప్రశాంతత లేక, నాలో స్థిరత్వం కోల్పోయి, కథలు రాయడంపై మనస్సులగ్నం చేయలేకపోయి, రాయడం మానుకున్నాను. దానితోఒత్తిడికి గురై పరధ్యానంగా ఉండేదాన్ని.నా దుస్థితిని గమనించిన సాహిత్య, వాళ్ల కొలిగ్స్ విషయాలు, అంకిత్ తో, తన పరిచయం అన్నీ చెప్పి, నాన్న ఎప్పటికైనా నిన్ను చేరదీసి, నీ రచనలను మరుగున పడనీయకుండా నీచే, కొనసాగింపచేస్తారని నాకనిపిస్తుంది అనేది. ఆ మాటలు నా మనసుకు కొంత ఊరట కలిగించేవి'.... తన చెక్కిళ్లపై జారిన కన్నీళ్లు తుడుచుకుంటూ చెప్పింది సృజన.

'చందనం చెట్టుపై గొడ్డలి వేటు పడినా, అది సువాసనే వెదజల్లుతుందన్నట్లు' నీ మనసును ఇంతగా నొప్పించినా మా శ్రేయస్సునే కోరుకునేదానివి. ఇంతటి ప్రతిభావంతురాలిని గుర్తించలేకపోవడం నా అవివేకం. పున్నమి వెన్నెలతో జగమంతా వెలుగు నింపిన జాబిలికి మబ్బులు అడ్డుపడి చీకటి కమ్మినట్లు అయింది నీ పరిస్థితి. "నన్ను క్షమించు సృజన. ఇలాంటి పొరపాట్లు ఇకపై, మన జీవితంలోకి రానివ్వను. స్వతహాగా కథలు రాసే నీవు, ఆ అనుభవంతో మన కథనే నవలగా రాయవచ్చు కదా.రాస్తావు కదూ, రాయాలి సరేనా!!?" అని సృజనతో నవల రాయటానికి ఒప్పించాడు రాజారాం.

తండ్రిలో వచ్చిన మార్పును గమనిస్తున్న సాహిత్యతో, "నీవు కూడ, నా వలన ఏమైనా కోల్పోయివుంటే, యిప్పుడే చెప్పేయి తల్లీ", అంటూ గోముగా అడిగాడు. "నా చిన్నప్పుడు నా ఫ్రెండ్ ఇంటికి వెళ్లినపుడు, వాళ్ళ అమ్మ నాన్నలు, వాళ్ళతో హాస్యపు ఛలోక్తులు విసురుతూ,నవ్విస్తుంటే, వాళ్ళ ఇల్లు ఎంతో సందడిగాఉండేది. పచ్చని మొక్కలతో,రంగురంగుల పువ్వులు పూసిన ఉద్యానవనంలో ఉన్నట్లు నా మనసుకు ఆహ్లాదంగా అనిపించేది. కానీ మనింట్లో కీకారణ్యంలో, ఏకాకిగా ఉన్నట్లు ఉండేది. దీనికంతటికి కారణం మీరు మౌనంగా ఉండటమే. కోపంగా...ఎప్పుడూ కేకలు వేయటం తప్పించి, ఏనాడైనా చిరునవ్వుతో పలకరించారా ....? ఇంటిని ఎక్కువగా మౌనమే రాజ్యమేలేది. మౌనంగా ఉండటానికి భవబంధాలు తెంచుకున్న మునులం కాము మనం. భార్యాభర్తల మధ్య గానీ, తల్లిదండ్రులు పిల్లల మధ్య గానీ, వాళ్ళ వాళ్ళ జీవితాల్లో జరిగిన సంఘటనలను, మనస్సులో దాచుకోకుండా నిర్భయంగా చెప్పుకుంటే, ఒకరిపై ఒకరికి నమ్మకం కలిగి, వాళ్ళ అనుబంధం ఇంకా పటిష్టం అవుతుంది. కానీ, మనింట్లో ఎప్పుడూ లైబ్రరీలో ఉన్నట్లు నిశ్శబ్దంగా ఉండటం వలన, ఒకరి అభిప్రాయాలు ఒకరికి తెలియకుండా పోయాయి. నిశ్శబ్దం మనమధ్య దూరం పెంచింది. దానితో, ఒకరిని ఒకరు అర్థం చేసుకోలేక, లేనిపోని అపోహలతో విలువైన కాలమంతా కరిగిపోయింది..."ఆవేదనగా అంటున్న కూతుర్ని సముదాయిస్తూ,"భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ అర్జునునితో చెప్పినట్లు, మధ్యాహ్నం బాగా ఎండగా ఉంటుంది. సాయంత్రం చల్లబడుతుంది. మధ్యాహ్నం వేడిని అనుభవించినపుడే, సాయంకాలం చల్లటి గాలి అనుభూతి తెలుస్తుంది. అలాగే సుఖ దుఃఖాలనేవి వెనువెంటనే వస్తాయి. మనమే మనసులోని బాధను పారద్రోలి సంతోషాన్ని మనలో నింపుకోవాలి...!! త్వరలో రాబోవు పాతికేళ్ల మా పెళ్లి రోజుకు, సిల్వర్ జూబ్లీ ఫంక్షన్ ఏర్పాటు చేసి వచ్చిన అతిధులకు అంకిత్ ను మా అల్లుడిగా పరిచయం చేస్తాను.."చిరునవ్వుతో రాజారాం గారు అనటంతో వాళ్ళ మనసులు, మబ్బులు చెదిరిన ఆకాశంలా, నిర్మలంగా ప్రకాశించాయి.

రచయిత: ఉపాధ్యాయులు

ద్రావిడజాతి లిటరరీ స్నైపర్

విప్లవకుమార్ మందుల

పరిచయం:

తెలుగునేలకు అటు రాళ్లల్లో పరుగులు తీసే కృష్ణ, ఇటు ఎర్రదుక్కుల్లో ఎగిసిపడే గోదావరి లాంటి ఉరవడి ఉన్న సారవంతమైన మట్టి గొంతుక కోయి కోటేశ్వరరావు. అసిస్టెంట్ ప్రొఫెసర్, వక్త, కవి, విమర్శకుడు, విశ్లేషకుడు, అన్నిటికీ మించి యువసాహిత్యకారుల తయారీదారుడు. గుంటూరు జిల్లా పొన్నూరు సంస్కృత కళాశాల నుండి సాంప్రదాయ సాహిత్య విద్యార్థిగా బయలుదేరిన కోయి కోటేశ్వరరావు సరాసరి చేరవలసిన చోటుకే చేరుకున్నాడు. అట్లా 1990 ల్లో కవిత్వం రాయడం ప్రారంభించినప్పటికీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అడుగుపెట్టి 1995 సంవత్సరం నాటికి గుండెడప్పు మోగిస్తూ నీలి కవితాకాశంలో నల్ల సూర్యుడిలా పొద్దుపొడిచాడు. అప్పటి నుండి తెలుగు సాహిత్య నేలపై తను ప్రకాశవంతంగా ఉదయిస్తూనే ఉన్నాడు. కానీ ఈ రెండున్నర దశాబ్దాల కాలంలో అనేక కారణాల రీత్యా కోయి కోటేశ్వరరావు ఒక్క కవితా సంపుటి కూడా తీసుకురాలేకపోయాడు. అందుకు నేను గుర్తించదగినవి రెండు కారణాలు. ఒకటి అధ్యాపకుడిగా వృత్తి జీవితం. రెండవది సాహిత్యకారుడిగా ప్రవృత్తి జీవితం. నిజానికి తనని, తన జీవితంలో ఎక్కువ కాలాన్ని ఆవరించింది, ఆక్రమించింది కూడా ఇదే. ఎందుకంటే రెండు తెలుగు రాష్ట్రాల లోపల, బయట జరిగే సాహిత్య సభలు, పుస్తకావిష్కరణలు, యూనివర్సిటీల్లో అకాడమిక్ లిటరేచర్ సెమినార్లు కనీసం నెలకు పది జరిగినా అందులో నాలుగు నుండి ఆరు సభల ఆహ్వాన పత్రికల్లో తప్పక ఉండే ఏకైక పేరు కోయి కోటేశ్వరరావు. ఇవే కాకుండా దేశ వ్యాప్తంగా ఉన్న వివిధ యూనివర్సిటీల్లోని తెలుగుశాఖ, భాషా సాంస్కృతిక శాఖల కార్యక్రమాల్లో అతిథిగా, వక్తగా, సమీక్షకుడిగా, సాహిత్య విద్యార్థిగా క్రమం తప్పక కనిపిస్తాడు. ఈ అన్ని కార్యక్రమాల్లో అత్యంత ప్రిపరేషన్‌తో, హోం వర్క్ చేసి, పేపర్ మీద పెట్టి, సాధికారంగా మాట్లాడి, సభికుల్ని తప్పక సంతృప్తిపరిచే గ్యారెంటీ స్పీకర్. ఇవి సరిపోవన్నట్టు మరోపక్క విస్మృత కవుల్ని వెలికితీసేందుకు చేస్తున్న కృషి. ఆన్ లైన్ మీటింగుల్లో ప్రసంగాలు, పుస్తకాలకు ముందుమాటలు రాసివ్వడం ఇట్లా సాహితీ సేవలో నిరంతర నిమగ్నత. ఈ విధంగా తీరిక లేకున్నా, ఖాళీ దొరకకున్నా, ఎవరినీ కాదనకుండా కాలికి సాహితీ బలపం కట్టుకొని తిరగడం వల్లనే తనకు, తన సాహిత్య సేద్యానికి తాను మిగలలేకపోయాడు. ఫలితంగానే తన కవితా సంపుటి 'నాగస్వరం' రెండున్నర దశాబ్దాలు ఆలస్యంగా మన ముందుకు వచ్చింది.

నాగస్వరం తాత్వికత:

ఈ 'నాగస్వరం'లో నుండి వినిపించే కవితానాదాలపై ఇప్పటికి చాలా సమీక్షలు వచ్చాయి. 'నాగస్వరం' అనే పుస్తకం పేరు నన్ను బాగా ఆకర్షించింది, మిక్కిలి ఆలోచింపజేసింది. అందుకే కోయి కోటేశ్వరరావు 'నాగస్వరం' పుస్తకం నామం వెనుక ఉన్న తాత్వికత ఏంటని ప్రాథమికంగానైనా అధ్యయనం చేయాలనుకున్నాను. నాగస్వరం అనగానే మనకు నాదస్వరం, నాగస్వరం కాయ గుర్తుకు వస్తాయి. ఇందులో మొదటిదైన నాదస్వరం మన దక్షిణదేశ వాయిద్యం. మరొకటి నాటు సొరకాయ. ఇది అడవిలో దొరుకుతుంది. దీన్నే అడవి సొరకాయ, నాగస్వరం కాయ, నాగసరం కాయ అంటారు. ఈ నాగసరం కాయ ఎండబెట్టి నాగస్వరం అనే వాయిద్య పరికరం(Music instrument)ను జానపదులు, పాములను ఆడించే కళాకారులు ఊదుతారు. కోయి కోటేశ్వరరావు పుస్తకం చూడగానే లేదా ఆ పేరు వినగానే చాలా మంది పైన చెప్పిన నాగస్వరంగానే భావించడం సరికాదు. ఎందుకంటే కోయి చెబుతున్న 'నాగస్వరం' అనాదిగా ఈ నేల వినిపిస్తున్న గొంతుక. ఈ పుడమి మీద మనిషి పుట్టుక నుండి వినిపిస్తున్న మూల వాసుల ఆర్తనాదం. చెట్టు, పుట్ట, చేను, చెల్క, గుట్ట, మట్టి, గొర్రె, బర్రె, లంద, బొంద, మొత్తంగా ఈ నేలలో పుట్టి పెరిగి యుగాలుగా ఉత్పత్తితో పెనవేసుకున్న సెమట సుక్కలజాతి జనగానం ఈ 'నాగస్వరం'. ఇంకా చెప్పాలంటే ఆర్యావర్తనం పూర్వం నుండి మాతృస్వామిక వ్యవస్థలో ఈ నేలమీద నివసిస్తున్న, ఈ నేలకు చెందిన ద్రావిడ జాతులు ఎలుగెత్తుతున్న శబ్దం. ***"మన ద్రావిడజాతి సంప్రదాయంలో నాగు జ్ఞానానికి, యోగానికి ప్రతీక."*** (యాదయ్య, బెల్లి. తీగో నాగో ఎన్నియలో. 2016: X) అయితే ఇక్కడ ద్రావిడ జాతి అంటే కేవలం దక్షిణ భారతదేశంకు మాత్రమే పరిమితమైనదిగా చూడలేము. సింధులోయ పరిసర ప్రాంతాల నుండి మొదలై సింహళ దేశ పరిసరాల వరకు ద్రావిడ మూలాలు ఉన్నాయని, వారంతా జ్ఞాన సంపన్నులుగా వెలుగొందారని ఎంతో మంది చరిత్రకారులు నిరూపించారు. దీని వెనుక ఉన్న బలమైన తాత్విక లోతులు, తార్కిక పునాదుల కోణంలో మనం

పరిశీలించాల్సిన అవసరం ఉంది. తత్=అది, త్వం=నీవు, తత్‌ంత్వం=తత్వం. తత్వం అంటే అది నీవు. దానికి, నీకు ఉండే సంబంధాన్ని తెలియజేసేది అని అర్థం. సంస్కృత పదమైన 'తత్వం' నుండి ఈ తత్వం అనే తెలుగు పదం వచ్చింది. 'తత్వం'ను ఇంగ్లీష్‌లో ఫిలాసఫీ (Philosophy) అంటారు. మనం చెప్పాలనుకుంటున్న తత్వానికిగల పునాదినే 'తాత్వికత' అని చెప్పవచ్చు. నాగ అనే పదం అర్థం, జీవితం, ఉనికి, నేపథ్యం, వాస్తవం, తత్సంబంధిత విషయాలపై తర్కబద్ధంగా చేసే మేధోపరమైన అధ్యయనమే నాగస్వరం తాత్వికత. ఇక్కడ నాగ అంటే ఒక పురాజాతికి సంబంధించిన పేరు. స్వరం అంటే కవిత్వానికి సర్వనామం. కోయి కోటేశ్వరరావు కవిత్వ సంపుటికి 'నాగస్వరం' అనే పేరు పెట్టడానికి మూలమైన విషయాలను తార్కికంగా వివేచించడమే నాగస్వరం తాత్వికత. ఇట్లా ఆలోచించడం, విశ్లేషించడం ద్వారా కోయి కోటేశ్వరరావుని, అతడి కవిత్వాన్ని సమగ్రంగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది.

"The Brahui enables us to trace the Dravidian race beyond the Indus to the southern confines of Central Asia." (Caldwell, Robert. A Comparative Grammar of the Dravidian or South-Indian family of languages, London. 1913: 44) ప్రఖ్యాత భాషా శాస్త్రజ్ఞుడు రాబర్ట్ కాల్డ్ వెల్ పరిశోధనాత్మకంగా రాసిన 'ఎ కంపారిటివ్ గ్రామర్ ఆఫ్ ది ద్రవిడియన్ ఆర్ సౌత్ ఇండియన్ ఫ్యామిలీ ఆఫ్ లాంగ్వేజెస్' ప్రకారం సింధు నది దాటి మధ్య ఆసియా దక్షిణ సరిహద్దుల వరకు ద్రావిడ జాతిని గుర్తించడానికి మనకు బ్రహుయి భాష వీలు కల్పిస్తుంది. ఇట్లా చూసినప్పుడు ఇరాన్ నుండి వలస వచ్చిన ఆర్యజాతీయుడైన రాముడి చేత హత్య గావింపబడ్డ తాటకి నుండి రావణుడి వరకు అందరూ ద్రావిడజాతికి చెందినవారని చెప్పవచ్చు. అయితే ఇక్కడ నాగస్వరం గురించి చెప్పడానికి బదులు ద్రావిడస్వరం గురించి చెప్పడమేంటని అనుమానం కలగవచ్చు. ఇలాంటి అనుమానాలను పటాపంచలు చేస్తూ, సందేహాల్ని నివృత్తి చేశాడు డా. బాబా సాహెబ్ అంబేద్కర్. ***"ద్రావిడ శబ్దం ఇక్కడి ప్రజలు మాట్లాడే భాష పేరే కానీ జాతి పేరు కాదు. ఆర్యుల రాకడకు ముందు సింధు నది నుండి సింహళ ప్రాంతం వరకు మాట్లాడిన భాష అది. ఉత్తరదేశంలో నాగులు ఆర్యుల భాష అయిన సంస్కృతం అలవర్చుకున్నారు. కానీ దక్షిణదేశం నాగ జాతీయులు తమ ద్రావిడ భాష కాపాడుకున్న కారణంగా ద్రావిడులని చెప్పుకోవడాన్ని నిలబెట్టుకున్నారు. కాబట్టి నాగులు ద్రావిడులు ఒక్కరే. ఒకే ప్రజలకు ఉపయోగించే రెండు భిన్న నామాలవి."*** అంటాడు డా. బి. ఆర్. అంబేద్కర్. (అంబేద్కర్, బి. ఆర్. అస్పృశ్యులెవరు. 1973: 70).

ఈ విషయాన్ని వీలైనంత శాస్త్రీయంగా చెప్పడానికి బాబా సాహెబ్ ఎంతగానో పరిశోధించాడు. తన అస్పృశ్యులెవరు పుస్తకంలో అనేక ఉటంకింపులు, ఆధారాలు జతపరిచి నిరూపించాడు. ఇట్లా చూసినప్పుడు ఈ దేశంలోని మూలవాసులందరు నాగజాతికి చెందినవారని అర్థమవుతుంది. కానీ ఆర్యుల రాకడతో, వారిచేత ఓడించబడిన నాగ (ద్రావిడ) జాతి బ్రాహ్మణ భావజాల వ్యాప్తికి తలవంచక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా నాగజాతి పరాయీకరణకు గురైతూ వస్తూనే ఉన్నది. ఆ పరాయీకరణ నాగజాతి తమని తాము గుర్తించుకోలేని దుస్థితిలోకి నెట్టివేసింది. అందువల్లనే పరాయీకరణ క్రమంగా అణిచివేత, అంటరానితనం, సామాజిక దోపిడీలుగా పరిణామం చెందాయి. ఈ కుల, మత దోపిడీ ఊపిరాడనివ్వక వెంటాడుతూ, వేటాడుతున్న నేటి ప్రమాదకర స్థితిలో నుండి బయటపడడానికి ఇండియన్ టార్చ్ బేరర్, భారత సామాజిక విప్లవ దార్శనికుడు అంబేద్కర్ రాసిన అస్పృశ్యులెవరు పుస్తకంలో (The Untouchables who were they: And why they became Untouchables) ***"క్రీస్తుశకం తొలి శతాబ్దాల్లో ఆంధ్రదేశం తత్పరిసర ప్రాంతాల్లో నాగజాతీయులు అధికారంలో ఉన్నారని చాలా ఆధారాలు సూచిస్తున్నాయి. శాతవాహనులు, వారి తర్వాత వచ్చిన సూత కుల శాతకర్ణులు నాగరక్తం పంచుకుపుట్టినవారే."*** (అంబేద్కర్, బి. ఆర్. అస్పృశ్యులెవరు. 1973: 62) అనే విషయాన్ని చదువుకున్నాడు కోయి కోటేశ్వరరావు. సరిగ్గా అంబేద్కర్ మహనీయుడు వివరించిన చారిత్రక లోతుల నుండి, ఆ తాత్విక పునాది నుండి తన మూలాలను ఒడిసి పట్టుకున్నాడు. తన కవిత్వ వడిసెలతో ఆర్య బ్రాహ్మణాధిపత్యంపై పదునైన కవితల్ని విసురుతున్నాడు.

"నాగజాతి రక్త సంతకాన్ని నేను/ దమ్మపథ బాటసారిని నేను/సత్య జ్యోతి కిరణాన్ని/నేను భీమ పతాకాన్ని/నాది నాగస్వరం" (నాగస్వరం: 136) అని తన మూలాలను ప్రకటించుకుంటూ, నాగజాతి అస్తిత్వాన్ని మేలుకొలుపుతున్నాడు. నాగజాతి వారసున్ని నేనంటూ అక్షరాగ్గిరజను చిమ్ముతూ నాగజాతికి చెందిన దళిత, బహుజనుల రక్షణకు పూనుకున్నాడు. అసమానతలను కొనసాగించాలని చూసే మెదళ్ళను కవితలతో కోసి, ఉప్పు, పసుపు రాసి వట్టితునకల దండెంమీద ఎండగడుతున్నాడు. 'నాగస్వరం' కవితా సంపుటి వెనుక కోయి కోటేశ్వరరావుకు ఇంతటి స్పష్టమైన తాత్విక దృక్పథం ఉన్నది. కనుక అంబేద్కరిస్టు దృష్టికోణం నుండే నాగులు ద్రావిడులు వేరు కాదు ఒకటేనని తిరిగి ప్రకటించడానికి, ద్రావిడ భాషా కుటుంబాలన్ని తమ మూలవాసులైన నాగజాతుల అస్తిత్వం పునికిపుచ్చుకోవడానికి **'నాగస్వరం'** టైటిల్ ని ఖరారు చేసాడని అర్థమవుతుంది. ఇది

విత్తనపు వడ్ల వలె, ఇంగువ గుడ్డ వలె, ఆధునికానంతర ఆధిపత్య భారతంలో ద్రావిడనాడు కాపాడుకుంటున్న మూలాల నుండి మనదైన అస్తిత్వం నుండి 'నాగస్వరం' వినిపిస్తున్నాడు కోయి కోటేశ్వరరావు.

నాగస్వరం కవిత్వం:

ఆ తాత్విక భూమికగా రాసిన కొన్ని కవితల్ని పరిశీలిస్తే కవి చేస్తున్న విధ్వంసం మనకు తేటతెల్లం అవుతుంది. చరిత్ర పొడవునా సనాతన సంప్రదాయవాదులు, వారి బ్రాహ్మణ ఆధిపత్యం ప్రచారం చేసిన పురాణాలు, భాషా, సాహిత్యాలు, ప్రామాణికతలను కవి తన కవిత్వం ద్వారా తిరస్కరిస్తున్నాడు. వేల సంవత్సరాలుగా కుళ్ళి కంపు కొడుతున్న మూస ఆలోచనలను ధ్వంసం చేస్తూ, సంప్రదాయ బానిసత్వం నుండి తెలుగు కవిత్వాన్ని విముక్తం చేసిన మద్దూరి నగేష్ బాబు కవిత్వధారను కొనసాగిస్తున్నవాడు కోయి కోటేశ్వరరావు. తన కవిత్వానికి సుదూర చూపు, సుదీర్ఘ లక్ష్యం ఉన్నది. అందుకోసం తను నిర్మాణాత్మకంగా కృషి చేస్తున్నాడనిపిస్తుంది. దానికి తార్కాణమే ఈ కవిత.

"రాతిని నాతిగా మార్చిన రామపాదం కంటే/మట్టిని పరమాన్నంగా మలిచిన/మా అయ్య పాదమే నాకు ఆరాధ్యం" (ప్రాణవాయువు: 36) ఇక్కడ ఆర్యజాతిని, బ్రాహ్మణ మతాన్ని నిర్ద్వందంగా, కుండబద్దలు కొట్టినట్టు తిరస్కరిస్తున్నాడు. రాయిని పాద స్పర్శ మహిమతో స్త్రీగా మార్చిన కట్టుకథల రామపాదం కంటే, సుద్దాల అశోక్ తేజ పాడినట్టు 'మన్నుల నుండి అన్నం తీసే సెమట మహిమ' గల, శ్రామికకుల తండ్రుల పాదాలే ఆరాధ్యమైనవిగా పట్టంగడుతున్నాడు. ఈ విశ్వమంతా శ్రమ మీదనే పురోగమిస్తుందని, మట్టి, సెమట మమేకతల నుండే లోకాన్ని అవలోకనం చేసుకోమంటున్నాడు కోయి కోటేశ్వరరావు.

'చెట్టు చాటు నుండి దూసుకొచ్చిన/ఆర్యవీరుని దొంగబాణంలా/పుట్టుకనే వక్రీకరించి/పురుషసూక్తం పఠించిన/విభజన మంత్రంలా" (త్రోలాయణం: 86). ఒకే బాణం అంటూ వంకర ప్రచారాలు చేసే వారికి, వన్ సైడ్ కీర్తనలు వినిపించే చారిత్రక కుట్ర దారుల గుట్టు రట్టు చేసి నడి బజారులో నిలదీసినట్టుంది ఉంది ఈ కవితా పాదం. ఈ దేశ మూలవాసులైన నాగజాతి ప్రజలపై దొంగ చాటుగా, వంచనతో ఎన్నో బాణాలు వేసి తాటకిని, వాలిని, రావణుడిని చంపిన ఆర్యవీరుడిది ఒకే బాణం కాదు, దొంగ బాణం అని తీర్పునిస్తున్నాడు కవి. నిజానికి ఈ కవిత అమృత – ప్రణయ్ కోసం రాసినది. ఈ కవితలో పోలిక చెప్పే అవకాశాన్ని అదునుగా తీసుకొని, "పద్యాల నడుముల్ విరగ దంతాను" అని పఠాభి అన్నట్టు, కోయి కోటేశ్వరరావు శత్రు శిబిరం భావజాలపు నడుములు విరగగొట్టే కృషిలో నిబద్ధతతో నిమగ్నమై ఉన్నాడనేది మనకు కనిపిస్తుంది.

ఉద్యమకారులు తమ నిరసనను తెలపడానికి ఆర్టీసీ బస్సుల్ని అప్పుడప్పుడు తగలబెడుతుంటారు. బస్సును తగలబెట్టొద్దు అని చెబుతూ 'దగ్ధగీతం' కవిత రాశాడు.

"ఒక సనాతన మూఢత్వం/జాతర్లో గొర్రెపిల్ల గొంతు కోసినట్లు" అంటూ స్పష్టమైన దృక్పథంతో, తనదైన శైలిలో పోలిక పెట్టాడు. ఇక్కడ మొదటి పాదంలోనే సనాతనం అనేది మూఢత్వం అని నిర్ధారించాడు. ఆ మూఢత్వం పసిపిల్లల ప్రాణాలు తీస్తుందని ప్రకటించాడు. కనుక సనాతనాన్ని వ్యతిరేకించాలని ఈ కవితా పాదంలోని అంతఃస్సారం. ఇది లక్ష్యం పై గురి మాత్రమే కాదు, లోతైన కమిట్‌మెంట్ ఉన్నవాడు చేసే పని. అట్లా ఉన్నందునే దేని గురించి స్పందించి రాసినా, అందులో తను సాధించాల్సిన లక్ష్యాన్ని పొదుగుతున్నాడు. దీని వెనుక వర్ణించలేని లోతైన బాధ, అవమానం, అంటరానితనం, అణచివేత, ఆకలి, నిరాకరణ, నిషేధం, చిన్నచూపు, వివక్ష, సామాజిక బహిష్కరణ ఎన్ని ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. వాటన్నిటిని తరతరాలుగా అనుభవించిన వేదన నుండి పుటం పెట్టుకుని వచ్చి, తన జాతికి జరిగిన అన్యాయానికి కసిగా బదులు తీర్చుకునే లిటరరీ స్నైపర్ కోయి కోటేశ్వరరావు. అందుకే సూక్ష్మ దృష్టి, సుదూరాలోచన, అత్యంత ఖచ్చితత్వం, నైపుణ్యంతో, ఇంటెలిజెంట్ గా, తనని తాను లొకేట్ చేసుకొని శత్రువును టార్గెట్ చేసి లక్ష్య ఛేదనకు కృషి చేస్తున్నాడు.

"తెలుగు సాహిత్యాన్ని అస్తిత్వ చైతన్యం వెలిగిస్తున్న కాలం ఇది. పరాయీకరణలో ఎక్కడెక్కడికో కొట్టుకుపోయిన స్త్రీలు, దళితులు, బహుజన సబ్బండ వర్ణాల వారు అస్తిత్వ స్పృహతో తిరిగి తమ తమ మూలాలను వెతుక్కుంటూ, తవ్వుకుంటూ పోతున్నారు. సుదీర్ఘ శోధన తర్వాత తమ సొంత అస్తిత్వాన్ని కనుగొని గుండెల్లోకి తీసుకుంటున్నారు. తమను తాము తెలుసుకున్న జ్ఞానపు వెలుగులో తమ అసలు మూలాలను ప్రకటించుకుంటున్నారు." (వినోదిని, మాదాసు. శ్రీ శూద్రగంగ. 2024: 19) ఈ అవగాహనతో ఎప్పటినుండో కవిత్వం రాస్తున్న కోయి కోటేశ్వరరావు తెస్తున్న తన మొదటి పుస్తకానికి 'నాగస్వరం' అని పేరు పెట్టడానికి కారణం ఏంటనేది ఈ ఉటంకింపు చదువుకుంటే స్పష్టంగా తెలుస్తుంది. ఆ సోయి నుండే ఇకనుండి మన ఆలోచన, అధ్యయనం, చర్చ, దృక్పథం భౌతిక ప్రపంచంలో మన కార్యాచరణ ఎలా ఉండాలో ఈ ఆధునిక వామనుడు కవిత తెలియజేస్తుంది.

"ఇకనైనా హరేరామ భజన మానేసి/పచ్చి నిజాల్ని నెమరు వేసుకుందాం/బలి చక్రవర్తి నేరాన్ని గురించి కాదు /వామనుడు చేసిన సవాలక్ష ఘోరాల్ని గురించి/నిర్భయంగా పంచాయతీ పెట్టాలి" (ఆధునిక వామనుడు: 99)

అని మధ్యయుగాల చరిత్రల్ని ఫక్కున పలగజీరుతూ ఇటు ప్రాంతీయ, దేశీయాధిపత్య, అటు ప్రపంచాధిపత్య దుర్మార్గాలకు సవాలిసురుతున్నాడు. సైన్స్‌ని వదిలేసే,

సమానత్వాన్ని నిరాకరించే సనాతన భజనలను మానేసి నిజాలను, నిరూపణల మీద నిలబడి నిగ్గు తేల్చుకుందాం అంటున్నాడు. తమకు అనుకూలంగా రాసుకున్న బ్రాహ్మణీయ చరిత్రను తిరగదోడి తన మట్టి గొంతుతో 'నాగస్వరం' ఊదుతున్నాడు.

"నడక చేతగాని అసమర్థులే/బాటసారుల కళ్ళలో దుమ్ముగొట్టి /దారిని మాయం చేస్తారు/శ్రమకు శత్రువులైన పరాన్నాభుక్కులే/కపట మంత్రాలను వల్లిస్తారు" (నీటోపాఖ్యానం: 59) నిజానికి విద్యా వ్యవస్థకు సంబంధించిన సమస్యలపై చాలా తక్కువ కవిత్వం వస్తుంది. కానీ అకడమీషియన్ గా, విద్యా వ్యవస్థ లోటుపాట్లు తెలిసిన విద్యావంతుడిగా, తన జాతుల చదువుల పట్ల బాధ్యతతో స్పందించే కవిగా 'నీటోపాఖ్యానం' కవిత రాశాడు. ఈ శీర్షిక మిశ్రసమాసం. నీటోపాఖ్యానం = Neet Anecdote అంటే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ ఉదంతం అని అర్థం. వైద్య విద్య కోర్సులలో ప్రవేశం కోసం నిర్వహించబడే ఈ జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షా పేపర్ల లీక్ చేసిన ఘటనలో జరిగిన నష్టాన్ని చెప్తున్నాడు. అట్లా తప్పుడు పద్ధతుల్లో ప్రవేశం పొందాలని చూసే వారంతా పరాన్నభుక్కులై కపట మంత్రాలు వల్లిస్తారని అనే పాదంతో పేపర్ లీక్ చేసిన వారెవరో ఏ వర్గం వారో చెప్పకనే చెబుతున్నాడు.

"పాఠ్యపుస్తకాల మీద ఆదమరచి నిద్రపోతున్న/ 'అంటరానితనం నేరం' అనే శాసనానికి/సిగరెట్ ప్యాకెట్ మీద మెరిసే/చట్టబద్ధమైన హెచ్చరికకీ/వెంట్రుకవాసి తేడా లేదు"

తరగతి గదిలో కోయి కోటేశ్వరరావు చేతిలో 'అంటరానితనం నేరం' అనే కొటేషన్ కలిగిన పాఠ్యపుస్తకం ఉండగానే చిన్నచూపుకు గురైనాడు. ఆర్య పాలనలో ద్రావిడ జాతిలోని కడగొట్టు కులంలో పుట్టినందుకు సి. కాశీం చెప్పినట్లు ఇప్పటికీ ఏదో సందర్భంలో అకడమిక్ అన్‌టచబులిటి, ఇంటలెక్చువల్ అన్‌టచబులిటిని ఎదుర్కోవాల్సిందే. కోయి కోటేశ్వరరావు వలె ఎంతోమంది, ప్రతిరోజూ ఎన్నో చోట్ల అవమానాలకు, అంటరానితనానికి, వివక్షకు, గురౌతూనే ఉన్నారు. గుండె లోతుల్లో ఆ గాయం పచ్చిపుండై, పాఠశాలలో పాడే ప్రార్థనా గీతంలా పునరావృతమై ప్రతీ రోజూ తీపులు తీస్తూనే ఉంటుంది. ఆ విపరీతమైన మానసిక నొప్పిలో నుండి పుట్టుకొచ్చిన కవితే 'ఉలిపికట్టె'. సిగరెట్ ప్యాకెట్ మీద 'ఆరోగ్యానికి హానికరం' అని ఉన్నా ఎవ్వరూ పట్టించుకోకుండా, భయపడకుండా సిగరెట్ తాగుతూనే ఉంటారు. అట్లాగే 'అంటరానితనం అమానుషం, నేరం' అనే శాసనాన్ని లెక్కచేయకుండా అంటరానితనాన్ని పాటిస్తూనే ఉన్నారు. ఆ పాటింపును, పుస్తకంలోని కొటేషన్ పట్ల పట్టింపులేని తనాన్ని ఒక బాధ్యత గల భారతీయ పౌరుడిగా, కవిగా, పాఠాలు బోధించే అధ్యాపకుడిగా, అన్నింటికి మిక్కిలి ఒక బాధితుడిగా సిగరెట్ ప్యాకెట్ తో పోల్చుతూ నిరసిస్తున్నాడు.

ముగింపు:

గుండె గాయాలతో గేయాలు ఆలపించినట్టు నాగస్వరంలో యాభై కవితలున్నాయి. ఒక్కో కవితది ఒక్కో కథ. మనసు మెలిపెడుతూ, కన్నీటిని ఒడిపెడుతూ ప్రతి కవిత మనల్ని వెంటాడుతుంది. ఈ పుస్తకం చదువుతున్నప్పుడు కోయి కోటేశ్వరరావు నున్నితత్వం లోపల ఎన్ని కన్నీటి సముద్రాలున్నాయో మనకు ఊహించవచ్చు. అట్లాంటి పరిస్థితుల్లో కాలంతో కొట్టుకుపోయే కవులు కోకొల్లలు. కానీ కాలానికి ఎదురేగి దారి చూపే అతి కొద్దిమంది కవుల్లో కోయి కోటేశ్వరరావు ఒకరు. తెలుగు నేలకు తన సాహిత్య సేవతో ఎంత లాభం చేశాడో, ఇన్నాళ్లు తన కవిత్వ పుస్తకం ముద్రించకుండా అంత నష్టం కూడా చేశాడు. దేశంలోని ప్రజలకు కావాల్సిన కనీస సౌకర్యాలైన శౌచాలయాలు కట్టించలేనివారు ఆలయాల కట్టడాలు, ఆరంభోత్సవాలు చేస్తున్నారు. ఆసుపత్రుల్లో ఆక్సిజన్ అందించలేని వారు అమృతోత్సవాలని చాతి చరుచుకుంటున్నారు. దేశం లోపలి ఉగ్రవాదమైన కులాన్ని అంతం చేయలేరు కానీ, దేశం అవతల ఉగ్రవాదాన్ని మట్టుబెట్టామని చెబుతున్నారు. మతం సాక్షిగా అబద్దాలు. అడిగితే అసహనాలు. అన్ని సమస్యలకు పరిష్కారం రెండే మెడిసిన్స్ మతం, దేశభక్తి. కాదంటే దేశద్రోహి. వార్ వన్ సైడ్ అయిన వేళ ఇంత సూటిగా, తెగింపుతో 'నాగస్వరం' ఆత్మగౌరవ రాగం వినిపిస్తుంది. అంబేద్కర్ తాత్విక గానమై మార్మోగుతుంది. డా. కోయి కోటేశ్వరరావు కలం నుండి ఈ కాలానికి అవసరమైన ఎన్నో కవితా సంపుటులు క్రమం తప్పక తీసుకురావాలని ఆశిద్దాం.

ఉపయుక్త గ్రంథసూచి:

1. అంబేడ్కర్, బి. ఆర్. అస్పృశ్యులెవరు. హైదరాబాద్: డా. అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ, 1973

2. అశోక్ తేజ, సుద్దాల. శ్రీ శూద్రగంగ. హైదరాబాద్: వాక్కులమ్మ ప్రచురణ, 2024

3. Caldwell, Robert. A Comparative Grammar of the Dravidian or South-Indian family of languages, London: Horrison, 59, Pall mall, 1856

4. కాశీం, సి. అకడమిక్ అన్‌టచ్‌బులిటీ. హైదరాబాద్: సూర్య గ్రాఫిక్స్, 2020

5. కోటేశ్వరరావు, కోయి. నాగస్వరం. హైదరాబాద్: సాహితీ పబ్లికేషన్స్, 2024

6. యాదగిరి, చింతల. తీగో నాగో ఎన్నియలో. అలగడప: మట్టి ముద్రణలు, 2016

7. రవీందర్, బెజ్జారపు. తాటక. హైదరాబాద్: పాలపిట్ట బుక్స్, 2017

రచయిత: రీసెర్చ్ స్కాలర్, ఢిల్లీ యూనివర్సిటీ

జీవితమే పాటై పెనవేసుకొని వెలిగిన సాహితీ దీపం

శాఖమూరి రవి

నిన్న గద్దర్

నేడు అందెశ్రీ

రేపు మరెవరైనా సరే

ప్రధాని నరేంద్ర మోడీ సంతాపం తెలిపినా

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాడె మోసినా, అది ప్రజా సాహిత్యంలో పాటకు దక్కిన గౌరవమే తప్ప మరొకటి కాదు.

జీవితంలో తను అనుభవించిన కష్టాలను అధిగమించటానికి సాంత్వన పొందడానికి పాటను ఆశువుగా అల్లుకున్న అందె ఎల్లయ్య ప్రకృతిలో గడిపి, పాటతోనే స్నేహం చేసి, పాటని జీవితంగా పెనవేసుకొని అందెశ్రీగా ఎదగడం అంత సునాయాసంగా జరగలేదు. తానే చెప్పుకుంటున్నట్టు... అమ్మ తనను అనాథను చేసి వెళితే, పల్లెటూరే తనకు పని కల్పించి, ఇంత కలోగంజో పెట్టి, చేసిన కష్టంలో నుంచి శ్రమను మర్చిపోవడానికి జానపదం పాటను పాడుకుంటూ, శృంగేరి మఠంద్వారా ఇంత అక్షరజ్ఞానం నేర్చుకొని, సమాజాన్ని అధ్యయనం చేస్తూ, శ్రీకాకుళ జైత్రయాత్ర పోరాటాలు సృష్టించిన సాహిత్యాన్ని పరిశీలన చేస్తూ సమాజం కోసం సాహిత్యాన్ని సృష్టించాడు. ఆ సృష్టించిన సాహిత్యం ఒక తెలంగాణ రాష్ట్రానికి రాష్ట్రగీతంగా సుస్థిరస్థానం సంపాదించుకోవడం జరిగింది. అతను సృష్టించిన సాహిత్యం ఎంత గొప్పదంటే అతని మరణవార్త విన్న ప్రధానమంత్రి సంతాపాన్ని ప్రకటిస్తే, తెలంగాణరాష్ట్ర ముఖ్యమంత్రే అందెశ్రీ అంతిమయాత్రలో పాల్గొని, అతని పాడె మోసి, దగ్గరుండి అంత్యక్రియలు జరిపించాడు. అంటే అందెశ్రీకి ముఖ్యమంత్రి ఇచ్చిన గౌరవాన్ని చూస్తే ప్రజాసాహిత్యం ఎంత గొప్పదో అర్థం చేసుకుంటారు. ప్రజా సాహిత్యాన్ని సృష్టించాలనుకుంటారు. అందెశ్రీ సృష్టించిన సాహిత్యంలో మచ్చుకు కొన్ని పరిశీలిస్తే...,..

తల మీద సుట్ట బట్ట

ఆ పైన పండ్ల తట్ట

పండ్లు పండ్లోయమ్మ – అంటూ "పల్లెంతా తిరిగిన తెనుగోళ్ల ఎల్లమ్మయేది" అంటూ పల్లెల్లో ప్రపంచీకరణకు ముందు, తరువాత ముదిరాజుల జీవన విధానంలో వచ్చిన పరిణామ క్రమాన్ని, ఒక విధంగా చెప్పాలంటే ముదిరాజుల జీవన విధ్వంసం ఎలా జరిగిందో ఈ పాటలో మొత్తం వివరిస్తాడు. ఈ పాటలోకవి పల్లెల్లో దొరికే ఈత పండ్లు, అల్ల నేరేడు, తునికి పండు, చెరువు కట్టక దొరికే దుంపగడ్డలు, చింతచిగురు, జామ పండ్లు, చేపల పులుసు సువాసన పండ్ల తోటను గుత్తకు తీసుకొని తోటలోనే జీవనం కొనసాగించే విధానంతో పాటు ఎట్లా క్రమంగా జీవితం విధ్వంసమై వలస వెళ్లిపోతున్న విధానాన్ని అద్భుతంగా వివరిస్తాడు. గుండ్ల తుమ్మిదల వంటి అల్లనేరేడు పండ్లు అంటూ ఉపమాలంకారాలతో ప్రేక్షకుల్ని పాట మళ్ళీ మళ్ళీ వినాలనిపించే విధంగా చేస్తాడు. ఈ పాటను తానే స్వయంగా కామారెడ్డి లో జరిగిన ధూమ్ ధామ్ సభలో పాడుతుంటే వింటున్నంతసేపు మా ఊరు ఊరంతా తిరిగి అరటిపండ్లమ్మే ఓదెమ్మ గుర్తొచ్చి కండ్లమ్మటి నీళ్లు తిరిగాయి. ఇంకొంచెం వెనుకకు వెళితే మరో పాటలో



"పల్లె నీకువందనాలమ్మో

నన్ను గన్నపల్లె

తల్లి నీకువందనాలమ్మో

నాకు పాట నేర్పి

ఆట నేర్పి బతుకు బాట చూపినందుకు" – అనే పాటలో తన బాల్యం, జీవిత దృశ్యం కండ్ల ముందు కనబడుతుంది. బర్లగాసి పడ్డ కష్టాలు, డొక్కలలిసి ఆకలైన తీరు, అన్నం దొరకని తీరు, పక్క వాళ్ళు అవమానించిన తీరు అన్నీ తనవే ఆశువుగా అల్లుకోవడం జీవితం నేర్పిన పాఠం... పాటగా రూపాంతరం చెందింది. మరో పాటలో

"చూడ చక్కని తల్లి

చుక్కల్లో జాబిల్లి

నవ్వుల్లో నాగావెల్లి

నా పల్లె పాలవెల్లి" – అనే పాటలో తెలంగాణ సాంస్కృతిక జీవనం ఉట్టిపడేలా ఉంటుంది. తెలంగాణ ఉద్యమ సమయంలో ఈ పాట లేకుండా తెలంగాణ ధూంధాం లేదు. ఇది మా ఊరి పాటే అని ప్రతి ఒక్కరూ అనుకునే అంతగా కదిలించింది. ఉద్యమ పాటే కాకుండా సినిమాలో సైతం

"కొమ్మ చెక్కితే బొమ్మర

కొలిసి మొక్కితే అమ్మరా

ఆదికే ఇది పాదురా

కాదంటే ఏదీ లేదురా" అనే పాటలో తెలంగాణలో గ్రామదేవతల పుట్టుక భక్తి యుక్తులను తెలియజేశాడు.

ఇట్లా బడిలో నేరువని పాఠం ద్వారానే అనేక పాటల సృష్టించిన అందెశ్రీ తెలంగాణ ఉద్యమంలో చరిత్రలో ఎవరు సృష్టించలేని గాఢమైన చారిత్రక సంబంధమైన, సాంస్కృతిక సంబంధమైన "జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం" అనే పాటలో తెలంగాణ గతచరిత్రలో కవులు కళాకారుల సృష్టించిన సాహిత్య సంపాదను పోరాటాలు నడిపిన సమ్మక్క సారక్క సర్వాయి పాపన్న, మీరసాబ్ వీరగాథలు, సహజ సంపద ఖనిజ వనరులు జీవనదులకు జన్మనిచ్చిన తెలంగాణ వైవిధ్య సంపదను సాహిత్యంగా సృష్టిస్తాడు. ఇదే కాకుండా

"చూడు తెలంగాణ

సుక్క నీళ్లు లేనిదాన

నా గోడు తెలంగాణ

బతుకు పాడైన వీణ" – పాడే పాటలో దగా పడ్డ తెలంగాణ జీవన చిత్రాన్ని తెరిచి చూపిస్తాడు. ఒక జాతరలో జనం ఒప్పొంగి పూనకం వచ్చినట్లు రణ నినాదాలతో హోరెత్తించే పాట "జై బోలో తెలంగాణ". ఈ పాట తెలంగాణ ప్రజలు ఎట్లా వీరోచిత పోరాటాలు చేస్తారో, వాళ్ళ ఆత్మగౌరవం ఎంతటి త్యాగాలు చేస్తారో, ఆ త్యాగాల ముందు ఎవరైనా పారిపోవాల్సిందే అనే సవాలు విసురుతూ చావో రేవో తెలుసుకుని తెలంగాణ సాధించుకుందాం అనే విశ్వాసాన్ని నిలబెట్టే గొప్ప పాటను అందిస్తాడు.

ఇవి కొన్ని మచ్చుకు మాత్రమే... వీటితోపాటు కవిత్వం పద్యం సినిమా పాట తో పాటు ప్రపంచీకరణ నేపథ్యంలో అంతరించిపోతున్న మనిషి స్వరూపాన్ని అద్దం పట్టేలా

"మాయమై పోతున్నడమ్మా

మనిషన్నవాడు మచ్చుకైనా లేడు చూడు

మానవత్వం ఉన్నవాడు" – అన్న పాటలో మనసును కదిలించి హృదయాన్ని ద్రవీభవింప చేసేవిధంగా కవితాత్మకంగా కళాత్మకంగా తీర్చిదిద్దాడు.

ఇవే కాకుండా తన చరిత్రతో పాటు మలిదశ ,తొలిదశ తెలంగాణ ఉద్యమంలో కవి గాయకులు సృష్టించిన పాట, కవిత్వం, మొత్తం ఒకచోట పోగు చేసి "నిప్పుల వాగు" తెలంగాణ ఉద్యమ పాటతో అతిపెద్ద సంకలన పుస్తకాన్ని చరిత్రలో నిలిచిపోయేలా మనకు అందించి తాను మాత్రం భౌతికంగా మన నుంచి దూరమై ఒక నికార్సాయిన మనిషిగా, ఆత్మగౌరవం గల మనిషిగా తన సాహిత్యచరిత్రను చెరిపేయాలనుకున్న వాళ్ల చరిత్రను తన ధిక్కార స్వరంతో అంతం చేసి తన, "జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం" పాటను తెలంగాణచరిత్రలో నిలబెట్టుకోగలిగిన ఉద్యమ దివిటి. అట్టడుగు వర్గం నుంచి అత్యున్నత సాహిత్య శిఖరం దాకా ఎదిగిన సాహిత్య శిరోమణి అకాడమిక్ పాండిత్యాల తలదన్ని జీవితమే నేర్పిన పాఠంతో సహజ పాండిత్యాన్ని సృష్టించి డాక్టర్ అందెశ్రీ మారగలిగాడు, నంది అవార్డ్స్ అందుకోగలిగాడు. గుర్రం జాషువా చెప్పినట్టు...

రాజు మరణించె నొక తార రాలిపోయే

కవియు మరణించె నొకతార గగనమెక్కె

రాజు జీవించే రాతి విగ్రహముల యందు

కవియు జీవించే ప్రజల నాలుకల యందు...

అట్లా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా సాహిత్యాన్ని సృష్టించిన వాడు అందెశ్రీ. సాహిత్యాన్ని సమాజానికి అందించి సమాజంలో సాటి మనిషిని మనిషిగా నిలబెట్టే ప్రయత్నం చేయడమే మనం అతనికి ఇచ్చే గొప్ప నివాళి.

రచయిత: తెలుగు అధ్యాపకులు

RNI Number : APTEL/2011/37247 ISSN 2349-2376

Address for communication
Editor, Nadusthunna Telangana
Flat no. 301, Vaishnavi smart apartments,
street no.2, Kakateeya Nagar, Habsiguda,
Hyderabad - 500007